సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

సంపుటము 47
సంచిక 20
27-1-54

సచిత్ర వారపత్రిక
Founder : K. NAGESWARA RAO

విజయ పుష్య బహుళ అష్టమి బుధవారం

సంస్మరణ

ఓ మహాత్మా! ఓ తపస్వీ!
పుణ్యపురుషా! జగజ్జ్యోతీ!
నమోవాకములు! నమోవాకములు
నలుబదికోట్ల భారతీయుల
నమోవాకములు! నమోవాకములు!

నీవు చేసిన అఖండత్యాగం
దేశానికి అనంతభోగం
నీవు చెప్పిన సూక్తులసారం
లోకానికి మంగళగీతం!

అంధకారమున పయనించే
మానవలోకానికి ఆశాజ్యోతిగ
అవతరించిన ఓ దివ్యమూర్తీ!
నీరూపం మాహృదయంలో మాసి
పోదు
నీ తేజం మావదనంలో తీసిపోదు!
ఏసాధనలో తపించావో
ఏ కాలానికి ఎదురీదావో
ఏసత్యానికి నిలబడ్డావో
నీమార్గం ప్రతివర్గానికి ఆదర్శం!
నీవాదం ప్రతికాలానికి అజేయం!
ఏదో ఒక పశుత్వ
ఏదో కర్కోటకస్వరం
నిను కాటేసినా నీవు అమరుడవు
మహాత్మా!
అవతరిస్తావు అన్ని కాలాల్లో
ఆక్రమిస్తావు అన్ని దేశాల్లో!
ఓ మహాత్మా! ఓ తపస్వీ!
పుణ్యపురుషా! జగజ్జ్యోతీ!
నమోవాకములు! నమోవాకములు!

రెంటాల గోపాలకృష్ణ



గాంధిమహాత్ముడు
2-10-1869—30-1-1948.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:—సినీ తార
జానకి.

గమనిక
పంచతంత్రం

కారణాంతరాలవల్ల ఈవారం పంచతంత్రం ప్రచురించలేక పోయినందుకు చింతిస్తున్నాం. పై వారం నుంచి యథాప్రకారం ప్రచురించబడుతుంది. సం.

కాలక్షేపం

భోగా న భుక్తా వయమేవ భుక్తాః
తపో న తప్తం వయమేవ తప్తాః
కాలో న యాతో వయమేవ యాతాః
తృష్ణా న జీర్ణా వయమేవ జీర్ణాః॥

అర్థం:—భోగః = భోగములు; నభుక్తాః = అనుభవింపబడలేదు; వయమేవ = మేము మాత్రమే; భుక్తాః = (కాలముచే) భుజింపబడినాము; - తపః = తపస్సు; నతప్తం = తపింపజేయబడలేదు; వయమేవ = మేము మాత్రమే; తప్తాః = తాపత్రయములచే తపింపబడినాము; - కాలః = కాలము; నయాతః = గడవలేదు; వయమేవ = మేము మాత్రమే; యాతాః=పోయినాము, (జీర్ణించి గతించి పోయినాము); - తృష్ణా = ఆశ; నజీర్ణా = శిథిలము కాలేను; వయమేవ = మేముమాత్రమే; జీర్ణాః = శిథిలమై పోయినాము.

భోగములు మాచేత అనుభవింపబడలేదు. మేమే భోగములకు దాసులమై ఆ భోగములకు భుక్తమైనాము. తపస్సు అనేది మాచేత చేయబడలేదు. మేమే తాపత్రయముల చేత తపింపబడినాము. కాలము గడచి పోవుట లేదు - మేమే గతించి పోతున్నాము - మాలోని ఆశ అనేది శిథిలం కావడం లేదు - మేమే శిథిలమై పోతున్నాము.

నిప్పు అనేది కట్టెను కాల్చి వేసిన విధంగా, భోగాసక్తి అనేది యీ మానవ శరీరాన్ని దహించి వేస్తోంది అనే భావమును మన భారతదేశంలో అతి ప్రాచీనకాలం నుంచీ ఆత్మతత్వవిచారణచేసిన మేధానిధులు చాలామంది ఆలాపనచేశారు. అందువల్లనే ఆసక్తి అనేది చంపుకోవాలన్నారు. అనాసక్తియోగం సాధకం చేయవలెనన్నారు. రక్తిఅనేది విడిచిపెట్టి విరక్తి చెందిన విరాగులు చాలామంది తయారైనారు. ఈవిధంగా తపస్సుచేసిన విరాగులున్నూ బైరాగులున్నూ చేసినపని ఏమిటంటే, ఆకలిదప్పులు అణచివేశారు. నిద్రాహారాలు మానివేశారు. శ్వాసకూడా బంధించివేశారు. నిర్వికల్ప సమాధిలో చెక్కుచెదరకుండా ఉక్కుముక్కలవలె నిశ్చలంగా కూర్చుండగల శక్తిసామర్థ్యాలు సాధకం చేశారు. అటువంటి బ్రహ్మవిద్య మూలంగా వారు సాధించిన గొప్ప మహత్తు ఏమటయ్యా అంటే చాలామంది ఆయుఃప్రమాణమును వృద్ధిచేసికొన్నారు. వంద సంవత్సరాలు మాత్రమేగాక అనేక వందల సంవత్సరాలు కూడా జీవించగలిగిన సమర్థులైనారు. వారి విషయంలో మృత్యుభయం అనేది మృగ్యం.

శిలువమీద కెక్కించి ఏసుక్రీస్తును చేతులకూ కాళ్లకూ మేకులుకొట్టి చంపివేశారు. ఆ శిలువమీదకూడా, ఆ మహాత్ముడు కించిత్తయినా శరీరబాధ ననుభవించలేదు. ప్రాణం పోతున్నదనే గుండెదడ ఆయనకు కలుగలేదు. ఆఖరు క్షణమందు *"Father! Forgive them. They Know not what they do"* అన్నాడు. ("తండ్రీ! వారిని క్షమింపుము. వారు చేసినదేమిటో వారికే తెలియదు" అన్నాడు) ఆయనను శిలువమీద చంపివేయించిన ప్రజలందరూ అజ్ఞానులనిన్నీ, పొరబాటుగా చేసిన యీ పనికి వారిని క్షమించవలసినదనిన్నీ భగవంతుణ్ని ప్రార్థించాడు. అంతకన్నా అఖండమైన ఆత్మనిబ్బరం, అఖిల ప్రపంచ చరిత్రలోనూ కంచుకాగడా వేసి వెతికినా కన్పించదు. అటువంటి ఆత్మశక్తి ఆత్మబలం సాధించిన మహాసిద్ధునకు ఆత్మబలం అంటే ఏమిటో పూర్తిగా సాక్షాత్కారం అయినదని చెప్పవచ్చు. అటువంటి మహాత్ములు సిద్ధసంకల్పులు. గుడ్డివారిని ఆయన చేతితో తాకి కంటిచూపు రావాలంటే చూపు వచ్చేది - కుంటివానిని చేతితో తాకి, ఆ కుంటివాడు లేచి నడువవలెననికోరగానే, వాడులేచి నడచేవాడు. కుష్ఠరోగికి ఆ వ్యాధి పోవలెనని సంకల్పించగానే ఆ వ్యాధి పోయేది. ఆయన సిద్ధసంకల్పుడు. అంతేకాదు. సముద్రంమీద పెద తుపాను చెలరేగుతూ ఉంటే, ఆయన

ఒక పర్యాయము ఆ తుపానును గద్దించి "శాంతించు! శాంతించు!" అనగానే తుపాను శాంతించింది. జాడీలలో నింపిన నీటిని ముట్టుకొని "ఈ నీరు ద్రాక్షారసంగా మారిపోవలెను" అని సంకల్పించగానే ఆవిధంగా ఆ నీరు ద్రాక్షారసంగా మారిపోయింది. కనుక, యిటువంటి మహాసిద్ధులకు పంచభూతములున్నూ వంగి లొంగి సలాములు చేసెడి గులాములవలె ప్రవర్తిస్తాయి.

ఈ ఏసుక్రీస్తుమహాత్ముడే ఒకపర్యాయం ప్రసంగవశాత్తుగా అన్నాడు: "ఆత్మను జయించినవానికి జగత్తు వశమైఉంటుంది. ఆత్మను జయించలేనివాడు అఖిల ప్రపంచాన్ని జయించినప్పటికీ ప్రయోజనం లేదు." ఆత్మబలం అనేది ఒకటి సాటిలేని గలదైయున్నదనిన్నీ, బాహ్యప్రపంచం తా ఒక ఎత్తూ, యీ ఆత్మబలం టి ఒక ఎత్తూ అనిన్నీ, ఆయన లోకానికి చాటించాడు. చాటించడమే కాదు బాహాటంగా చూపించాడు. "క్రియాసిద్ధిస్సత్త్వేభవతి మహతాన్నోపకరణే" అన్నట్లుగా మహాత్ములయొక్క క్రియాసిద్ధి వారి సత్త్వయందు ఉంటుందగాని ఉపకరణముల ప్రభావంలో ఉండదు.

సరియైన సౌకర్యాలు ఉంటే, చక్కని జరుగుబాటు ఉంటే, ప్రజలు ఆరోగ్యంగా దీర్ఘాయుష్మంతులై ఉంటారని ఆరోగ్యశాఖాధికారులు వాదిస్తారు. ఇది కూడా ప్రత్యక్ష ప్రమాణంగా అంగీకరించవలసిన విషయమే. వీధులు పరిశుభ్రంగా ఉండాలి. గ్రామంలో మలినపదార్థం గాని, కుళ్ళిన పదార్థం గాని ఉండకూడదు. మల మున్నచోట దోమలపటాలం చేరుతుంది. అల్పాయుష్కులు ఎక్కువగా ఉన్నారంటే ఆస్పత్రులు వృద్ధి కావాలని వెంటనే అంటాము. ప్రజలలో అజ్ఞానం అధికంగా ఉందంటే, పేట కొక పాఠశాలను పెట్టించవలెనంటాము. ఇవన్నీ బాగానే ఉన్నాయి. కాని, యింతమాత్రంచేత మనలోఉన్న మాలిన్యం అంతా మాయమైపోయి, మనలోఉన్న అజ్ఞానంఅంతా అంతర్థానమైపోయి, జ్ఞానతేజస్సు మనలో ఆవిర్భవిస్తుందని భావించడం భావ్యం కాదు.

ఒక్క విషయం ఆలోచించాలి. జ్ఞానం సంపాదించడం అనేది యీ కాలంలో ఎటువంటి ధోరణిలోకి దిగినదంటే, సముద్రంలో చేపలు పట్టడంవంటిదనే ధోరణిలోకి దిగింది. జ్ఞానం అనేది మహాసముద్రం. ఆ సముద్రంలో అనేక శాస్త్ర రహస్యాలను చేపలు పట్టినట్లుగా పరిశోధించి, గాలించి, గాలంవేసి పట్టుకోవాలి. దీనినే శాస్త్రపరిశోధన అన్నారు. బయటి ప్రపంచంలోని వస్తువులను పరిశోధన చేస్తున్నారు. ఆ వస్తువుల తత్త్వపరిశోధన చేస్తున్నారు. ఆ వస్తువులయొక్క అణువులు ఏవిధంగా ఏర్పడి ఉన్నాయో అట్టి అణువుల సంయోగం ఏవిధంగా ఉన్నదో ప్రయోగాలు చేసి చూస్తున్నారు. అణుసంయోగంలో ఉన్న శక్తిప్రభావం కనిపెట్టుతున్నారు. ఆ పరమాణు శక్తిని పరిశీలిస్తున్నారు.

ఈవిధంగా అనేక అద్భుత అపూర్వ అగాధ విషయాలను జ్ఞాన సముద్రములో వల వేసి చేపలను పట్టినవిధంగా పట్టుకొనుచున్నారు. కాని ఒక్క ధర్మసందేహం కలుగుతోంది. ఈ సముద్రంలో ఉన్న చేపలను అన్నింటినీ పట్టుకొనడం ఎప్పటికి పూర్తి అవుతుంది? సముద్రంలోనుంచి ఎన్ని చేపలను మనము పట్టుకొంటామో ఇంకా అన్నిరెట్ల చేపలు సముద్రంలో ఉంటాయి. "శాస్త్రము లపారములు మన్కి క్షణికతరము" మన జీవితము, మన మనుగడ క్షణప్రాయం. ఈ స్వల్పజీవితకాలంలో మనం యీ జ్ఞానసముద్రం అంతా శోధించి అనంతమైన జ్ఞానమును అరచేతిలోని అరటిపండులాగున కరతలామలకం చేసికొని జ్ఞానసిద్ధిని పొందగలమా?

జ్ఞానం అనేది అనంతమైనది. శాస్త్రజ్ఞానం ఎంత సంపాదించుతామో అంత పరిమితికి, అంత మేరకు, మన అజ్ఞానం తొలగిపోయిందని గ్రహించాలి. శాస్త్రజ్ఞానం ఎంత సంపాదించినప్పటికీ దానికి అంతులేదు. "సత్యం జ్ఞాన మనంతం" అన్నారు. కాబట్టి ఎంత జ్ఞానం సంపాదించినా, ఇంకా అంత అజ్ఞానం మనలో మిగిలి ఉంటూనే ఉంది. అనంతమైన అజ్ఞానం ఇంకా మనలో మిగిలిఉంటూనే ఉంది. సముద్రంలో ఉన్న చేపలను ఎన్ని పట్టుకొన్నప్పటికీ, ఇంకా పట్టుకోవలసిన చేపలు అనంతంగా అబ్ధిగర్భంలో మిగిలి ఉంటూనే ఉన్నాయి. అనంతమైన అజ్ఞానం మిగిలిఉంటూనే. ఉంది. జ్ఞానం ఎంత అనంతమైనదో, అజ్ఞానం కూడా అంత అనంతంగా ఉంది. "అనంత స్వరూపుడు భగవంతుడు" అన్నారు. జ్ఞానం అనంతమైనది గనుక జ్ఞానమే భగవంతుడు అన్నారు. అలాగయితే, అజ్ఞానం కూడా అనంతమైనదిగానే లెక్క తేలింది. కనుక అనంతమైన అజ్ఞానం కూడా భగవంతుని స్వరూపం అని చెప్పకతప్పదు. అజ్ఞానం అంటేనే మాయ. కనుక యీ మాయాదేవి కూడా భగవత్స్వరూపమే.

అయినా, అసలు జ్ఞానం అంటే ఏమిటో అజ్ఞానం అంటే ఏమిటో సమగ్రంగా సవ్యం

★ కాలక్షేపం ★

గా తెలియని అజ్ఞానస్థితిలో ఉన్నారు కించిజ్ఞులైన మానవు లందరూ. జ్ఞానం అంటే ఏమిటో అజ్ఞానం అంటే ఏమిటో తెలియని స్థితిలో అంతా అజ్ఞానమే. భౌతికశాస్త్రవిజ్ఞానంకూడా అజ్ఞానంలోనుంచి జ్ఞానంలోకి నడుస్తూ ఉంది. "తమసోమా జ్యోతిర్గమయ" అన్నట్లుగా తమస్సులోనుంచి అనగా చీకటిలోనుంచి వెల్తురులోనికి మనను దారి చూపించి నడిపించేవాళ్లు కావాలి. అసలు వెల్తురు అంటే ఏమిటో కొంతకాలంవరకూ శాస్త్రవేత్తలు సరిగ్గా నిరూపించలేకపోయినారు. కాంతి కిరణాలు అనేవి బాణాలు పోయినట్లుగా ఒక్కటే సమరేఖలో నడిచి ఆకాశంలో పోతూఉంటాయి అని తెలిసికొన్నారు. కాంతి కిరణగమనం సమసరళరేఖమీదుగా ఉంటుందన్నారు. కాని మరికొంతకాలానికి కాంతికిరణాలు రేఖలు గాగున ఆకాశంలో ప్రయాణం చేయావు అనిన్నీ, కిరణాలు అనేవి ఎగుడుదిగుడు నడకతో తరంగాలవలె పోతూ ఉంటాయనిన్నీ నిర్ధారణ చేశారు. సూర్యకిరణం మన కంటికి తెల్లగా ఉన్నప్పటికీ అందులో ఏడు రంగుల కిరణాలు కలిసిఉన్నాయని విభజించారు. ఆ ఏడురంగులున్నూ ఒకదానికంటె ఇంకొకటి తరతమ వేగాలతో నడుస్తూ ఉంటాయన్నారు. అన్నింటికంటె అధమస్థంగా ఉన్న ఎర్ర కిరణముకంటె తక్కువైన కిరణాలు మన కంటికి తాకినప్పటికీ, మన బుద్ధికి అవి గోచరించవు. ఊదారంగు కిరణంకంటె అతీతమైన అతిలోహిత కిరణములు మన కంటికి తగిలినప్పటికీ అవి బుద్ధికి గోచరించవు. కాబట్టి కాంతికిరణం అంటే మన కంటిద్వారా గ్రహింపదగినదే కాంతి అని వాదించినట్లయితే, మన కంటిద్వారా మనం గ్రహింపలేని కాంతి కిరణాలుకూడా ఉన్నవని జవాబు చెప్పవలసి వస్తుంది. మనలను చీకటిలోనుంచి వెల్తురులోకి నడిపించినప్పటికీ, కాంతిని గాని, కాంతి కిరణ లక్షణ ప్రభావమును గాని పూర్తిగా గ్రహించగల శక్తి మనకు లేదు. కాంతి అంటే ఏమిటో గాని స్వభావ ప్రభావము లెటువంటివో ఇంకా మనం, అనగా మన శాస్త్రవేత్తలు పరిశోధించి పరిశీలించవలసివుంది. "కాస్మిక్ కిరణాలు" అనేవానిని గూర్చి యింకా పరిశోధనలు జరుగుతున్నాయి. సర్ సి. వి. రామన్ గారు స్ఫటికములగుండా కాంతికిరణాలు ఎట్లా ప్రసరిస్తాయో, పరిశీలిస్తున్నారు. రత్నమాణిక్యాలగుండా కాంతి కిరణములు ఏవిధంగా ప్రసరించి ఏవిధమైన తేజస్సును యిస్తున్నాయో సర్ సి. వి. రామన్ పండితరత్నం నేడు పరిశోధించి తెలుసుకుంటున్నాడు. అందుమూలంగా అట్టి విమల రత్నములను *Opals* తయారుచేయుటకు తగిన సాధనోపాయములను నిర్ణయిస్తున్నారు. ఈవిధముగా వెల్తురు అంటే ఏమిటో, కాంతికిరణములు అంటే ఎటువంటివో, తేజస్సు అనేది మన మనస్సుకు ఏవిధముగా అతీతమైనదో, ఇంకా ఇంకా పూర్తిగా బోధపడవలసియున్నది. కాబట్టి జ్ఞాన తేజస్సు అంటే ఏమిటో మనకు సవ్యంగా సమగ్రంగా తెలియని పరిస్థితిలో, మనకు ఎంతవరకు తెలిసిందో అదే నిజం, అదే జ్ఞానం అనుకుంటాము. జ్ఞానం అంటే ఏమిటో తెలియని అజ్ఞానం మనది. అనంతమైన జ్ఞానం ఉన్నట్లుగానే అనంతమైన అజ్ఞానం ఉంది.

ఈ విధంగా శాస్త్రపరిశోధనలు ఎంతకాలం చేసినా, బయటి ప్రపంచాన్ని, బాహ్యజగత్తును ఎంత తరచిచూచినా అంతులేని సముద్రంలో అంతులేని చేపలను పట్టడం అవుతుంది. ఆ కారణంచేత, జీవితకాలం చాలదు. "శాస్త్రము లపారములు - మనికి క్షణికతరము."

అందుచేతనే, భారతదేశంలో ప్రాచీన మహర్షులు ఈ విధంగా భౌతిక పరిశోధన చేయడంకంటే, ఆత్మపరిశోధన చేయడం సర్వోత్కృష్టం అన్నారు. "జ్ఞానం అనేది నీలోనే ఉన్న"దన్నారు. బ్రహ్మాండం అంతా నీలోనే ఉన్నకనుక "నీ ఆత్మశక్తి ఏమిటో పరిశోధన చెయ్యి" అన్నారు. "నీలో ఉన్న గొప్పదనం నీలో ఉన్న బ్రహ్మాండమైన శక్తిని నీవు గ్రహించవోయి! నీవే బ్రహ్మవు అనగా బ్రహ్మాండమైన శక్తివి అనే విషయం తెలిసికో" అన్నారు. ఇదే బ్రహ్మవిద్య - ఇదే ఆత్మపరిశోధన. ఇదే ఆధ్యాత్మికవిద్య - ఈ విద్యకు పుట్టినిల్లు భారతదేశం. "నిన్ను నీవు తెలుసుకుంటే బ్రహ్మంతవాడవు" - భారతజాతి ఏనాడు ఈ బ్రహ్మవిద్యను మరచిపోయిందో, ఏనాడు బ్రహ్మవిద్యను ధిక్కరించి, తిరస్కరించి త్యజించిందో అనాడే యీ భారతదేశం భూభారదేశం అవుతుంది. ఆనాడే భారతదేశం జ్ఞానోపదేశం లోకానికి ప్రత్యేకించి చేయదగినది ఏమీ ఉండదని గ్రహించాలి.

ఆత్మశక్తిని పరిశోధించి, యోగవిద్యను వికసింపజేసి, మహాత్ములకు పుట్టినిల్లయిన భారతదేశం వారి విభూతి భస్మమును తీసి లోకానికి ఇదే "విభూతి రక్ష" యని మంత్రించి యివ్వవలసియున్నది.

గతించిపోయేది యీ శరీరం - ఆమాట నిజమే - కండ్లతో చూడవలసిన సినిమాలు అన్నీ చూడవలెననే కోరిక ఉంటుంది. నోటికి కింపుగా తినవలసిన బాదంహల్వా ప్లేట్లు అన్నీ తినవలననే కోరిక ఉంటుంది. అందువల్ల, కంటికి కింపుగా చూచే కళ్లు మూసికొని పోతూఉంటే ఏడుస్తాం - నోటికింపుగా తినేనోరు బిగిసికొని పోతూ ఉంటే ఏడుస్తాం - కాని, యోగ శక్తి ద్వారా అనుభవించగల్గిన ఆత్మానందం పొందలేకపోతినిగదా అని పరితపించి విలపించి కంట తడిపెట్టేవాడు లేడు. ఈ ఆత్మానందం చవిచూచినవానికి, దేహం శిథిలం అయినా లక్ష్యం లేదు. ఇంకా భోగాలు అనుభవించలేకపోతినిగదా అనే విచారం ఉండదు. శరీరం జీర్ణించిపోయినా, "హా! పోయెనయ్యో ననుబాసి" అనే విరహవేదనతో ఏడువడు. స్థిరమైనదేదో చేతికిచిక్కినదనే సంతోషంతో అస్థిరమైనదానికోసం సంతాపం కలుగదు. ఆత్మకు భీమా చేసినవాడు శరీరానికి భీమా చేయడు. శరీరానికి విలువ కట్టడు. "హా! పోయెనయ్యో" అని విలపించడు. కాని, అస్థిరమైనదానినే నమ్మినటువంటి భౌతిక శాస్త్ర వ్యామోహ ప్రపంచం ఎప్పుడూ ఆత్మజిజ్ఞాస చేసేవాళ్లనుచూచి వెక్కిరిస్తుంది.

భద్రయ్యా, రుద్రయ్యా, పరస్పరంగా వియ్యంపొందినవియ్యంకులు - ఇద్దరూ పెద్దవాళ్లే - యించుమించు షష్టిపూర్తియైన సమవయస్కులు. తమ పిల్లల వివాహం అయిన తర్వాత మంచిరోజు చూచి ఉత్తర దేశతీర్థయాత్రలు సేవించాలని పూర్ణయాత్రా స్పెషలుమీద బయలుదేరారు. గయ, ప్రయాగలలో పితృపిండ ప్రదానాలు చేశారు. పిండప్రదానం చేసి తమ బట్టలను ఒడ్డున రేవులో ఉతుకుకొని బసకు పోవాలని నిశ్చయించారు. భద్రయ్య మొదటినుంచీ రేవులలో చాలా జాగ్రత్తగా స్నానాలు చేస్తూ, గట్టిరాళ్ళు ఉన్నచోటనే అడుగుపెట్టి ప్రవాహంలో కొట్టుకొనిపోకుండా కట్టుదిట్టంగా భద్రంగా ప్రవర్తిస్తున్నాడు. అందువల్ల భద్రయ్య ఆ రేవులో ఎక్కడైనా గట్టిగా కదలకుండా ఉండేరాయి ఏదైనా ఉన్నదేమోనని వెతికి చూచాడు. నల్లని రాతిదిమ్మ సుందరంగా కన్పించింది. మెల్లగా దానిమీద ఎక్కి ఒక ధోవతీ ఉతుకుతున్నాడు. ధోవతీ చక్కగా పిండి బుజాన వేసికోవలెనని ప్రయత్నిస్తూఉండగా కాలికిందనుంచిఅనల్ల

(55-వ పేజీ చూడండి)

ఆర్ష రామాయణంలో అహల్య

దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి

[వాణీ హిరణ్యగర్భులు ధర్మ సంరక్షణకై భూలోకంలో ముని దంపతులై జన్మించేరు. వారికి శ్వేత - అహల్య - అని యిరువురు పుత్రికలు. యుక్త వయస్సు రాగానే అహల్యను గౌతమునికిచ్చి పెండ్లి చేసేరు. ఈ దంపతుల సంతతే అంజనీదేవి - శతానందుడు.]

[అహల్యా గౌతములు]

"అహల్యా! చిత్తశుద్ధీ - మనో నైర్మల్యమూ - కుదరాలంటే గృహం బాగుండాలి. గృహం బాగుండాలంటే గృహిణి బాగుండాలి. బాగంటే ఆకార వికారాల్లో కాదు."

"ఔను. నా కర్థమైనది తమ ఊహ. ఆదర్శగృహిణి తనగృహాన్ని స్వర్గతుల్యంగా చేసి, పతిసేవకు ప్రాధాన్యం ఇచ్చి, తదానందంలో భాగం పంచుకోవాలని కాదూ తమ బోధ? ఆర్ష సంప్రదాయంలో అంతకంటె గృహిణులకు కావలసిన దేముందీ?"

"ఐతే ఆర్షసంప్రదాయం మాత్రం అర్థం కాని అగాధం - అడుగడుగు గండాలూ - అంతులేని యాత్రాను. ఎంతో మెలకువా - దీక్ష - ఉంటేనే గాని గట్టెక్క వ్యవహారం కాదది. ఏమైనా ఈ ధర్మసముద్రాన్ని దాటాలంటే నీలాంటి సత్పత్నులే గతి. అప్పుడే అది సుగమమూ, సుఖతరమూ అవుతుంది."

"పతిదేవుల భవ్యకరుణ. అది అంతగా తాము అగ్గింపవలసినది కాదు. ఇంతకూ మీ పుణ్యంలో భాగం ఉన్నపుడు మీ కష్టనష్టాలల్లోమాత్రం మాకు భాగం వద్దా? ఇదేమంత గొప్ప?"

"అది విశేషించి నీయందు. నా కీర్తి ప్రతిష్ఠలకూ, నా అంతశ్శక్తికీ - నా దృఢతర దీక్షాసాధనకూ ముఖ్యకారణం నీవు. నీ పతిభక్తి నీ జాతికి సువర్ణాక్షరాల ఒరవడి. నన్ను కొంచెమైనా ఋణవిముక్తుని చెయ్య దలచుకుంటే ఒక్క వరం...కోరుకో"

"వరమా! మీరే నా వరం. మీ నిశ్చల వాత్సల్యమే నా వరం. తమ సేవే దాని ఫలం."

"కాదు అహల్యా! కాదు...బలవంత [illegible] నేనే అనుగ్రహిస్తాను నీకు. నీవు ఏ కార్యం తలపెట్టినా విజయం తప్ప పరాజయం లేదు. ఇది సంపూర్ణ తృప్తితో నేనిచ్చిన వరం."

"నా గృహిణీత్వం విశేషంగా అనుగ్రహింపబడింది."

[కాలం కొంత గడచినమీద అహల్యా గౌతములకుగలిగిన అంజని అను పుత్రికనూ, శతానందుడను పుత్రునికీ కూడా తగిన సంబంధాలు కూర్చి పెండ్లిండ్లు చేస్తారు. జనస్థానమును పాలించే ప్రకౌవహుని పుత్రికను జనతిని శతానందుని కిస్తారు. ఈ శతానందుడే జనకరాజు పురోహితుడు.]

[అహల్యా గౌతములు]

"(గడ్డం నిమురుకుంటూ) ఈ దినం కారణమేమో గాని శిష్యులు అధ్యయనమునకు రాలేదు. పాపము. మంచికి అన్నీ విఘ్నాలే.



ఆర్షరామాయణంలో అహల్య

ఎక్కడి మ్లేచ్ఛమండలము - ఎక్కడి గౌతమాశ్రమం. అన్నిటికంటే మన వియ్యంకుడు ప్రకౌవహుని అడ్డంకులు వారి కడుగడుగునా తప్పటలేదు."

"మన వియ్యంకుని బాధ మన శిష్యుల కేల? వారికీ వీరికీ సంబంధబాంధవ్యాలేమున్నాయి?"

"కలహానికి సంబంధాలు కావాలంటావా? ఉత్తముల బాధించుటే మూర్ఖులభుక్తి. మన శిష్యులు ఉదగ్వ్యజాతికి చెందినవారనీ, వారు మధుమాంసభక్షకులనీ, తన జనస్థానం మీదుగా వారు నడువరాదనీ, ఆయన చండశాసనం"

"తనకెంత తోచితే అంతేనా! యుక్తాయుక్తం లేదా? నిత్యమూ పుత్రప్రాయులైన విద్యార్థుల కిదో అడ్డమూ?"

"అయ్యో వెఱ్ఱిదానవు. ఈనాటిదా ఈ సమస్య?, ఇదొక పెద్ద అక్ష్య నాటకం మన శిష్యులకు. వాళ్ళెన్నోసార్లు మనవి చేసుకున్నారు నాకు. గౌరవార్హుడైన వియ్యంకుడుగదా. పైగా అతడు పాలకుడు. మండలాధిపతి. ఏంచేసేది?"

"స్వామీ! అదా అనవలసినమాట? ప్రజలను తీర్చిదిద్ది పోషింపకపోతే పోయెగాని వారి రాకపోకలకూ - వారివాంఛలకూకూడా అడ్డేనా? ఇదెక్కడి రాచపాడి?"

"బంధుకలహం బంధకాలకు కారణమవుతుందని ఈ విషయం అంతగా నా మనస్సుకు రానీయను. ఐనా ముక్కుమూసుకొన్న మాకీప్రపంచంతో చిట్టంటులెందుకు?"

"పతీ! ధర్మం నిలుపవలసినబాధ్యత పరిపాలకుల కెంతో - ప్రజలకూ అంతే. - మౌనులు ప్రజలు కారా? కొంపలు అంటుకున్నప్పుడు నీళ్ళుచల్లుటలో నా మీమాంసం? వనౌకసులైతేమాత్రం లోకజ్ఞత వలదా?"

"వెఱ్ఱిదానా! దుర్బలత్వం వాదికిగాని వాదానికిలేదు. ఆపని నీవు సవరించు. చూద్దాం"

"అదెంతపని! తమ వరదానం విస్మరించలేదు. ఐతే తామన్నట్టు వ్యర్థంగా ఆ స్త్రీ విషయంలో మొహమొహాలు మాపుకోవడమా అని ...... పోనీ - దూత ముఖంగా ప్రకౌవహునికి తెలియ చెబుదాం. పెడచెవిని పెట్టేడా? మూడుగడియలలో ఈ అభ్యంతరాలు పటాపంచలు. నాదే విజయము"

[దూతకార్యం నడిచినా తనలోపము తాను సవరించుకోలేదు ప్రకౌవహుడు. అహల్య పతిసెలవుపొంది ఉదగ్వ్యుల సాయాన్న అతని జయించి రాజ్యం ఆక్రమించి శిష్యులవశం చేస్తుంది]


* * *

[నారదుడు - ప్రకౌవహుడు]

"ఎందుకూ లేదు నాకు. ఆడది. యుద్ధంలో మండలాధిపతిని పలాయనం చేయుట - ఇది ఎన్నడూ విన్నదీ కన్నదీ కాదు. ఇక్కడిది జరుగుట తపవుగా మా లోకందాకా అది ప్రాకనా? ఏమి గుసగుసలు!!"

"మౌనీ! ఆడుది!! ఆ మహాప్రభావం - ఆ యుద్ధనైపుణ్యం - అబ్బా! అహల్య ఆడుదా? వేయిమంది వీరుల పెట్టు అంటే నమ్మండి. ఏంచెయ్యను? నా శక్తియావత్తూ వినియోగించేను. (విచారసూచకంగా) పెదవి దాటితే పృథివి దాటదా మౌనీ?"

"దానికేమిలే రాజా! జయాపజయాలు



రిపబ్లిక్ దినోత్సవం

చిత్రకారుడు:—టి. ఎస్. రాఘవన్ (బెంగుళూరు)

ఆర్షరామాయణంలో అహల్య

మనం చెప్పినట్లు కలిసివచ్చేవి కావు. అంత మాత్రంచే మీరు క్రుంగిపోవలసిన దేమీ లేదు. సాధనకు సహస్రమార్గాలు."

"అంత అదృష్టమా నాకు? ఏదీ ఆ సహస్రంలో ఒక్క దారి?"

"దాని కేమున్నదయ్యా! అహల్యను లొంగదీయుట చిటికలో నీవు సాధించగల పని - నీ పుత్రిక వారింటి కోడలేగా! ఇలా చెయ్యి-

[చెవిలో ఊది వెళ్లిపోతాడు—వెంటనే ప్రక్రొవహ దంపతులు మునిదంపతులుగా మారి గౌతమాశ్రమకు స్నానానికిపోయే దారిలో ఒక అఊప నిర్మించి అందు నివసిస్తూ ఉంటారు.]

[అహల్యా గౌతములు]

"పత్నీ! తొలికోడి కూసింది. ఇది నా స్నానానికిపోయే సమయం. నా గావంచా-కమండలువూ - జపమాలా - తెచ్చిపెట్టు."

"(సంకోచంతో) ఈరోజు ఆకాశం మబ్బులతో నిండిఉంది. ఈదరగాలి విసిరి కొడుతోంది. తుంపర కూడాను. పోనీ - మన దిగుడుబావిలో ఈ రోజుకి..."

"ఆ...స్నానం చేసేవాణ్ణి వాన బాధిస్తుందా? తేతే."

"జనతీ! జనతీ! మీ మామగారికి గావంచా - కమండలువూ - జపమాలా - పట్టుగురా అమ్మా!"

[కోడలు తెచ్చి అందిచ్చును. గౌతము డందుకొని నదికి దారితీస్తాడు. వాన క్రమక్రమంగా హెచ్చింది. ముని దారిచెంతనున్న అఊపక్రిందికి చేరి నిలబడి ఉంటాడు. అందున్న దంపతుల సంభాషణ.]

"జానే! నువ్వు మామూలుగా గౌతమాశ్రమానికి వెడుతున్నావా?"

"ఆ. ఏమాలాగ క్రొత్తగా అడుగుతారు?"

"లేదులే - ఈమధ్య నీవు వెళ్ళినదీ - వొచ్చినదీ కూడా తెలియడంలేదులే-అందుకని..."

"మీ దారీ - మీలోకం - మీది. మా దారీ - మా సొదలూ మావి. మేము ఏమైతే మీకు కావాలి? ఈమధ్య..."

"కొత్తగా మాటాడనేర్చేవే! ఎందుకొచ్చిందీ ఈ మార్పు? ఏమిటా అర్థోక్తి?"

"ఏమీ లేదు లెండి -అది మీదాకా రావలిసినదికాదు."

"ఇదే మీ లోవున్న దుర్లలితత్వం. ఎక్కడచూచినా స్త్రీ అంత తేలికపడిపోవడంకూడా ఇందుకే. నీ - నా, నడుమనా ఈ దాపరికం?"

"కోపించకండి ఇంత ట్లో; పిసరంత తేడా వొస్తే శాపాలూ - శాపాలూను. మీతో చచ్చిచావు. దాపరిక మేముంది లెండి. రెండు నెలలనించి నేను అహల్యాదేవి సేవ విడిలించుగున్నాను."

"కారణం?"

"నేను ఒకప్పుడు వెళ్ళి అదాటుగా తలుపు తోసేసరికి అహల్యా - ప్రక్కనే శచీపతీని - ఏకశయ్య - నా ప్రాణం చచ్చిపోయింది. గిరుక్కున వెనక్కి తిరిగేను."

"శివశివా! శాంతం పాపం, ఆ అమాయికుణ్ని బుట్టలో వేసిందన్నమాటే అహల్య. ఊరికే అన్నాడా భార్యా రూపవతీ శత్రుః"

"అంతేనా! "నీ సావాసం చేస్తున్నది మొదలు నేను ఆ ముగుకమునికి వండిపెట్టుట తప్ప ఇతరసుఖాలు విరమించేను దేవపతీ" అని కూడా ఆమె ఆతనితో కేరింతాలు"

[గౌతముడు వింటూ] "ఏమిటిది? వీరి సంభాషణ నన్ను తాకుతున్నదే. ఆ - అహల్యా - శచీపతితో ఏకశయ్యా:! ఎంత మాటా? ఎంత నాటకము [కొంచెము నిదానించి] అదెవరినిగురించో. అనుమానం పెనుభూతం - ఐనా..."

"ఓహో! అగా కథ అహల్యా గౌతమీ, తారా, పతివ్రతలలో అగ్రస్థానమూ - చేసే చేష్టలు ఇవా! నీకూ ఇలాటి బోధలేనా ఆ యిల్లాలు చెప్పేవి?...అసలు ఆ జడదారి గౌతముని పద్ధతికూడా తగ్గట్టే వుందిలే - ఏమిటో ఏంస్లతరబడి ఆ దీక్షలూ గీక్షలూను"

(గౌతముడు) నా పద్ధతా! మేము బ్రహ్మచర్యంలో ఉన్నట్టు వీరి కెలా తెలిసిందో? తప్పక ఇది అహల్య దుశ్చర్యని ధ్రువపరుస్తోంది. అబ్బా! దుర్భరం - కడుపు దేవుకు పోతోంది. అహల్య - శచీపతి దేవరాజును ...సరే భార్యా రూపవతీ...హంత"

[గిరుక్కున వెనుకకు తిరుగుతాడు. పది అడుగులలో పర్ణకుటిని చేరేడు - నాటి నుండీ తన కుటీ కుటీ మమే శరణ్యాం - ఆకార వికార గోపనం - అగ్నోక్షులు - అతి మానము - ఇదీ గౌతముని ప్రవృత్తి - కొంత కాలం గడిచినది]

అహల్యా గౌతములు

"స్వామీ! అడుగవచ్చా? దయతో సమాధానం ఇప్పిస్తారా? అనుగ్రహంగా ఆగ్రహమా యిది?"

"ఆగ్రహాని కేముంది?"

"ఏమో! తమ ప్రవృత్తిలో - దృష్టిలో - ఏదో మార్పు - ఏదో అసంతృప్తి - ఆలోచన - నగ్నంగా నటిస్తున్నాయి మీ ముఖంలో"

"ఔను. ఇది నగ్న నాటిక - సత్యం - సత్యం—"

"అదుగో! ఇదమిత్థం అనలేకుండా ఉన్నాను. మానీ! చవికెనం ఈనగుమ - నవ్వుతూ - నాలుగుమాటలు లేవు - కారణం అనూహ్యం"

"(ఆకార గుప్తితో) అహల్యా! ఏమీ లేదు. ఈ సంసారభోగాలు మహామానులను కూడా గిలగిలలాడిస్తాయి"

"అదుగో! ఏదో ధ్వని - ఏదో వ్యంజన - నా గుండెలలో అండలు కూలుతున్నాయి—"

"(చిన్ననవ్వుతో) ఏమూ కంగారు? ఏమీ లేదు - మనస్సు మహా చెడ్డది. అతి సున్నితం - ఏ ఆఘాతం తగిలినా అది వెన్నపూస"

"ఆఘాతమా! తమకా! తమ మనస్సుకు ఆఘాతమా?"

"(చల్లబడి) ఆఘాతమంటే - విశ్లేషము - చెదిరిపోయినదాన్ని కూడగట్టుకోవాలిగదా - కరగిన నెయ్యి గడ్డకట్టుటకు కాలం కొంత అవసరం—"

"ఏమో - ఆట - తమరు తమరుగా అంటున్న వేనా ఈమాటలు - స్వామీ - బెందుమునిగి గుండు తేలుతుందా?"

"ఏమిటా తహతహ? ఎందుకా దైన్యం?. ఆడదానివి-అంతే. విను - అధ్యయనం నిమిత్తము పొరుగూరు వెళ్లిన శతానందుడు కొంచెం - అస్వస్థత - అయిగారేళ్లయింది అతడు మన గృహం వదిలి - పాపం - జనతి—"

"(వైవర్ణ్యంగా) నాయనకు అస్వస్థతా? అయ్యో! ఎంచేతో...ఎలా వుంటుందో? పతీ! ఈ విషయం పాపం జనతికి తెలియనీకండి బెంగపడుతుంది వెర్రిపిల్ల."

"ఆ జాగ్రత్త ఉండవలసింది నీలో - అబ్బాయిని చూడడానికి రేపు నాపయనం - తత్ప్రయత్నంలో ఉండు."

[తెల్లవారింది - గడియలో వంటకములు తయారుచేసి పతికి నివేదించింది అహల్య - మూటాముల్లీ సద్దింది. మునిని ముంగిలిదాటే వరకూ సాగనంపింది. పాదాభివందనంతో మరలింది - గౌతముడు పోవుట అభినయించి ఆనాటిరాత్రి కుటీరసమీపమందున్న ఒక పొదలోవిలీనుడై భార్య దుశ్చర్య పసిపట్టాలని కాసేడు. జనతి - మంచి అవకాశం - అని మురిసింది.]

"అత్తయ్యా! మామయ్య మళ్లీ ఎప్పుడు వస్తారు? వారి దర్శనం ఎన్నాళ్ళకో? ఏమీ తోచదు. ఇష్టజనవియోగం - తాపహేతువు గదా"

"ఔనమ్మా! పెద్ద దిక్కు కు సాటిరాదే దీని - కూడు. ఇల్లు బావురుమనిపోతోంది - ఏదో పనిమీద వెళ్లేరు. మనం అడుగుతామా వారు చెబుతారా? వెంగవాడో మోతాదో అన్నారుగదా."

"ఐతే అత్తయ్యా! నేను లోగడ ఒక కోరిక కోరేను మిమ్మల్ని. అది జ్ఞాపకంలో ఉన్నదా?"

"ఏమిటబ్బా అది? కొంచెం మెప్పందించు..."

"నేను రచించిన 'ఊర్వశీ - పురందరుడు, ప్రకృతికి వచ్చిందా? మగరాజులు ఇంట లేనప్పుడు నీ సరదా తీర్చుతానన్నారుగా!"

"ఓహో! అదా! సరేలే. ఈవేళ మీ మామగారు ఊరికి వెళ్లుటా - మనస్సు అదోలా ఉండుటా - నీవుకోరుటా - అన్నీ సమకూడినాయి. ఈరాత్రి దాన్ని నటిద్దాము. నీ ముగ్గు చెల్లించుట నా విధిగదా! ఐతే నీవు ఏ వేషం వేస్తావు?"

"నేను పురందరపాత్ర నటిస్తాను. భూమికాధారణలో - నాస్తారుగా నా నేర్పు"

"ఔను - ఆకళ చిన్నప్పటినుండీ మీ తండ్రిగారు నేర్పించినదేగా! కాబట్టే నీ రచనలో జవమూ - జీవమూ - జాలీని - నీ ప్రదర్శనంలో తన్మయత ద్రవత్వమే - నీ కళాన్వైదగ్ధ్యం చూస్తానుగా"

[మహానందంతో పోబోతుంది ముందుపనికి జనతి]

"నేను ఊర్వశీపాత్రను అంత శ్రమపడ నక్కరలేదులే"

"ఔనత్తయ్యా! బహుశః ఆ ఊర్వశే నిన్ను మాసి సిగ్గుపడాలి"

[జనతి తన భూమికాధారణ యత్నంలో నిమగ్నమైంది. పురందరుడు మొలిచినట్లు తయారయ్యాడు. ఇరువురూ అచ్చు - ఊర్వశీపురందరులు - ఒక శయ్యనుచేరి నా రాత్రి ఆ ప్రకరణికను నటిస్తారు. అది పక్కని ఒక రసవద్ఘటం

* * *

(54-వ పేజీ చూడండి)

యోగాసనములు-దేహారోగ్యము

యోగశాస్త్ర నిష్ణాతులు, పరిశోధకులు, ఆచార్యులు అయిన శ్రీ టి. కృష్ణమాచారిగారు విదేశాలలో కూడా ఖ్యాతిగాంచిన వారు. వీరు మైసూరు వాస్తవ్యులు. చిరకాలంగా మైసూరు పతంజలి యోగశాలలో యోగాభ్యాసశాఖ దర్శకులుగా ఉన్నారు. నేటి పరిస్థితులలో యోగాభ్యాసనం గురించి బాగోగులు, అభ్యసించవలసిన పద్ధతి మొదలగు అంశములపై శ్రీ కృష్ణమాచారిగారు రచించిన వ్యాసములను ఫొటోలతో సహా ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక పాఠకులకు అందచేయగలుగుతున్నందుకు ఆనందిస్తున్నాము. సం॥



వ్యాసకర్త శ్రీ టి. కృష్ణమాచారిగారు

మానవుడు అనుభవించు సకల సౌభాగ్యములకూ ముఖ్యసాధనమైనది దేహారోగ్యభాగ్యము ఒకటే అని అందరూ ఒప్పుకొనిన సంగతి ఇందులో ఏలాటి వివాదములూ లేవు.

అలాటి దేహారోగ్యమును ఇవ్వగల ఉపాయములలో యోగాసనములు ముఖ్యమైనవి. మితవ్యయము చేత అమితఫలము నివ్వదగినవి, మరియు అన్ని ఋతువులలో, అన్ని జాతీయసంఘములకూ సుకరమైనవి, అని మన భారతీయ ప్రాచీనులు వాటిని నియమబద్ధులై, అభ్యసించి, తత్ఫలము ననుభవించి అమూల్య గ్రంథములను రచన చేసి పెటిరి

ఈ యోగాంగ సాధనలు ఈనాడు కని పెటిన కల్పితమార్గములు కావు ఎన్నియో వేలేండ్ల క్రిందనే చక్కని ప్రచారములో నున్న వాటిని పునరుద్ధారణ చేసిరని అన్ని వేదములు, పురాణములు, దర్శనములు సాక్ష్యమిచ్చుచున్నవి. ఇంతెందుకు? సర్వభువనాదరణీయమైన శ్రీ భగవద్గీత యొకటి చాలదా?

యోగాసనములకు, దేహారోగ్యమునకూ గల నికటు సంబంధమును గురించి-ఇట్లు చెప్పబడినవి,

"హఠస్య ప్రథమాంగత్వా
దాసనం పూర్వముచ్యతే,
కుర్యాత్ తదాసనం స్థైర్య
మారోగ్యం చాంగలాఘవమ్"

[హ. యో. ప్ర. ఉ. 1. శ్లో 12.]

"మానవుల దీర్ఘాయుర్బలములకు సాధనమైన ప్రాణాపానవాయువుల సరళి సంచారమునకు దారియగు ఇడా, పింగళా అను పేర్లుగల నాడుల శుద్ధికి మొదటి సోపానమైనది "యోగాస(మే"గనుక) దేహారోగ్య, ఇంద్రియ లాఘవములకు మూలకారణమైన యోగాసనములను అభ్యసించు దారినే నేను చెపుతున్నాను" అని స్వాత్మారాములు వానిరి

మరియు "తతో ద్వంద్వానభిఘాతః" ద. 2 పా 48 సూ) యోగాంగాసనముల నభ్యసించువారిని శీతోష్ణ సుఖదుఃఖములు వాత పిత్త కఫముల వికారములు బాధించవు అని శ్రీ భగవత్పతంజలి మహర్షులు ఉపదేశించిరి.

వెయ్యేండ్లకు మునుపే యోగాంగ సాధనలు మన దేశములో అందరి ఆచరణలో ఉండినవి. ఐననూ ఇపుడు అవి ఘోషాస్త్రీల వలె గుప్తముగా నుండుటకు కారణమును కనిపెట్టుటకై యత్నించుట కర్తవ్యము గాదని నా యభిప్రాయము.

యోగదర్శనములో ఇట్లు వివరింపబడినది :

(1) యమ - ఐదు విధములు, (2) నియమ - ఐదు విధములు, (3) ఆసన - అసంఖ్యాకములు, (4) ప్రాణాయామ - 120 విధములు (మరికొన్ని యున్నవి), (5) ప్రత్యాహార - రెండు విధములు. (6) ధారణా - రెండు విధములు, (7) ధ్యాన - రెండు విధములు, (8) సమాధి - ఎనిమిది విధములు.

ఈ ఎనిమిది అంగములలో యోగాసనములు మూడవ సోపానము.

ధారణా, ధ్యాన, సమాధుల ఏకీకరణ విశేషసాధనకు "సంయమ" మని పేరు. "త్రయ మేకత్ర సంయమః" (పా. ద. 7 పా 4 సూత్రము.) దీనిచేత యోగులు కొనరానివస్తువులను తెలుసుకొనగలరు. యోగాసనములు లెక్కకెక్కనవి గావు అని......

"ఆసనాని చ తావంతి యావంతో జీవ రాశయః"

—[ధ్యానబిందూపనిషత్]

ప్రపంచములో జీవరాసు లెన్ని యున్నవో, అన్ని యోగాసనములు అని ధ్యాన బిందూపనిషత్తులో పార్వతికి పరమశివుడు ఉపదేశించినాడు.

యోగాంగములు బహిరంగ సాధనలు, అంతరంగ సాధనలు, పరమాంతరంగ సాధనలు, అని మూడు విధములు.

"త్రయ మంతరంగం పూర్వేభ్యః;" [సూ. 7 పా. ద. 2 పాదము.]

"తదపి బహిరంగం నిర్బీజస్య" [సూ. 8పా. ద. 2 పాదము.]

పై నుదహరించిన ఎనిమిదిటిలో మొదటి ఐదూ బహిరంగ సాధనలు.

మిగిలిన మూడూ అంతరంగ సాధనలు అందులోనూ నిర్వికల్పకసమాధికి పరమాంతరంగ సాధన మని బిరుదము నిచ్చిరి. సంయమమూ అంతరంగ సాధనమే.

మన దృష్టికి గోచరములైన చేతులు, కాళ్ళు మొదలైన శరీరావయవములకు ఇంద్రియములకూ (కండ్లు, ముక్కు, చెవులు, నాలుక మొదలైన వాటికి) మాంస పిండ శ్వాసకోశనాడీ మరియు నాడీ గ్రంథులకు, ఎముకలకూ వచ్చిన, మరియు రాగల రోగములను బోగొట్టి చక్కని ఆరోగ్యమును, బలమునూ ఇవ్వగల "యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార"ములనే ఈ ఐదూ బహిరంగ సాధనలే

మన స్థూలేంద్రియములకు కొనరాకున్ననూ, శరీరములోనే అణిగియుండి, లెక్కలేని తొందరలను (నొప్పులను.) ఆనందమునూ ఇవ్వగల మనస్సు, దాని సంచార నిరోధములకు దారియగు హృదయము (దహరకుహరము), దానిపై, క్రిందికి స్థిరాధారములైయుండు.

1. మూలాధారము, 2. స్వాధిష్ఠానము, 3. మణిపూరము, 4. అనాహతము, 5. విశుద్ధి, 6. ఆజ్ఞా, 7. సహస్రారము అను నీ ఏడు చక్రములును గళ్ళువలెనుండు నాడీ గ్రంథులును. వాటి గతులైన

1. అవృత్తి,
2. పరివృత్తి
3. సంవృత్తి ఇవి మూడు గతులు ప్రాణాయామ విభేదముచేత రేచక పూరక కుంభక వైచిత్ర్యములవల్ల గలుగును.

వీనితోపాటు మనస్సును స్థిరపరిచి మానసిక చింతలను నిర్మూలించి ఆయుర్వృద్ధి బుద్ధివికాసములను వృద్ధి చేయునట్టి, మరియు రోగములు రాకుండ నివారించునవి ధారణా ధ్యాన సమాధి అను మూడు "అంతరంగ సాధనలు." కాని యోగాభ్యాసపరులు వీటిని మాత్రమే గాక ఇంక నెన్నియో మన కంటకు అగుపడని, మరియు అతిదూరములో నుండు పరమ సూక్ష్మవస్తువులను కూడ వాటి సహజధర్మములతో (ఆధునికమైన దూరదర్శక యంత్రములు మొదలైనవాటి సహాయము లేకనే) అంతర్యరంగ సాధనమైన సంయమముచేత కనుగొని చెప్పగలరు. ఇట్టి సంయమమునకు అంతర్దృష్టి, దివ్యదృష్టి, అథవా యోగదృష్టి అని పేరు.

ఈ విషయమందు ఆధార వచనములైన "నాభిచక్రే కాయవ్యూహజ్ఞానమ్" (పా. ద. 2 పా 29) మొదలగు సూత్రములను చూడండి. జీవాత్మ పరమాత్మలకు గల సంబంధమే మొదలైన తత్వములను తెలియజేయు నిర్వికల్ప సమాధికి పరమాంతరంగ సాధనమని పేరిడిరి.

మానవులకు రాగల రోగములు లెక్కలేనన్ని. లెక్క కెట్టిన వైద్యులు ఈనాటి వరకూ మన కగుపడలేదు. వారివారి కర్మానుసారమైన ఆహార, విహార, యాన, పానాదులకు అనుగుణముగా వచ్చున రోగములు; శరీరము అతిస్థూలమై యుండుట, అథవా లేక మిక్కిలి సన్నబడి కృశించియుండుట ఈ మొదలగు పరిస్థితులను బట్టి యోగాసనములు ఉపయోగింపబడును.

యోగాసనములు సకలరోగ నిఖిలదోషములను నిర్మూలముగా నాశముబొందించి జీవాత్మ పరమాత్మ స్వరూప వివేక జ్ఞానమును పుట్టించును.

"యోగాంగానుష్ఠానాది శుద్ధిక్షయే జ్ఞానదీప్తిరావివేక ఖ్యాతేః" (పా. ద. 2 పా 28)

అందరికీ అన్ని యోగాసనములు ఆవశ్యకమనిగాని, అన్నీ అందరికి అసాధ్యమని గాని మనము తలచుట భ్రాంతియని వేరుగ చెప్పనక్కరలేదు. ఆయా శరీరమును ఆయా రోగములనుబట్టి యోగాసనములు (ఔషధముల వలె) నిర్ధింపబడియున్నవి.

ఆ, ఈ అనే జాతి, అంత ఇంత అని వయస్సు, స్త్రీపురుషులు అను నిభేదప్రభేదములు యోగాసన సాధనకు ఆటంకములు గానుండవు.

"యువా వృద్ధోఽతి వృద్ధో వా
వ్యాధితో దుర్బలోఽపివా
అభ్యాసాత్ సిద్ధిమాప్నోతి
సర్వయోగే ష్వతంద్రితః"

(హ. యో. ప్ర. 1 ఉ. శ్లో 64)

దారితప్పి నడుచువారు దుష్ఫలమనుభవింతురుఅని అన్ని పనులలో అందరికీ తెలిసినదే.

యోగాసనములవల్ల పిచ్చబట్టునని పలుకువారు వాటి నభ్యసించకనే వైరివాండ్లైన వారినిగురించి మాత్రమే.

తా నభ్యసించకనే ఒకవిషయంలో గుణదోషవిమర్శన చేయుట మిక్కిలి సాహసము గదా?


యోగాసనములు శరీరములో నుండి కుల్లిపోయిన మలమూత్రములను, మాంస పిండములను, చెడ్డకొవ్వునూ అత్యంతమైన మేధస్సునూ శస్త్రచికిత్సలవలె తోసివేసి శరీరమునకు మెరుగును గలిగించును. కనుకనే మన ప్రాచీనమునులు యోగాంగ సాధనకు "అంతర శస్త్రచికిత్సా, లేక అశస్త్రశస్త్రచికిత్సా" అని పేరు బెట్టిరి.

స్థూలకాయులకు వారి చెడ్డకొవ్వును కరిగించి గట్టిముద్దచేసి చక్కని సౌందర్యమును, కృశకాయులకు తగినంత మాంస పిండాదులను పెంచి తగునైన అందమును ఇవ్వదగినది గనుక ఈ యోగశాస్త్రమును "శారీర శిల్ప శాస్త్ర" మని చెప్పిరి.

ఆధార వచనములు:—

1. వపుఃకృశత్వం - దేహము ఎక్కువ లావుగాకుండుట.
2. వదనే ప్రసన్నతా - ముఖములో కాంతి కొంటులు.
3. నాదస్ఫుటత్వం - వాచక అనాహతధ్వనిసౌష్టవము.
4. నయనే సునిర్మలే - కండ్లు రోగము లేక కాంతితో నుండుట.
5. అరోగతా - సకలరోగ నివృత్తి.
6. బిందుజయః - వీర్య స్తంభనము.

(50-వ పేజీ చూడండి)



(పల్లెటూరిలో ప్రాతఃకాలపు వాతావరణాన్ని సూచించే ధ్వనులు – ఎద్దుల గంటల గణగణ, పసుగణాల అరుపులు మొదలైనవి.)

శ్యామ: (కూనిరాగంతో)

"ఇందువదనా వినవే రామ కథా
లోకాభిరామ కథా
రాకేందు వదనా వినవే......"

(పాట అకస్మాత్ గా ఆగిపోతుంది)

రామయ్య: అదేమిటే శ్యామా, అలా పరిగెత్తుకొస్తున్నావు?

శ్యామ: మనింటికెవరో కొత్తాయన వొస్తున్నాడు, నాన్నా:

రామ: ఎవరూ? – ఆగవే కొంచెం.

వేణు: (ప్రవేశించి) ఏం మామయ్యా, కులాసానా?

రామ: ఓరి నువ్వట్రా వేణూ? ఏం అకస్మాత్తుగా ఇలా ఊడిపడ్డావు? అమ్మాయ్, బావకి కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళివ్వమ్మా.

వేణు: కడుక్కునే వొచ్చానే మామయ్యా.

రామ: ఎక్కడ?

వే: ఊళ్లో బావిదగ్గర.

రా: అయినా మళ్ళీ కడుక్కోవాల్లే. మాకు నీటి కరువేం లేదు. ఇది పట్నం కాదుగా.

వే: నువ్వు నొట్టి దుబారా మనిషివి మామయ్యా. మీ పల్లెటూరివాళ్ళంతా ఇంతేనా?

రా: అప్పుడే ప్రారంభించావ్రా?... సరే, ముందు కాళ్లు కడుక్కో... ఏమిటరా తెల్లబోయి చూస్తున్నావు, శ్యామలా, అయిదారేళ్లయినట్టుంది. నువ్వు దాన్ని చూసి. పారిపోకే శ్యామా, బావేగా.

వే: శ్యామ అప్పుడే చాలా పెద్దదయింది మామయ్యా.

రా: నువ్వేమటుకు కాలేదురా. సరేగాని ఉత్తరం ముక్కయినా రాయకుండా ఇలా వొచ్చేశావేం?

వే: దానికంతా ఉందిలే.

రా: ఏమిటది?

వే: నా కర్మంకాలి నిన్న మా ఊళ్ళో ఓ సభకి వెళ్ళాను. రాజకీయ నాయకులేమిటి, ఆర్థిక శాస్త్రవేత్తలేమిటి, సాంఘిక శాస్త్రకారులేమిటి అంతా అదేపనిగా పల్లెటూరి జీవితాన్ని తెగపొగిడేసి యువకులంతా వెంటనే పల్లెటూళ్ళకి మరలి పోవాలన్నారు. పల్లెటూళ్ళలోనే భారత జాతీయత కనిపిస్తుందనీ, మనం ఎదుర్కొంటున్న ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్ని దాటాలంటే పల్లెటూళ్లని ఇంకా శక్తివంతం చేసి వాటి అభివృద్ధికి తోడ్పడటమే గత్యంతరమనీ ఊకదంపుడు దంచేశారు. అదేమిటో చూద్దామని బుద్ధి పుట్టింది. నిజం చెప్పాలంటే వాళ్లు అలా ఉపన్యాసాలు ఇస్తున్నప్పుడు నాక్కూడా కొంచెం ఆవేశం కలిగినమాట నిజమే.

రా: అయితే కొన్నాళ్ళిక్కడ మకాం వేస్తావన్నమాటే.

వే: మొదట అలానే అనుకున్నాను.

రా: ఏం, అప్పుడే ఉద్దేశం మార్చుకోటం కూడా జరిగిందా?

వే: లేకపోతే ఏమిటి మామయ్యా?

రా: ఏమయిందేమిటి?

వే: ఈ ఊళ్ళో అడుగు పెట్టగానే నాకంటె బుద్ధిహీనులెవరూ లేరని తెలుసుకున్నాను.

రా: ఇక్కడివాళ్లు అంత తెలివిగలవాళ్లని నాకింతకుముందు తెలీదే

వే: ఏం ఊరు మామయ్యా? హోప్ లెస్.



ಚಿತ್ರ ೧೩ — [illegible]

★ పల్లెలో పదిరోజులు ★

రా: అలాగా?

వే: ఛ. ఛ. స్టేషన్‌నించి ఇక్కడికి రావాలంటే ఒక్క బండీకూడా లేదుకదా! ఆ మూడుమైళ్ళూ నడవాలంటే మాటలా? వెంటనే తిరిగి పోవాలనిపించింది.

రా: నాకు కబురుచేస్తే బండీ పంపేవాణ్ణిగదూ.

వే: పొరపాటయిపోయింది. సరే ఎలాగో చచ్చి చెడి నడిచి ఊరు చేరాననుకో. అంతా బురద. మామయ్యా. అప్పుడు తెలిసింది, మొదట్లోనే అడుసులో కాలువేశానని.

రా: పల్లెటూళ్ళో మట్టిరోడ్లు కాకపోతే కంకరరోడ్లు ఎక్కడనించి వొస్తాయిరా.

వే: మా పట్నంలో అయితే ఎంత వాన కురిసినా హాయిగా సిమెంటురోడ్లు ఉంటాయి కనుక ఏమీ ఇబ్బంది ఉండదు.

(పశువుల రంకెలు వినిపిస్తాయి)

అబ్బబ్బ. ఇందాకటినించీచూస్తున్నాను. ఏమిటీ అరుపులు ? పట్నంలో ఈబాధ ఎప్పుడూ అనుభవించలేదు.

రా: ఒరే వేణూ, మీ పట్నంతో మా పల్లెటూరినిపోలుస్తావేంరా? (వ్యంగ్యంగా) పట్నవాసం భూతలస్వర్గంలాంటి దని నాకు తెలీదూ?

వే: మామయ్యా. నువ్వలా *Frank*గా ఒప్పుకున్నందుకు చాలా సంతోషం. ఏదో వొచ్చినవాడిని వొచ్చాను. మిమ్మల్నందర్నీ చూశాను. సాయంత్రం వెళ్ళిపోతాను.

రా: ఎలాగూ వొచ్చావుకదురా. పది రోజులుండు. తెలుసుకునే దేదో పూర్తిగా తెలుసుకోవచ్చు. ఊళ్ళో పెద్దమనుషులకి పరిచయం చేస్తాను.

వే: అలా చెయ్యమంటావా ?

రా: అలాగే చెయ్యాలి. మరి, నే నలా వెళ్లొస్తా, కొంచెం పనుంది. శ్యామా, బావకి కాస్త త్వరగా కాఫీ తెచ్చి పెట్టు.

వే: తొందరేంలేదు. మళ్ళీ నువ్వెప్పుడొస్తావు?

రా: భోజనాల వేళకి వొస్తాలే.

వే: (కొంచెం ఆగి కాస్త గట్టిగా) మామయ్యా, దయచేసి న్యూస్ పేపరేదైనా పంపగలవా?

రా: (దూరంనించి) పంపుతాలేరా.

వే: (నిట్టూర్చి) ఏం పల్లెటూరురా బాబూ!

శ్యా: (నెమ్మదిగా) వేమవరం.

వే: ఓ, అలాగా! తమరికి సిగ్గుపోయినట్టుందే!

శ్యా: కాఫీ తీసుకో బావా.

వే: థాంక్స్ ... పల్లెటూళ్ళోకూడా కాఫీ బాగానే ఉంటుందే.

శ్యా: బాగాచేస్తే ఎందుకు బావుండదూ?

వే: నువ్వే చేశావా ?

శ్యా: మరెవరు చేస్తారు? అమ్మ మడిలో ఉంది...వెళ్తున్నాను.

వే: అరే, అప్పుడే. కొంచెంసేపు మాట్లాడగూడదూ?

శ్యా: పనుంది.

వే: పని...పని! ఈ పల్లెటూళ్ళో ఎవరికీ క్షణం తీరిక ఉండదల్లేఉంది. నాతో అయిదు నిమిషాలు మాట్లాడడానికి కూడా మామయ్యకి తీరలేదు.

శ్యా: మరి పొలాని కెళ్లొద్దూ?

వే: ఎంతదూరం ఉంటుంది పొలం?

శ్యా: మూడుమైళ్ళుంటుందేమో.

వే: అబ్బా! రోజూ వెడతాడా?

శ్యా: ఆ. పనిలేకపోయినా కూడా షికారుగా వెళ్లొస్తుంటారు.

వే: షికారా!

శ్యా: ఊం.

వే: మామయ్య కిదేం సరదా? నాకు మూడుమైళ్ళు నడిచేటప్పటికి ప్రాణం పోయేటంత పనయింది.

శ్యా: పొద్దున్నే ఒంటరిగా అకుపచ్చని పొలాల మధ్యన నడవటం హాయిగా లేదు బావా?

వే: హాయా! చచ్చిబతికాననుకో.

శ్యా: అదేమిటి బావా? అలా నడవటం నాకెంతో సరదా.

వే: ఏమిటీ? నువ్వెప్పుడైనా 'షికారు' వెడుతూంటావా?

శ్యా: నాన్నతో పొలంలోకి వెడుతూంటాను, అప్పుడప్పుడు. బలే సంతోషంగా ఉంటుంది బావా.

వే: ఇంకా, నువ్వు ఇల్లు కదలవేమో అనుకుంటున్నాను.

శ్యా: ఎందుకు కదలను?

వే: అహాం. పెళ్ళి కాలేదుగా.

శ్యా: కాకపోతే?

వే: ఎవరన్నా ఏమన్నా అనుకోరూ? అసలే పల్లెటూరుకదా!

శ్యా: నీకేం తెలియదు బావా. నువ్వు పాత రాతియుగంగురించి మాట్లాడుతున్నావు.

వే: నీకు హిస్టరీ కూడా వొచ్చా?

శ్యా: కొంచెం చదివాలే.


వే: స్కూల్లో చేరలేదుగా.

శ్యా: స్కూల్లో చేరకపోతే చదవకూడదా?

వే: ఇంగ్లీషు కూడా వొచ్చా?

శ్యా: ఏదో కొద్దిగా. నీలాంటివాళ్ళ దగ్గిర వొచ్చని చెబితే నవ్వుతారనుకో.

వే: ఇంకేం వొచ్చు?



★ పల్లెలో పదిరోజులు ★

శ్యా: తెలుగూ, సంస్కృతం, హిందీ, సంగీతం.

వే: ఆఁ!

శ్యా: అలా తెల్లబోతావేం, బావా?

వే: ఇంకా ఏమిటో అనుకున్నాను. బస్తీ పిల్లల్ని మించావే!

శ్యా: చదువుకి బస్తీ అయితే ఏం, పల్లెటూరయితే ఏం?

వే: అప్పుడే.

శ్యా: నేను పెడుతున్నా. బోరె డు తనుంది.

వే: వెళ్లొచ్చు గాని, ఇప్పుడు నువ్వు చెప్పిందంతా నిజమేనా?

శ్యా: బస్తీవాళ్ళకి మల్లే మేం అబద్ధాలు చెప్పం. అదిగో, పేపరు. చదువుకో. ఏమైనా కావాలంటే పిలు.

[విరామం.]

వే: శ్యామా.

శ్యా: ఏమిటి, బావా.

వే: అబ్బబ్బ. ఇల్లంతా ఇలా చీకటిగా ఉందేం?

శ్యా: లాంతరు పెట్టానుగా.

వే: ఎందుకా గుడ్డిదీపం? కనిపిస్తుందా ఏమన్నానా? ఎలక్ట్రిసిటీ అయితే హాయిగా పగల్లే ఉండేది. ఈ చీకటి గుయ్యారాల్లో ఎలా ఉంటారో?

శ్యా: బస్తీల్లో మాత్రం అందరికీ ఎలక్ట్రిక్ లైట్లు ఉంటాయా?

వే: ఉండవనుకో. కాని లైఫ్ ఉంటుంది. అదే తేడా!

శ్యా: ఆ తేడా ఏమిటో నాకు తెలియదు.

వే: ఎలా తెలుస్తుంది? ఏమన్నా అంటే అంతా మన మనస్సుల్లోనే ఉందంటారు.

శ్యా: అది నిజమేగా.

వే: మనసులో ఉండేదే బస్తీలో ఉంటుంది. ఇంట్లో ఎలా ఉన్నా కొస్త బయటికి వెడితే మనకి కావలసినవన్నీ ఉంటాయి. చూడు, పొద్దు పోవటానికి ఎన్నో రకరకాల వ్యాపకాలుంటాయి. ఇక్కడ నిమిషం గడవదుకదా!

శ్యా: మాకు గడవటంలేదూ?

వే: నాకదే ఆశ్చర్యంవేస్తుంది? మీరెలా సరిపెట్టుకుంటున్నారా, అని.

శ్యా: అలవాటు,

వే: అంతే ఐఉంటుంది. కాని శ్యామా, రానురాను ఈ ఊళ్లో ఉండటం దుర్భరంగా ఉంటోంది.

శ్యా: ఎందుకూ?

వే: బయటికి కెడితే బతకనియ్యరుగదా.

శ్యా: ఏం? ఏమైనా పోట్లాడావా? అలా అయితే కొంచెం జాగ్రత్తగా ఉండాలి బాబోయ్, తర్వాత నీ ఇష్టం.

వే: పోట్లాటకాదూ, ఏమీకాదు. ప్రతివాడూ అలా ఎగాదిగా నావైపు చూస్తాడేం? నే నేదో జూలోంచి వొచ్చినట్టు.

శ్యా: కొత్తమనిషి ఎవరో తెలుసుకుందామని......

వే: పోనీ వాళ్ళు మా నాన వాళ్ళు పోరుగదా. ఒకటే ప్రశ్నల పరంపర. చంపేస్తారు. నువ్వెవరివి, నీ పేరేమిటి, ఏజాతి? రామయ్యగారేమవుతారు? ఎందుకొచ్చావు, ఎక్కడుంటావు? ఏంచేస్తుంటావు? ఏం చదువు? ఎక్కడ? వయస్సెంత? పెళ్ళయిందా? ఎందుకు కాలేదు? రామయ్యగారి అమ్మాయి నిస్తారా? తెలీదా? ఎందుకు తెలీదు? అనుకోటంలేదా? ఎందుకనుకోటంలేదు? నీకిష్టమేనా?—ఏమిటి, వాళ్ల మొహం. నా సంగతి వాళ్లకెందుకూ? నే నేమయితే వాళ్లకెందుకూ?

శ్యా: ఇక్కడంతేలే, బావా.

వే: నా శ్లెవరో నే నేమయినా అడిగాను? వాళ్లసంగతి నాకక్కర్లేదు కదా! వాళ్లకి నా సంగతెందుకు?

శ్యా: తెలుసుకుంటే తప్పేముంది?

వే: తప్పేమిటి? అసలు వాళ్ళు నన్నెందుకు పలకరించాలి? వాళ్ళదోవన పోకూడదూ? ఈ సి. ఐ. డి. పనిమానేసి—

శ్యా: అదేమిటి బావా? అడగటంలో వాళ్ళ ఉద్దేశం వేరు.

వే: వాళ్ళ ఉద్దేశం ఏమయితే ఎవడిక్కావాలి? బస్తీలో అయితేనా, ఆఖరికి ఇంట్లో దొంగలుపడ్డాకూడా, పక్కింటివాడైనా సరే, పలకడు. ఎవరిసంగతి వాళ్లదీ. ఎవడినిగురించి వాళ్లు ఆలోచించటానికే వాళ్లకి టైం ఉండదు. ఇలా చీటికీ మాటికీ ప్రతివాళ్ల వ్యవహారాల్లో కలుగచేసుకుంటే మహా చెడ్డ తలనొప్పిగా ఉంటుందని గ్రహించరేం?

శ్యా: అదికాదు, బావా.

వే: ఏదికాదు? వీళ్ల కసలు మర్యాద తెలుసా, అంట? రెండురోజులు మాట్లాడానోలేదో, అప్పుడే ఆ పెద్దరెడ్డి ఎంత చులకన చేసేశాడు నన్ను.

శ్యా: ఏమన్నా డేమిటి?

వే: ఏకవచనం ప్రయోగించాడు.

శ్యా: (నవ్వి) ఓస్. ఇంతేనా! ఇంకేమిటో అనుకున్నాను.

వే: అది చాలదూ?

శ్యా: ఇంత అమాయకుడివేంబావా?

వే: పైగా నేను అమాయకుడినా? నా అంతరం తెలుసుకోనక్కర్లా? రెడ్డి 'నువ్వు' అనగానే అంతా అనేశారు.

శ్యా: ఇక్కడంతేలే, బావా. నువ్వేమన్నా వేమిటి?

వే: మొహం చిట్లించుకొని వొచ్చేశాను.

శ్యా: నువ్వా మంచిపని చెయ్యలేదు, బావా.

వే : వాళ్లు మంచిపని చేసినట్టు.

శ్యా : అదేవా, నువ్వు గ్రహించింది?

వే : చాలా గ్రహించాను. నాలుగు రోజులు కష్టపడితే పడ్డానుగాని పల్లెటూరి జీవితాన్ని గురించి చాలా తెలుసుకున్నాను. దూరపుకొండలు నునుపు. పల్లెటూరంటే పల్లెటూరు! అంతేగాని అందులో సాధక బాధకాలు ఎవరూ గ్రహించరల్లే ఉంది. మా ఊళ్ళో ఉన్నన్ని పార్టీలు బస్తీలో కూడు కదా, ప్రపంచంలో ఇంకెక్కడా ఉండవు. ప్రతిదానికీ పేచీలు పడతారు. ఉక్రోషాలు పెంచుకుంటారు. కోర్టుచుట్టూ తిరుగుతారు. మళ్ళీ ఏమిటో ఆదర్శ జీవితం అంటారు.

శ్యా : నువ్వు చెప్పింది నిజమే, బావా.

వే : అమ్మయ్యా. నీకుకూడా తెలిసి వచ్చిందిగద! ధన్యుణ్ణి.

శ్యా : కాని పల్లెటూళ్లు రానురాను ఇలా పాడైపోటానికి కారణం ఏమిటంటావు?

వే : కూపస్థమండూకాల్లా ఉంటే ఏమవుతుందీ?

శ్యా : అక్కడే పొరబడుతున్నావు. పల్లెటూళ్ళు చెడిపోటానికి కారణం నీలాంటి బస్తీజనమే.

వే : నాలాంటివాళ్ళా?

శ్యా : అవును. బస్తీలో ఏదో ఉందని లెక్చర్లు కొట్టే నీలాంటివాళ్ళే. బస్తీల్లో ఉండేదీ, పల్లెటూళ్ళల్లో ఉండేదీ, మనుష్యులే. మనుష్యుల మన స్తత్వం సహజంగా ఎక్కడైనా ఒక్కటే. కాని పరిస్థితుల వొత్తిడివల్ల మన స్తత్వాలు మార్చుకోటం జరుగుతుంది. బస్తీల్లో ఉండే వాతావరణం అవసరంకొద్దీ అలా ఏర్పడ్డదని నీకు తెలియదా? అది మంచో, చెడో ఇప్పుడనవసరం. కాని పల్లెటూళ్ళని నువ్వు విమర్శించ దలుచుకుంటే ఆ దృక్పథంలోంచి విమర్శించటం అన్యాయం.

వే: అయితే ఏమంటావు?

శ్యా: నేనేమీ అనటంలేదు. ఉన్న పరిస్థితి చెబుతున్నాను. బస్తీ వ్యామోహంలో పడి పల్లెటూరి జనం నువ్వు చెప్పినట్టుగా జీవితాల్ని ధ్వంసం చేసుకుంటున్నారు. మానవులకి అనుకరించటం సరదా. అదే జరుగుతోంది.

వే: నేను చెప్పేది, కాలంతోపాటు మనుషులు మారాలంటాను.

శ్యా: ఆ మాట నువ్వు ఎవరికీ చెప్పనవసరంలేదు, బావా. ఎందుకంటే, నువ్వు మారమంటేనే మారేటంత అమాయకులూ, తెలివితక్కువవాళ్ళూ ఎవరూ ఉండరని నా నమ్మకం.

వే : మీ పల్లెటూరి వాళ్ళని వెనకేసుకువొస్తున్నందుకు సంతోషమే. కాని నువ్వు ఆవేశం తగ్గింతరవాత తీరిగ్గా ఆలోచిస్తావు కదూ?

శ్యా : అలాగేలే. పాపం, నీ కనవసర శ్రమ కలిగించాను.

వే : నాకు శ్రమేముందీ?

శ్యా : చాలా శ్రమపడ్డావులే. కొంచెం కాఫీ తెచ్చివ్వమంటావా?

వే : ఇప్పుడేం కాఫీ?

శ్యా : ఇప్పుడిప్పుడే భోజనం తయారవదు.

★ పల్లెలో పదిరోజులు ★

వే: కాకపోతేమటుకు, ఈ రాత్రివేళ ఏం కాఫీ?

శ్యా: పరవాలేదులే.

వే: నాకక్కర్లేదు. అసలే పొట్టనిండుగా ఉంది.

శ్యా: నడిస్తే అరిగిపోలా?

వే: సరి నీతో చెప్పలేను కాబోలు. అక్కర్లేదన్నకొద్దీ ఆ రెడ్డీ, నాయుడూ వాళ్ళు కొబ్బరినీళ్లూ, పళ్ళూ ఏవేవో పొట్ట చెక్కలయ్యేట్టు తినిపించారు. శ్యామా, ఇదో దురలవాటు, మీ అందరికీ. ఇంత అతిబలవంతం ఎందుకు చేస్తారో నాకు తెలీదు.

శ్యా: నీకు తెలీదులే, బావా.

వే: తెలీదు కాబోలు. అసలు పల్లెటూరివాళ్ళు చేసే ప్రతీ పనీ చాలా ఘనమైంది. నాకుమటుకు ఆ ఉద్దేశాలు తెలియవనుకో.

శ్యా: నువ్వు వ్యంగ్యంగానే అలా అన్నా 'అది నూటికి నూరుపాళ్లు నిజం.

వే: నీతో ఇహ వాదించను. ఎలాగో పొద్దున్నే వెళ్లిపోతున్నాను.

శ్యా: అప్పుడే.

వే: ఇంకెన్నాళ్లు ఈ నరకంలో? అది కాక ఈ ఊళ్ళో డాక్టరుకూడా లేదు.

శ్యా: డాక్టర్ ఎందుకు?

వే: (నవ్వి) అజీర్ణవ్యాధి ప్రవేశిస్తోంది.

శ్యా: అంతేగద. డాక్టర్ని పిలిపిస్తాంలే.

వే: ఎవరా డాక్టర్? భయంకరాచారేనా?

శ్యా: అబ్బే. వెంకటాచార్యులని గొప్ప ఆయుర్వేద వైద్యుడున్నాడులే.

వే: ఆయనేలే. ఆ కబురు చల్లగా చెప్పావు కనుక రేపుపొద్దున మరీ గట్టిగా వెడతానని చెబుతున్నాను.

శ్యా: ఇంతకీ వొచ్చినపని పూర్తిచేసుకున్నావా?

వే: ఆహా. సమగ్రంగా పల్లెటూరి జీవితం తెలుసుకున్నాను.

శ్యా: ఏం తెలుసుకున్నావు?

వే: ఇందాకటి నించీ నీతో చెప్పిందేమిటి?

శ్యా: ఓ. అవును...బావా, నీకు ఎల్లయ్యకథ తెలుసా?

వే: ఎల్లయ్య ఎవడు?

శ్యా: ఉన్నాడులే, ఓసారి వేమవరం వొచ్చి వెళ్లాడు.

వే: అలాగా? నాకు తెలియదులే.

శ్యా: రాత్రి నాన్న నడుగుబావా, చెబుతాడు.

వే: (వెళాకోళంగా) ఏం, అంత తెలిసికోవలసినవాడా?

శ్యా: అవును. తప్పక అడుగు.

వే: (నవ్వుతూ) అలాగే.

శ్యా: మళ్ళీ ఎప్పుడొస్తావు మాఊరు?

వే: మళ్ళీనా? నెవర్...నెవర్.


శ్యా: బహుశా, వొచ్చేస్తావేమో.


వే: వొచ్చినా, ఈ పల్లెటూరు కోసం మటుకు రాను. ఈజీవితం ప్రేమించి రాను.

శ్యా: రాకుండా ఉండాలనే నేనూ

దేవుణ్ణి ప్రార్థిస్తాను. కాని, బావా! జీవితంలో ఆదరాభిమానాలు కొరవైనప్పుడు, ఎవరూ నిన్ను లక్ష్యం చెయ్యని పరిస్థితి దురదృష్టం వల్ల ఏర్పడితే, జీవితం ఎందుకో అర్థం కాని నిమిషం వొస్తే, కొన్నాళ్ళు ఏ పల్లెటూరికైనా — ఆ స్త్రీ ప్రభావం పూర్తిగా వ్యాపించని — ఏ పల్లెటూరికైనా వెళ్ళి కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకో. ఇప్పుడు నువ్వు నవ్వొచ్చు. కాని ఇదంత నవ్వు పుట్టించే సలహా కాదేమో.

నే: (నవ్వుతూ) ఎక్కేం... ఎంతమాత్రం కాదు! ★





25

మే నెలలో ఒకనాటి ఉదయం గ్రీవ్ చౌకులో నగారాల చెక్కుల చప్పుళ్లు, బండ్లచక్రాల కిరకిరలు, ఇనుప గొలుసుల ఖణాఖణలు వినవచ్చాయి. చౌకు కెదురుగా రోలండ్స్ టవర్ లో సిస్టర్ గ్యుడ్లా ఈ ధ్వనులు విని చెవులు మూసుకుంది. ఆమె ధ్యానం మూలనున్న ముద్దైన బుల్లి పాదరక్షపై కేంద్రీకరించబడింది. పదిహేనేళ్ళనాడు తప్పిపోయిన బిడ్డకోసం ఎలా అంగలార్చిందో, ఈనాడూ ఆతల్లి అలాగే పరితాపంతో కృశించిపోతోంది. బిడ్డను గురించిన స్మృతిస్వప్నాలు భంగపడ్డం ఇష్టంలేక ఆమె చెవులు మూసుకుంది. బిడ్డను గురించీ, దుర్విధిని గురించీ తనలో తాను మాట్లాడుకుంటున్న సమయంలో, పసిపిల్లల మృదుమధుర కంఠస్వనాలు వినవచ్చాయి. అవి వినగానే కిటికీవద్దకువచ్చి చూడ్డం ఆమెకి అలవాటు. ఆమె కిటికీవద్దకు వచ్చేసరికే పిల్లలు కనుమాపుమేర దాటిపోయారు. అక్కడ మాత్రం ఆర్చిడికన్ క్లాడ్ ఫ్రొలో నిలబడివున్నాడు. ఆమె గ్రీవ్ చౌకు వంక చూసింది.

"ఫాదర్! అక్కడ కెవరిని ఉరితీస్తున్నారు?" అని అడిగింది.

క్లాడ్ జవాబివ్వకుండా ఆమెవంక చూశాడు.

తిరిగి ఆమె ప్రశ్నించింది.

"నాకు తెలియదు" అని జవాబిచ్చాడు. ఈసారి

"పిల్లలెవరో ఈదారిని వెడుతూ అనుకుంటే విన్నాను, జిప్సీని ఉరితీస్తున్నారని. నిజమేనా?"

"నిజమే అనుకుంటాను."

గ్యుడ్లా వెర్రిగా నవ్వడం మొదలుపెట్టింది.

"సిస్టర్! జిప్సీలంటే నీకంత కోపమా?" అని అడిగాడు క్లాడ్

"కోపమా! వాళ్లు మంత్రగాళ్ళు, మంత్రకత్తెలు. పిల్లల్ని అపహరించే దుష్టులు. నా చంటిబిడ్డని పొట్టపెట్టుకున్నారు, నా ఒక్కగానొక్క ముద్దుబిడ్డని అపహరించారు."

క్లాడ్ ఆమెవంక పరీక్షతో చూశాడు.

ఆమె మళ్ళీ చెప్పింది: "అందులో ముఖ్యంగా ఒకామె ఉంది. నా బిడ్డ బ్రతికిఉంటే సరిగ్గా ఆమె వయసే ఉండేది. ఆమె కంటబడితే నా నెత్తురు రుడికిపోతుంది."

"ఆమెకోసమే ఈ ప్రయత్నాలన్నీ. నీకళ్ళు చల్లగా ఇక్కడినించి నువ్వు అంతా చూడవచ్చు" అంటూ క్లాడ్ ఫ్రొలో తలవంచుకుని వెళ్ళిపోయాడు. ఆమె విజయోత్సాహంతో చప్పట్లు చరిచింది "చివరికి దానిగతి అంతేనని ఎప్పుడో చెప్పాను", అంటూ అరిచింది.

* * * *

ఫీబస్ చనిపోలేదు. ఫీబస్ వంటి వ్యక్తులు అంత సులువుగా చచ్చిపోరు. "కెప్టెన్ ఫీబస్ చచ్చిపోనున్నాడు" అని కోర్టులో ప్రభుత్వన్యాయవాది ఎమురాల్డాతో చెప్పాడు. ఆ న్యాయవాదికి నిజం తెలిసైనా ఉండదు; లేదా అతడు పరిహసించి ఉండాలి. క్లాడ్ ఫ్రొలో ఆమెతో "ఫీబస్ చచ్చాడు" అని చెప్పినప్పుడు, చచ్చిపోయుంటాడని, లేదా, చచ్చిపోడం మేలని అతని అభిప్రాయమై ఉంటుంది.

ఫీబస్ కి తగిలినగాయం చిన్నదికాదు; కాని చంపేటంత పెద్దదీకాదు. వారంరోజులు వైద్యులు పరిశ్రమించి చికిత్స చేశారు. వైద్యులు ఆశ విడిచిపెట్టినా యువకుని సహజశక్తి రక్షించింది.

మూలం :
విక్టర్ హ్యూగో

అనువాదం :
మహారంపూడి సీతారామ్

ఘంటారావం

నిలబడ్డాడు. ఆమె కంఠరేఖలు చూసి ముగ్ధుడైనాడు. ఆమె అతడి చెవిలో చెప్పినట్లు మెల్లిగా చెప్పింది:

"ఫీబస్! మన పెళ్ళి యింక మూడుమాసాల్లో జరుగుతుందిట. నీ కిష్టమేనా!"

"ఇష్టమా అని అడుగుతున్నావా? నువ్వే నా పరదైవతం. నిన్ను తప్ప ఇంకెవరినీ ఎన్నడూ ప్రేమించలేదు." మోహావేశంలో అతని ముఖం ఎర్రబడింది. ఆమె అది గమనించింది. "అబ్బ! ఇక్కడ ఎంత వేడిగా ఉంది!" అంది.

"ఆ గయితే! కిటికీల తెరలుదించి వస్తాను"

"వద్దువద్దు. ఉక్కబోస్తూంది, గాలి కావాలి, బాల్కనీలోకి పోదాం నడు" అంటూ అతడి సమాధానం వినకుండానే లేచి దారి తీసింది. ఫీబస్ భంగపడి ఆమె ననుసరించాడు.

అప్పటికి చౌకు కిటకిటలాడిపోతోంది. అన్ని తరగతుల ప్రజలూ వచ్చారు. నగరమంతా వచ్చి అక్కడే ఉన్నారా అన్నట్లుంది.

"పాపం ఎవరో ఆమె!" అంది వధువు. ఫీబస్ జనాన్ని చూడ్డం మానేసి తెల్లగా మెరిసిపోతున్న ఆమె మెడవంక చూస్తున్నాడు.

నాటర్ డామ్ చర్చిలో గడియారం పన్నెండు కొట్టింది. "అదిగో ఆమె వస్తోంది" అని కేకలు మిన్నుముట్టాయి. వధువు చూడలేక కళ్లుమూసుకుంది.

"లోపలికిరా, నువ్వు చూడలేవు" అన్నాడు ఫీబస్.

"ఫరవాలేదు" అంది వధువు. చూడాలనే ఆసక్తి ఆమె కధికమై చేతులు తీసివేసింది.

చుట్టూ గుర్రాలపై భటులు రాగా ఒక బండి చౌకులోకి వచ్చింది. జనం దారియిచ్చారు. ఎమరాల్డా బండిపై కూలబడిఉంది. ఆమె చేతులు వెనక్కి విరిచికట్టి ఉన్నాయి. జుట్టు విరియబోసి ఉంది. ఆమె మెడకొక తాడుకట్టబడి ఉంది. దానికి క్రిందుగా పూసలహారం ఎండలో మెరుస్తోంది. పైదుస్తు లొల్చివేయగా లోదుస్తులలో ఆమె శరీరచ్ఛాయ మెరిసిపోతోంది. లోదుస్తులు పొట్టివైనందువల్ల ఆమె చేతులు, భుజాలు, కంఠం, మెడ, కాళ్లు కనపడుతున్నాయి. తుది దశలో కూడా పీడని స్త్రీ సహజమైన లజ్జవల్ల కాబోలు కాళ్లు ముడుచుకుని కనపడకుండా ఉండడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తోంది.

సుకుమారమైన ఆమె పాదాలవద్ద డాలీ కూర్చుని వుంది. కొమ్ములపై జారిపోతున్న లోగాను అంచుల్ని ఆమె పళ్ళతో పట్టుకుని మానం కాపాడుకుంటోంది. ఇంతటి అపూర్వసుందరి కిదా శిక్ష అనిపిస్తున్న దందరికీ.

"అరె చూడు చూడు!" అంది వధువు. "ఆరోజు మేకతో వచ్చిన జిప్సీ ఆమె" అని ఫీబస్ వంక చూసింది.—ఫీబస్ ఆమె మాటలు వినలేదు. అతనిదృష్టి బండిపైనే ఉంది. అతనిముఖం పాలిపోయింది.

తడబడుతూ అన్నాడు: "ఎవరు? ఎవరు?"

"ఎవరో గుర్తుకి రాలేదా?"

"నువ్వంటున్న దేమిటో నాకు తెలియడంలేదు."

ఫీబస్ వెనక్కి అడుగువేసి లోనికి వెళ్లిపోబోయాడు. వధువుకు ఆనాటి అసూయ గుర్తుకు వచ్చింది. తిరిగి ఆ అసూయ తలెత్తింది. తనను అప్పుడామెకు లీలగా జ్ఞప్తికి వచ్చింది—ఈ గుంపులో ఒక కెప్టెన్ ఎవరో ఉన్నాడని.

"అదేమిటలా ఉన్నావు" అంది ఫీబస్ ముఖం పరికించి.

"అబ్బే! యేమీలేదు" అన్నాడు తడబడుతూ.

"అయితే ఇక్కడే ఉండు, చివరివరకూ అంతా చూదాం."

పాపం కెప్టెన్ ఫీబస్ అక్కడ నిలవక తప్పలేదు. జిప్సీ తలెత్తి తనను చూడలేదని గమనించి కొంత తేరుకున్నాడు. ఆమె నతడు స్పష్టంగా గుర్తుపట్టాడు. ఇంతటి దుస్థితిలో, ఘోర పరాభవంలో కూడా ఆమెమహత్తర రూపసౌందర్యం తరిగి పోలేదు, ఆమె లావణ్యం చెన్ను తరగలేదు. నల్లని ఆకళ్లు మరింత ప్రకాశమానమై కనపడుతున్నాయి. ప్రశస్తమైన ఆమె లలాటంపైన దేవతలు నాట్యంచేస్తున్నట్లుఉంది. ఆమె మతి చెదిరి స్తంభించిపోయినట్లు శూన్యంలోకి చూస్తూఉంది. చైతన్యంలేని జడవస్తువువలె బండి ఊపుకి ఆమె ఊగిసలాడుతోంది. ఆమె చూపులో వెలుగులేదు. కన్నుకొసలలో నీటిబిందువులు నిలిచి మిలమిల మెరుస్తున్నాయి.

సమీపంలో జనులు నిశ్చేష్టులై చూస్తుంటే, దూరానున్న జనులు రణగొణధ్వని చేస్తున్నారు. బండి నాటర్ డామ్ చర్చి ప్రాంగణంలో నిలిచింది. జనమంతా ఒక్కసారి సద్దుమణిగి తిలకించారు. కుడిప్రక్క ఒక పెద్దద్వారం తెరుచుకుంది. ద్వారంలో వెండితో చేయబడిన పెద్ద సిలువ ఒకటి ఉంది. సిలువప్రక్క మతాచార్యులు నిలబడిఉన్నారు. ద్వారకవాటాలు తెరుచుకోనగానే మతాచార్యుల మంత్రోచ్చారణ వినవచ్చింది. యువతి పాపాలకు ప్రాయశ్చిత్తంచేసి కాపాడవలసిందని వారు దైవాన్ని ప్రార్థించారు.

యువతి బెదిరి సిలువవంక చూసింది. తరువాత ఆమె దృష్టి సిలువప్రక్క చీకటిలో లగ్నమైంది. కొందరామె బంధాలు విప్పారు. కొందరామెను సిలువవద్దకు నడిపించుకు వెళ్లారు. ఆమె పెదవులు మంత్రోచ్చారణలోవలె కదలాడినాయి. దగ్గరలో ఉన్న వారికి కొద్దిమందికిమాత్రం ఆమె మాటలు వినవచ్చాయి. "ఫీబస్! ఫీబస్!" అని మననం చేస్తున్న దామె. డాలీ ఆమెవెంట వచ్చింది. జిప్సీ సిలువవద్దకు చేరగానే మతాచార్యుల మంత్రోచ్చారణ నిలిచిపోయింది. కొందరు భటులామెను లోనికి తీసుకువెళ్ళారు. అక్కడొక వరుసలో నిలబడిన మతాధికారుల ముఖాలవంక చూసింది. ఒకని ముఖం చూసి ఆమె భయంతో వణికిపోయింది.

"మళ్ళీ! మీరా!" అని గొణిగింది. క్లాడ్ ఫ్రాలో మంత్రోచ్చారణ ప్రారంభిస్తూ ముందుకు ఆమెవద్దకు వచ్చాడు. అతడు సంజ్ఞ ఇచ్చి భటులను దూరానికి పంపేశాడు. ఆమెకు తల వేడెక్కింది. నెత్తురుడికింది. మంత్రోచ్చారణ ఆపి ఆమెతో అన్నాడు "నీ పాపాలను బాపవలసిందని భగవంతుని ప్రార్థించావా?" తరవాత అతి మెల్లిగా ఆమెకు మాత్రమే వినపడేలా అన్నాడు: "ఇప్పుడైనా చెప్పు, నన్నంగీకరిస్తే నిన్ను రక్షించగలను."


ఆమె అతనివంక రోషంతో చూసింది. "ఛీ" అంది. "అందరికీ చెప్పేస్తాను" అని బెదిరించింది.

"నీమాట యెవరూ నమ్మరు. చెప్పు చప్పున చెప్పు."

"నా ఫీబస్ని ఏంచేశావు?"

"చచ్చిపోయాడు—" అని కసిగా అంటూ క్లాడ్ ఫ్రాలో తలెత్తిచూశాడు. ఎదురుగా భవనంలో ఫీబస్ కనపడ్డాడు. క్లాడ్ ముఖం పాలిపోయింది. "సరే అయితే చావు" అన్నాడు. "నీకెవరూ దక్కకుండా చేస్తాను చూడు." తిరిగి క్లాడ్ ఫ్రాలో మంత్రోచ్చారణ ప్రారంభించి వెనక్కి వెళ్ళిపోయాడు.

కొంతసేపటికి ప్రాయశ్చిత్తం ముగిసింది. మతాచార్యులందరూ చర్చిలోకి వెళ్లిపోయారు. తిరిగి ఆమె చేతులు వెనక్కి విరిచికట్టారు. మెల్లిగా నడిపించుకుని తీసుకెడుతున్నారు. దుర్భరవేదనతో ఆమె ఆకాశానికి ముఖమెత్తి దైవాన్ని ప్రార్థిం



పోరాటం —ఫోటో: ఏ. అంకిరెడ్డి (మద్రాసు)

నె
ద్యాలవద్ద మందంపైన ఉండగా ఫీబస్ వద్ద ప్రభుత్వాధికారులు వాఙ్మూలం తీసుకున్నారు. అధికారుల ప్రశ్నపరంపరలు సహించ లేక సత్తువరాగానే అతను ఎవరికీ చెప్పకుండా పారిపోయాడు. అతను పారిపోయినందువల్ల ఎస్మెరాల్డాపై కేసు కుంటుపడలేదు. ఫీబస్ చనిపోయినట్లు భావించి కేసు నిర్ణయించారు.

ఫీబస్ పారిస్‌లో ఉండకుండా పారిపోయి, దగ్గరలో వున్న తన సైనిక శిబిరం చేరాడు. తనవిషయంలో కేసు జరుగుతున్నట్లు అతనికి తెలుసు. అయినా అక్కడుంటే తను ఎటువంటి ప్రశ్నలకు జవాబు ఇవ్వవలసి ఉంటుందో, తన గుట్టెట్లు బయటపడుతుందో అని అతని భయం. అసలు జరిగినదానినిగురించి ఏమని భావించాలో అతనికి తెలియలేదు. జిప్సీయువతి మంత్రకత్తె అనే అనుమానించాడు. జరిగిన పరాభవానికి సిగ్గుపడిపోయాడు. తనక్కడ లేకపోతే తన పేరు బయటపడదని ఊహించాడు. అయితే జిప్సీయువతిపై మోహం అంతరించగానే హృదయంలో ఏర్పడిన శూన్యభావం అతనికి దుర్భరమయింది. కొద్దిరోజులఅనంతరం పారిస్ తిరిగి వచ్చాడు. నాటర్ డామ్ చర్చి కెదురుగా భవనం, వితంతువు, తనకు నిశ్చయింపబడిన వధువు అతనికి జ్ఞప్తికి వచ్చారు. రెండుమాసాలు గడిచినందువల్ల జిప్సీ యువతివల్ల జరిగిన అల్లరి మణిగిపోయుంటుందని భావించి ఆభవనానికి వచ్చాడు.

అక్కడ వధువు, తల్లిమాత్రమే ఉన్నారు. వధువు ఆనాడు జరిగిన సంఘటన పూర్తిగా మరిచిపోలేదు. ఫీబస్ కనబడకుండా పోవటం ఆమెకు బాధ కలిగించింది. చివరి కతను రాగానే ఆమె కోపం మరిచిపోయింది ఫీబస్‌కళ్ళ కీనాడు వధువు అప్సరసలా కనపడింది. తల్లి సోఫాలో కూర్చునివుంది. వధువు కిటికీవద్ద కూచుని తెరగుడ్డపైన కుట్టుకుటూవుంది. ఫీబస్ ఆమెవద్ద నిలబడ్డాడు.

"ఈ రెండునెల్లూ ఏం చేస్తున్నావోయ్?"

ఈ ప్రశ్న అతడికి రుచించలేదు. "అబ్బ! నువ్వెంత చక్కని దానవు!" అన్నాడు.

"చక్కదనమా! చక్కదనం కాదు నే నడుగుతున్నది! అడిగినదానికి జవాబు చెప్పు."

"సైనిక శిబిరానికి వెళ్ళమని ఆజ్ఞవచ్చింది."

"వెళ్లేముందైనా నాకు చెప్పలేదే"

"ఏముంది. మా కర్తవ్యం. అదీగాక నాకు జబ్బుచేసింది"

"జబ్బా!" అంది వధువు ఆరాటంతో.

"అవును. గాయం తగిలింది"

"గాయమా?" ఆమె నిశ్చేష్టురాలైంది.

"అబ్బే! భయమేం లేదు."

"పోనీలే. క్షేమంగా తిరిగివచ్చావు. అదేచాలు."

ఫీబస్ వీధివంక చూశాడు. "అదేమిటక్కడ? అబ్బ! ఎంత మంది జనం మూగారో!" అన్నాడు.

"అవును. ఎవరో మంత్రకత్తెని ఉరితీస్తారట."

"ఆమె యెవరో?"

"తెలియదు"

వితంతువు అదేదో చూడాలని బాల్కనీలోకి వెళ్ళి తరుణం గమనించి ఫీబస్ వధువుకు మరింత సన్నిహితంగా

చింది. అంతలోనే ఆనందాతిరేకంతో "ఫీబస్, ఫీబస్" అని అరిచింది. దివసం వైపు చేతులు చాచ లేకపోయినా ప్రార్థనా పూర్వకంగా చూసింది. ఫీబస్ కనుబొమలు ముడుచుకొనడం ఆమె చూసింది. అతని ప్రక్కనే ఒక యువతి అతని వంక అలుకతో చూడ్డం గమనించింది. ఫీబస్ ఆమెతో ఏవో చెప్పినట్లు పెదవులు కదిలాయి. అంతలోనే యిద్దరూ బాల్కనీ విడిచి లోనికి వెళ్ళిపోయారు.

"ఫీబస్" అని బిగ్గరగా అరిచింది ఎస్మరాల్డా. "నువ్వు కూడా

ఘంటారావం

నన్ను నమ్మవా?" అని దీనంగా విలపించింది. అకస్మాత్తుగా ఆమెకు జ్ఞప్తికి వచ్చింది — కెప్టెన్ ఫీబస్‌ను హత్య చేసినందుకే ఆమెకీ శిక్ష! ఆమె తల గిర్రున తిరిగిపోయింది. స్పృహతప్పిపడిపోయింది. భటులామెను పట్టుకుని బండివద్దకు దారితీశారు.

అప్పటికి ఇంతమంది జనంలో ఒక్కరూ చర్చి పైభాగంలో శిల్పసముదాయంవంక చూడనేలేదు. అక్కడ కూర్చుని జరిగినదంతా విభ్రాంతుడై చూస్తున్న వ్యక్తి నెవరూ గమనించలేదు. చిరుగాలికి రెపరెలాడుతున్న అతని దుస్తుల అంచులుతప్ప, అతడు కూడ వికృతశిల్పాలలో ఒక శిల్పంవలె నిశ్చలంగా కన్నార్పక చూస్తున్నాడు. ఉదయంనుంచీ అక్కడిదృశ్యాన్ని తదేకంగా అతను గమనిస్తున్నాడు. ఎవ్వరూ కనిపెట్టకుండాముందే అక్కడ తగిన ఏర్పాట్లు చేసుకున్నాడు. పైన ఒక రాతి స్తంభానికి పొడుగాటి పగ్గ మొకటి గట్టిగా ముడివేసి నేలమీదికి వేలాడవేశాడు. ఆ స్తంభంవద్దనే కూర్చుని జాగ్రత్తగా వీధిలో జరుగుతున్నదంతా గమనిస్తున్నాడు.

భటులు జిప్సీయువతిని బండివద్దకు ఈడ్చుకుపోతున్న సమయంలో క్వాసిమోడో చరచర తాడు పట్టుకుని దిగజారిడు. భటులపై కలంఘించి రెండు పిడికిళ్ళతో మోది ఇద్దరినీ పడగొట్టాడు. ఒక చేతితో జిప్సీ యువతిని ఒక్క ఉదుటున ఎత్తి భుజంపై వేసుకున్నాడు. చర్చిలోపలి కొక్క దూకులో ప్రవేశించాడు. లోమందిరంలోనించి యువతిని బొమ్మనెత్తినట్లు రెండుచేతులతో తలపైకెత్తి పట్టుకుని "శరణు, భగవంతుని శరణు" అంటూ బిగ్గరగా అరవ నారంభించాడు. మందిరమంతా అతని భయంకర గర్జనలను ప్రతిధ్వనించింది.

అంతా క్షణంలో జరిగిపోయింది.

ప్రజలందరూ ప్రతిధ్వానం చేశారు: "శరణివ్వాలి, శరణు" అని ఒక్క పెట్టున అరిచారు. ప్రజల సానుభూతికి క్వాసిమోడో ఒక్కకన్నూ ఆనందంతో తళతళలాడింది. ఈసంరంభానికి ఎసు రాల్డాకి స్పృహ వచ్చింది. ఆమె కన్నులు తెరిచి చూసింది. క్వాసిమోడో కళ్ళబడగానే భీతితో తిరిగి కన్నులు మూసుకుంది.

ప్రభుత్వ న్యాయాధిపతి చర్చి ప్రాంగణంలో నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. భటులు స్తంభితులైనారు. నాటర్ డామ్ చర్చి లోపల ఉన్నంతవరకూ యువతికి భయంలేదు. ఆమె నెవ్వరూ అక్కడ తాకలేరు. దేవాలయం ప్రవేశించే అధికారం ప్రభుత్వాధికారులకు లేదు.

క్వాసిమోడో మందిరం మధ్యలో నిలబడ్డాడు. రాతి స్తంభాలవలె కాళ్ళని నిలిచాడు. అతని పెద్దతలపై చెదరిన రాగిజుట్టు మృగరాజు కేసరాలు విదల్చినట్లుంది. నిలువెల్ల కంపించిపోతున్న యువతిని ఒక చేతిపై కండువా వేసుకున్నట్లు మోస్తున్నాడు.

అయితే తన చేతిలోనున్నది గాజుపూస కాబోలన్నట్లు అతిపదిలంగా చేయి జారకుండా మృదువుగా పట్టుకున్నాడు. తనశ్వాస సోకితే ఆమె శరీరం కందిపోతుందని భయపడుతున్నట్లామెను అతిజాగ్రత్తతో కాపాడుతున్నాడు. ఉన్నట్టుండి ఒకొక్కప్పుడు తన ప్రాణంతో సమానమైన నిక్షేపంవలె ఆమె శరీరాన్ని భుజాని కదుముకుంటున్నాడు. ఒకొక్కప్పుడు పసిబిడ్డను తల్లి పొదివి పట్టుకున్నట్లు ఆమెను అక్కున జేర్చుకుంటున్నాడు. తన ఒక్క కన్నుతో ఆమెపై ఆర్ద్రమైన అనురాగం ప్రసరింపచేస్తున్నాడు. ఆ చూపులో అనురాగంతోపాటు అపారమైన కరుణ, విషాదం గోచరిస్తున్నాయి. ఆమెను చూస్తున్న కొద్దీ అతని కన్నులలో తటిల్లతలు మెరుస్తున్నాయి. నిజంగా ఆక్షణంలో అంతటి వికృతరూపి ముఖంలో సౌందర్యమే గోచరించింది. మహా బలసంపన్నుడైన అతనిముఖంలో తేజస్సుకూడా ద్యోతకమయింది. మాతాపితృవిహీనుడై, కురూపియై, సమాజంనుంచి తరుమబడి, అందరి అవమానానికీ గురైన క్వాసిమోడో, ఆ ఒక్క క్షణంలో అతని జీవితమంతటినీ ధన్యమొనర్చగల మహత్తర విజయం లభింపచేసుకున్నట్లున్నాడు. మానవులలోకెల్ల అధమాధముడైనవాడొక్కడు మహారాజు రాజ్యప్రాభవాన్ని తిరస్కరించి మానవ సమాజాన్ని ధిక్కరించి, మానవులేర్పరచుకున్న న్యాయశాసనాల్ని, న్యాయ నిర్వహణాధికారుల్ని పెడద్రోసి జయించినమహత్తర ఘట్టం అది. అతడికా బలమిచ్చినది దైవం!

అంతటి వికృతరూపియైనవాడు, అంతటి సౌందర్యరాసిని మృత్యువునుంచి తప్పించిన ఆ ఘట్టం చూసి అక్కడి ప్రజలందరూ విభ్రాంతులైనారు. ప్రకృతీ సంఘమూ కలిసి ప్రభవింపచేసిన ఈ విపరీత వ్యక్తులు పరస్పరం సహాయపడ్డం విధివైచిత్ర్యం!

కొంతసేపు తన దిగ్విజయాన్ని ప్రకటించి క్వాసిమోడో చర్చి అంతర్భాగంలోనికి ఆమెను మోసుకుని వెళ్ళిపోయాడు. ఇటువంటి వీరకృత్యాలకు ముగ్ధులయ్యే ప్రజలు హర్షధ్వానాలు చేశారు. అంతలోనే క్వాసిమోడో చర్చి పైభాగంలో శిల్పరాశి మధ్య కనపడ్డాడు. ఆశిలలమధ్య ఉన్మత్తునివలె పరుగెత్తాడు. "శరణు శరణు" అంటూ దిక్కులదిరేటట్లు గర్జిస్తూ పరుగెత్తుతున్నాడు. చర్చి గోపురంకొసకు చేరి అంతరిక్షంలో నిలిచి గర్జించ నారంభించాడు. జనుల హర్షధ్వానాలు నగరమంతా మారుమోగాయి. క్వాసిమోడో గంభీరగర్జనలకు ఆకాశం మారుపలికింది. (ఇంకా వుంది)

అంగుడు పొద్దు

"ఏమూయ్ మల్లయ్యా పట్నం పోయినవేమొ? ఎప్పుడస్తివి? ఏమేం జూసచ్చినవు? మీసబ లెట్ల జరిగ గింత జెప్పవ్?" పనిదీరి కూకున్న పటేలు మల్లయ్యా నడిగిండు.

"ఏం జెప్పమంటవ్ పటేలయ్యా, మా పెద్ద సబ జెప్పిండు. అబ్బ ఏం జనం ఏం జనం? ఓ పెద్ద తీరుతమోలె ఉన్న దనుకో."

"ఎంతసేపాయె నువ్వచ్చి, బుక్కెడంత సల్లపడే వత్తన్నవా?"

"ఇంటికోయి సల్లపడే వత్తాన్న బుక్కెడు, గింతగ్గిపుల్లుంటిత్తారు సుట్టేసుకుంట"

పటేలయ్యా అగ్గిపుల్ల యియ్యంగనే సుట్ట మీద అగ్గివట్టుకోని, మోకాల్లకు రుమాలు జుట్టుక, కచ్చీర్ల కూకున్న మల్లయ్యా సుట్ట దాక్కుంట చెప్పతాండు, తాను పట్నంల జూసివచ్చిన పెద్ద సబ సంగతి.

"నాలుగు రోజుల ముందుగనె నేనీ ఊల్ల కెల్లి ఎల్లిపోయిన్నా? నా అసుంటోల్లు ఓ యాభై, మందచ్చింరు... మేమందరం గలిసో రెండెకరాల మైదానం సాపుజేసుట్ల దలి గిసం. అన్లున్న మున్ల పల్లేరుగాయలు ఏరి, గడ్డిజెక్కి, ఊడ్చి ఆ మైదాన్ల ఓ పేద్ద పంది రేసినం. తాటికమ్మలు గొట్టుకచ్చి పెద్ద పెద్ద తడికలల్లి కట్టినం. అచ్చెటోల్లందరికోసం ఏరేరు పాకలేసినం. పెద్ద పెద్ద బొమ్మలు పటాలు పరదాలు గట్టి సర్గమోలిగె జేసిన మామైదానాన్ని. అంతకు ముందాడ పందులు మేసెటియి. పందిర్లేసినమోలె బంగ లాల్లగూడ అంత సుకముండదనిపించింది. సర్గమే అనుకో. రాత్రనక పగలనక, యాల్ల పొంట నిద్దర్లేక యాల్లకూడులేక పనిజేత్తే రేపు సబసంగ అన్ని తయారైపోయినయి. ఆనాడు మాత్రం కంటికి కూరుకు గాని చ్చింరా? ఆగుల పంటఉర్కి ప్రెర్దీయ మనిరి. ఎండకాలమాయె అచ్చెటోల్లందరికి నీల్లెట్ల? ఇంజనపెట్టి పంపుల్లోని పర్రెల్ల నుంచి పొకల్లకు నీల్లు దెస్తిమి. ఇగ సబ నాడు. ఆ పంటిట్ల కూకుండి అల్లు జెప్పే మంచిమాటలేమన్న ఇందామంటె సాగ నిచ్చింరా? అచ్చిన పెద పెద్ద దొరలు ఆ సల్లకెల్లి పంపుల్లచ్చిన ఉడుకునీల్లు దాగ టోల్లు గాకపోయిరి. పెద్ద పెద్ద కొత్త కడ వలు దెచ్చి నీల్లునింపి పెట్టినం. ఓ నూరు కొత్తకడవలు నింపుదుం రోజు తెల్లారం గనే. ఇగ సబ మొదలయితదనంగ మాత్రం మమ్ముల్నందర్ని పనిడిసి పెట్టి అల్లతోని రమ్మన్నరు. ఊరవతలిదాంక మేమూ ఊల్లు నోల్లు, అందరంగలిసి పోయినం. ఆయిన పేరేందో ఆ పెద్ద దొరచ్చిండు. ఆనాడు మన కచ్చీర్ల కొయిదం గొట్టలే? ఆ కొయి దంల ఉన్న దొర. ఆయిన్ని పందిట్లదాంక 'జై' 'జై' అనుకుంట దెచ్చినం. పందిట్లకొయినె అకుగు పెట్టంగనె మమ్ములను దోలకోని అంటకాడికి దీసుకపోయిరి. ఆడ నీల్లు నింపుడు, ఇత్తారేసుడు, ఇత్తార్లు దీసుడు' ఊడ్చుడు దింతోనె సరిపాయె ఒక్క మాట సబలజెప్పిందింటె ఒట్టు. రోజు ఎంతమంది దింటాండిరో ఏమొ? అంతమంది యాడ్నుంచి అచ్చింరో ఏమొ? ఒక్కొక్క బంతికి మున్నూరుమందిదాంక లేత్తాండిరి. అసుంటియి పూటకు ఇరువయి బంతుల్లేసే టియి. బంతికి కూకుండంగనే ఇత్తారేసుడు; అల్లందరికి నీల్లుపోసుడు, అల్లు లేవంగనె ఆ ఇత్తార్లు దీసుడు. మల్లా ఇంకొగబంతి. ఇట్ల యిరువయి బంతులేసెటాల్లకు పొద్దంగు. మేం బుక్కెడు దిని లేస్తుం. సుట ఓబుక్క దాగుతమొ లేదొ మల్ల మొదటిబంతోల్లు ఇంకో పూటకు తయారవుదురు. ఇగప్పుడు దీరాలె. అందరు రెండుపూటలు తినెటాల్లకు నాత్తిరి రెండు జాములో. ఇట్లసబ జరిగిన మూడురోజులు పెద్దపెద్ద దొరలచ్చి మంచి మంచి మాటలు జెప్పతాంరనేగాని, ఒక్క మాటిన్న పాపాన పోలేగు. అన్నందుకు ఆకరునాడు, అదేం సబనో రెండు జాముల్నాత్తిరి మొదలు పెట్టింరు. ఆ నాత్తిరి పోదా మన్నా పందిట్లకు పోనియ్యకపాయిరి కరెపట్టుకోని ఎవడో లోపలకుపోయె పో గాడు అడ్డగిచ్చె. లోపలికెల్లి ఎవలొ ఉరి కచ్చి నన్నాడ జూసి, బల్లమీద జంపుకా నాలు దులుపొమ్మని, నన్ను దోలుకపాయె. న్యాలమొ అన్యాలమొ, జంపుకానాలు దులుపపోయినోన్ని ఇగాన్నే కూకున్న. మొట్టమొదలు ఎవలో ఒగాయినె, కంన్ల కద్దాలు బెట్టుకున్నడు, హరిదాసోలిగె శెల్లా గప్పుకున్నడు; లేసి పుత్తకాలు రాసెటోల్ల కని ఏమేమొ జెప్పిండు. పుత్తకాలల్ల దరిద్రుల కతలుండాల్నట. ఎవడు జదువతడు పటేలా? మరి మాకేమొ సదువే రాకపాయె. సదువచ్చినోల్లేమొ దరిద్రులు గాకపాయిరి. అయినా ఆయినె పుత్తకాలు రాసెటోల్లకు జెప్పిండు, ఇని అల్లు సప్పట్లుగొట్టింరు, నసుమ నాకెందుకు, ఆ మాటజెప్పి ఆయినె గుకుండంగనె ఇగ పాటలు జగువుడు మొదలుపెట్టింరు. సుక్కవొడిసెదాంక దెగ లేదు. ఒకొక్కక్కలే వత్తరు. ఒకటో రెండో పాటలో పద్దాలో జదువుతరు. దిగుతరు,

(56–వ పేజీ చూడండి)

సురమౌళి



విజ్ఞానవీధులు

"డాక్టర్"



169. ద్రవ్యమంటే...?

కళ్ళు తెరచి చూచేటప్పటికి అనేక రూపాలలో ప్రకృతి మనకు దర్శనమిస్తుంది. మిలమిల మెరసే నక్షత్రాలు, దుర్నిరీక్ష్యుడైన సూర్యుడు, నయనానందకరంగా గోచరించే పచ్చని చెట్లు, ఆకాశంలో విహరించే పక్షులు, భూమిమీద నడిచే జంతువులు, నీటిలో నివసించే జీవులు, నిర్జీవములై ఇసుమంత తాము కదలలేక మెదలలేక ఒకచోట పడియుండే కుర్చీ, బల్లవంటి వస్తువులు...అనేకములు వివిధరూపాలలో వర్ణాలలో ప్రత్యక్షమవుతాయి. ఇవన్నీ కూడా ద్రవ్యంతో కూడినవే.

కంటికి ఆనకపోయినప్పటికీ ద్రవ్యంతో కూడినవేయైన వస్తువులు ప్రకృతిలో అనేకం ఉన్నాయి. గాలి కంటికి కనిపించదు. కాని అది వస్తువే. మన శరీరాన్ని తాకడంవలన దాని ఉనికిని తెలిసికోగలుగుచున్నాం. అల్లే పువ్వుల పరిమళం కంటికి కనిపించకపోయినా, ముక్కు సాహాయ్యంచేత దాని ఉనికిని గ్రహించగలుగుచున్నాం. కీచురాయి నేల పగుళ్లలో ఎక్కడో దాగియుండి కీచుమని చెవికింపుగాని శబ్దం చేస్తుంది. అది కంటికి ప్రత్యక్షంగా కనిపించకపోయినా శబ్దంవలన దాని ఉనికిని గమనించ గలుగుచున్నాం. ఈవిధంగా రంగు, రుచి, వాసన మొదలైన గుణాలను కలిగి యుండడంవలన కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము అను అయిదు జ్ఞానేంద్రియాల సాహాయ్యంవలన మనం తెలిసికోగలిగిన వస్తువులన్నీ ద్రవ్యంతో కూడినవే. రూపంలోను, రంగులోను, రుచిలోను వస్తువులలో తేడాలున్నప్పటికీ, అవన్నీ ప్రదేశంలో ఉంటాయి, ప్రదేశాన్ని ఆక్రమిస్తాయి. అందుచేత ద్రవ్యమంటే ప్రదేశాన్ని ఆక్రమించేది అని చెప్పవచ్చు.

ద్రవ్యస్థితి:—ద్రవ్యము, ఘన, ద్రవ వాయుస్థితులలో (*States*) దేనిలోనైనా ఉండగలదు. మాటవరుసకు నీటిని తీసికొందాం. నీరు గడ్డకట్టి మంచుగడ్డగానున్నపుడు ఘనస్థితిలో నుంటుంది. నీరుగానున్న సమయంలో దానిది ద్రవ్యస్థితి. మరిగించినపుడు, అది ఆవిరియై వాయుస్థితిని పొందుతుంది. ఆవిధంగానే సామాన్యంగా ప్రకృతిలోని వస్తువులన్నీ కూడా ఈ మూడు స్థితులనూ పొందగలవు.

ద్రవ్యము ఘనస్థితిలో నున్నపుడు ఆ ద్రవ్యముచే నేర్పడిన వస్తువు నిర్దిష్టమైన ఆకారాన్ని కలిగి యుండగలదు. ద్రవస్థితిలోనున్న వస్తువు ఆకారము ఆవస్తువున్న పాత్ర ఆకారంలో ఉంటుంది. కిరసనాలు గ్లాసులోనున్నప్పుడు గ్లాసు ఆకారంలోనే ఉంటుంది; తరువాత సీసాలో పట్టప్పుడు సీసా ఆకారాన్ని పొందుతుంది. ఘనస్థితిలోనున్న వస్తువైతే యీ విధంగా మార్పును పొందలేదు. ఘనద్రవస్థితులలో నున్నపుడు వస్తువు పరిమాణంలో సామాన్యంగా మార్పు ఉండదు. కాని, వాయుస్థితిలోనున్న వస్తువు పరిమాణ విషయం అట్లు గాదు. వాయుస్థితిలోనున్న వస్తువును ఎంత పెద్దపాత్రలోపోస్తే అంతపరిమాణాన్నీ అది ఆక్రమిస్తూనే ఉంటుంది.

సాంద్రత:—ఘన, ద్రవ, వాయు స్థితులలో దేనిలోనున్నా వస్తువుకు పరిమాణం ఉంటుందికదా. పరిమాణాన్ని ఘనపరిమాణ

మనీ, ఆయతనమనీ (*Volume*) కూడా వ్యవహరిస్తారు. గదియొక్క పొడవును, వెడల్పును, ఎత్తును, ఒకదాన్ని పెట్టి ఇంకొకదాన్ని గుణిస్తే గదియొక్క ఘనపరిమాణం వస్తుంది. అవిధంగానే ఒక పెట్టెయొక్క పొడవును, వెడల్పును, ఎత్తును ఒకదాన్ని పెట్టి ఇంకొకదాన్ని గుణిస్తే ఆ పెట్టెయొక్క ఘనపరిమాణం వస్తుంది. ఘన పరిమాణాన్ని ఘనపు గజాలలోను, ఘనపు టడుగులలోను, ఘనపు టంగుళాలలోను తెలియజేస్తారు. 1 గజము పొడవు, 1 గజము వెడల్పు, 1 గజము ఎత్తుగల దిమ్మ ఆయతనం 1 ఘనపు గజం. శాస్త్రంలో వస్తువుల ఆయతనాలను ఘనపు గజాలలోను, ఘనపు టడుగులలోను, ఘనపు టంగుళాలలోను సామాన్యంగా తెలియజేయరు; ఘనపు సెంటీమీటరులలో తెలియజేస్తారు. ఒక సెంటీమీటరు పొడవు, ఒక సెంటీమీటరు వెడల్పు, ఒక సెంటీమీటరు ఎత్తుగల వస్తువుయొక్క ఆయతనం ఒక ఘనపు సెంటీమీటరు. ఒక సెంటీమీటరు రమారమి 0.39 అంగుళాలకు సమానం. కాబట్టి 0 39 అంగుళాల పొడవు, 0.39 అంగుళాల వెడల్పు, 0.39 అంగుళాల ఎత్తుగల వస్తువు ఆయతనం కూడా ఇంచుమించు 1 ఘనపు సెంటీమీటరే. పొడుగూ, వెడల్పూ, ఎత్తూ కలిగి సమ ఘనాకారంలోనో, దీర్ఘ ఘనాకారంలోనో కాకుండా గోళాకారంలోనో, స్తంభాకారంలోనో లేదా మరి యే యితర ఆకారంలోనైనా సరే ఉన్న వస్తువుయొక్క ఆయతనాన్ని కనుక్కోడానికి మార్గాలున్నాయి. ఆ పద్ధతులనుబట్టి కనుగొన్నవాని ఆయతనాలను ఘనపు సెంటీమీటర్లలోనే తెలియజేస్తారు. ఒక ఘనపు సెంటీమీటరు ఆయతనంగల వస్తువుయొక్క ద్రవ్యాన్ని ఆ వస్తువుయొక్క సాంద్రత అని పేర్కొంటారు. సాంద్రత ఒక వస్తువుయొక్క విలక్షణమైన ధర్మం.


—అనంత్.

చిట్టిప్రశ్నలకు జవాబులు

—ఏనుగు పాదంక్రింద కోడిగుడ్డును గోడుగా పెట్టిన చితకదని ఎందువలన అంటారూ? అని అడుగుతారా? సోడా చూడకపోవడము వలన.

—28-10-53 ఆంధ్ర వారపత్రికలో మేము ఎలక్ట్రికు తీగలను గురించి వ్రాసినది తప్పని జి. యస్. యస్. శర్మగారు వ్రాశారు. మేము ట్రాన్సుఫార్మర్, ఫేజు, వంటి సాంకేతిక పదాలను ఉపయోగించలేదని కాబోలు వారి అభ్యంతరము. వాటన్నిటినీ వివరించడమూ, ముఖ్యముగా ఫేజంటే బోధపరచడమూ, (ఇంటర్మీడియటు క్రిందివారికి తెలుగులో) కష్టసాధ్యమని వారికి తెలియకపోదు. ఏ రెండు తీగల మధ్య పీడనమూ 440 అనీ, భూమితో కలిపిన తీగకీ ఇంకొకదానికీ 220 అనీ అన్న విషయాన్నే సరళముగా వివరించాము. నాలుగు తీగలుంటాయన్న సత్యము మా వివరణని "దోషభూయిష్టము" చేసేస్తుందన్న భయము మాకు కలగలేదు. ఇంగ్లీషు పదములకు తెలుగుపదములు వాడి, సామాన్యులకు బోధపడునట్లు వారు వ్రాసినచో ప్రచురించడానికి మాకేమభ్యంతరమూ లేదు.

—ఉత్తర ధృవప్రాంతమునకు ఆరునెలల పాటు సూర్యదృష్టియే ఉండదు. ఈ కాలములో సూర్యుడినించి అంతరిక్షము మీదికి చిమ్ముకుని వచ్చే ఎలక్ట్రానుల తాకిడికి గాలిలోని అమ్లజనివంటి వాయువులు వెలుగు చిమ్ముతాయి. ఈ వెలుగు సంధ్యాకాంతిలాగే ఆ ప్రదేశపు జనుల పనిపాటులకి పనికి వస్తుంది.



సువర్ణముఖి ఒడ్డున కాళహస్తీశ్వరాలయం

ఫొటోలు : యం. ఆదిశేషారెడ్డి, (నెల్లూరు)

కన్నప్ప కొండపైనుంచి కాళహస్తి పట్టణం



బొమ్మరిల్లు

సంపెంగ

కవిరావు

★

అమ్మా! కనుగొనగలవె
గమ్మత్తుకు సంపెంగనైతే?

రెమ్మలలోపల చిటారు
కొమ్మల లేచిగురులపై,
కేరింతలు గొట్టుచు గా
లికినాట్యము చేస్తుంటె

అమ్మా! కనుగొనగలవె
గమ్మత్తుకు సంపెంగనైతే?

'కన్నా! యెచ్చటరా?' అని
నన్ను నీవు పిలిచినపుడు
పలుకక లోలోమురియుచు
దళమువిప్పి చూస్తుంటె

అమ్మా! కనుగొనగలవె
గమ్మత్తుకు సంపెంగనైతే?

జలకమాడి సంపెగ దా
పుగ పూజకు పోవునపుడు
'గుమ్మ'నువాసన పీల్చెద
వమ్మా! అదినాదేనని

అమ్మా! కనుగొనగలవె
గమ్మత్తుకు సంపెంగనైతే?

మసక పడినతోడనె నీ
పసిపాపగ మారి మరల
'అమ్మా! ఒకకథ చెప్పవె?'
అని నే బ్రతిమాలు కొంటె.

అమ్మా! కనుగొనగలవె
గమ్మత్తుకు సంపెంగనైతే?

'కొంటె వెధవ! నీవెచ్చట
నుంటివింత సేపం'టే
'చెప్పనులే అమ్మా!' అని
తప్పుకొంటె మానంగ

అమ్మా! కనుగొనగలవె
గమ్మత్తుకు సంపెంగనైతే?

[* శ్రీ రవీంద్రనాథటాగూర్ 'ది క్రిసెంట్ మూన్'కు తెలుగు అనుకృతి 'నెలవంక' నుండి.]

ఎవరి పండుగ?

పాత్రలు :

రాజ్యం, వెంకటప్పయ్య — భార్యా భర్తలు.
రంగనాథరావు, పార్వతి — భార్యా భర్తలు.
లక్ష్మి—10 సం॥ రాలు, సత్యం—1 సం॥ రం. — రాజ్యం, వెంకటప్పయ్యల పిల్లలు.
రామం 12 సం॥ రాలు, రాధ 2 సం॥ రాలు — పార్వతి రంగనాథరావు, పిల్లలు

పేరితాత ... వెంకటప్పయ్య తండ్రి.
శంభాయమ్మ ... రాజ్యంచుట్టం.
సూరమ్మ ... పార్వతి పొరుగా విడ.
వీరాయి ... దాసీది.

ఇంకా—లీల, గోపీ, గౌరీ, సోము, కాంత, గోపాలం, చంద్రం, గిరి—అందరూ 8-12 సం॥ రాలమధ్య పిల్లలు—

[సమయం : సాయంత్రం 6 గం॥ల నుంచి, మరునాటి మధ్యాహ్నం 12 గంటల వరకూ—]

(1 వ దృశ్యం)

[వెంకటప్పయ్య ఇంటి వీధి అరుగు; సాయంకాలం 6 గం॥ల వేళ; పేరితాత, లక్ష్మి, సత్యం ఆడుకుంటూ ఉంటారు.]

లక్ష్మి : తాతా, తాతా! ఓ కథ చెప్పవూ?

పేరితాత : ఓ - అనగనగా...(సత్యం, తాతగడ్డం పట్టుకుని పీకుతాడు) అబ్బ! గడ్డం లాగకురా (అరుస్తాడు)

ల : (ఫక్కున నవ్వి) లాగటం లేదు తాతా; "అనగనగా" కథలు నీ గడ్డం అంత మాసిపోయా యంటున్నాడు! (సత్యం చేతులు కొట్టుకుంటూ "ఊఁ ఊఁ హూఁ" అంటాడు) అదిగో పాట పాడమంటు న్నాడు తాతా!

పేరి : అయితేసరే; పాపాయికి ఓపాట, నీకో కథ - రెండూ కలిపి ఒక పాట కథ చెప్తా (లక్ష్మి తాతదగ్గరగా చేరుతుంది; పాప రెండు చేతులూ పట్టుకుని ఊపుతూ తాత పాటకథ ప్రారంభిస్తాడు)

"అనగనగా ఓ రాజ్యంలో ఓ వెన్నెల రాజు ఉన్నాడు. ఆయన ఓసారి ఆకాశం లోంచి గుర్రంమీద బయలుదేరి సముద్రం ఒడ్డుకి చేరుకున్నాడు; దాహం తీర్చుకుం దామని నీటిలోకి వంగి దోసిటనిండా నీళ్లు తీసేసరికి :

జిలిగిల జిలిగిల చేతిలోపలా
చిర చిర మంటూ ఎగిరింది;
మంచి ముత్యపూ కన్నె ఒక్కతే
మిల మిల ఎగిరీ ఆడింది!

దాన్ని చూసి రాజు ఏమన్నాడంటే:—

"రంగులరంగుల ముత్యపుభామా!
ఎటనోహూో, నీయూరు?
తళతళ మెరిసే ముత్యపుభామా!
ఎవరోహూో నీవారూ?"

అప్పుడు ముత్యపుభామ ఏమన్నదంటే:—

"తురాయిగట్టిన కిరీటమెంతో
ధగధగలాడే, ఓ రాజా!
ఎటనోహూో, నీయూరూ?
చరచర చెంగున పరుగులుతీసే
గుర్రమునెక్కిన, ఓ రాజా!
ఎవరోహూో, నీవారూ?"

అప్పుడు రాజు ఏమని సమాధానం చెప్పాడంటే:—

"నల్లని నల్లని మేఘాలల్లో
రివ్వున విసిరే గాలీపైన
చల్లగ నుండే వెన్నెలలోకం
మావూరే, ఓముత్యపు భామా!
మూసీ తెరచే కనురెప్పలతో
ఆరీ వెలుగుచు దోబూచాడే,
నవ్వులు కురిసే నక్షత్రాలూ
మావారే, ఓముత్యపుభామా!"

అప్పుడు ముత్యపుభామ కూడా ఏమం దంటే:—

"పడగలు విప్పిన పాములవంటీ,
బుస్సునకసిరే కెరటాల్లోటీ
మీగడ తరగల నురుగులనిచ్చే
సముద్రమంతా నావూరే;
తురాయిగట్టిన కిరీట మెంతో
ధగధగలాడే ఓ రాజా!
సముద్రమంతా నావూరే!
చిలచిలచిల చిరుపాట పాడుతూ
పూవులు జిమ్మెడి వెండియిసుకతో
కెరటపుటంచుల ఆటలుఆడే
నీటిముత్యములు మావారే;
చరచర చెంగున పరుగులుతీసే
గుర్రమునెక్కిన ఓ రాజా!
నీటిముత్యములు మావారే!"

అప్పుడు రాజు ముత్యపుభామని బుజ్జగిస్తూ ఏమన్నాడంటే: —

"చరచర చెంగున పరుగులుతీసే
గుర్రమునెక్కి, ముత్యపుభామా!
వెన్నెలలోకపు విహారమునకై
వస్తావా, ఓముత్యపుభామా?
తురాయిగట్టిన కిరీటమల్లే
ధగధగలాడే నక్షత్రాల్లో

కర్రా ప్రభాకర్

ఎవరి పండుగ?

ఆటపాటలా ఆనందంకై
వస్తావా, ఓముత్యపుభామా ?"

అప్పుడు ముత్యపుభామ ఏమన్నదంటే:—

"పున్నమినాటి రేతిరినాడూ
సముద్రమంతా వెన్నెలలోకం!
వెన్నెలబిందుల ఎగురుచుదూకే
కెరటాలాటలె నాకానందం!
అయినా సరె నీ కిరీటమెక్కి—
రానిస్తావా, ఓ రాజా ?"

అప్పుడు రాజు 'సరే' అని ముత్యపుభామని తన కిరీటంమీద ఎక్కించుకున్నాడు. అప్పుడు ఇద్దరూ ఏంచేశారంటే:—

సముద్రమే ఒకపడవగ జేసీ,
మబ్బునొక్కటీ తెరగాకట్టీ,
కెరటాల్తోనే తెడ్లనువేసీ
గాలిహోరునే పాటగపాడీ,
వెన్నెలలోకపు విహారమునకై
రివ్వున పయనం బైనారూ;
గుర్రమునెక్కిన వెన్నెలరాజూ!!"
కిరీట మెక్కిన ముత్యపురాణీ!!

(పాట ముగియడంతోటే లక్ష్మి చప్పట్లు కొడుతుంది; తాత పాపచేతుల్తో చప్పట్లు కొట్టిస్తాడు. ఇంతట్లోకి ఇంట్లోంచి "ఏమిటర్రా గోల?" అని అరుస్తూ రాజ్యం వస్తుంది)

రాజ్యం: ఏమిటే లక్ష్మీ ఆ కేకలూ కేరింతాలూనూ; మరీ బండపారిపోతున్నావు?

లక్ష్మి: మరేం లేదమ్మా, తాతా మేమూ ఆడుకుంటున్నాం.

రాజ్యం: నీ మొహం, తాతయ్యతో నీకాటేమిటే?

లక్ష్మి: ఏం? "తాతయ్యతో ఆడుకో, పోయి" అంటావుగా పాపాయిని; నేనాడితేనేం?

రాజ్యం: అవునూ, తాతయ్యలూ పాపాయిలూ ఒకటేను.

లక్ష్మి: ఎందుకమ్మా, అలా బుకాయిస్తావ్?

రాజ్యం: ఏం బుకాయించానూ?

లక్ష్మి: తాతయ్యలూ పాపాయిలూ ఒకటెలా అవుతారు?

రాజ్యం: వయసు ముదిరినవాళ్లు పిల్లలతో సమానం అంటారు (తాతయ్యవైపు పెదిమలు విరిచిచూసి తలాడిస్తూ) చిన్నపిల్లల కెంత చాకిరీ చెయ్యాలో ఈ వయసు ముదిరినవాళ్లకీ అంతే చాకిరీచెయ్యాలికదూ మరీ! (తాతయ్య తల పైకెత్తకుండా నేను పైకిపోనిచ్చి ఓసారి రాజ్యంకేసి పరీక్షగా చూసి, గడ్డం నిమురుకుంటాడు సాక్షీగా - 'నీ పని చెప్తావుండూ' అన్నట్టు)

లక్ష్మి: (తాతయ్యకేసి ఓసారి, రాజ్యంకేసి ఓసారిచూసి చిలిపిగా బుర్ర ఆడిస్తూ) అవునా తాతయ్యా?

పేరి: ఓ, భేషుగ్గా! మా పాపాయీ నేనూ ఒకటే (పాపని చట్టున దగ్గిరికి తీసుకుని గుండెకి అదుముకుంటాడు)

లక్ష్మి: మీరు లక్ష చెప్పండి, నేను మాత్రం ఒప్పుకోను. (పుల్లవిరిచి నట్టుఅని, చటాలున కూర్చుంటుంది)

పేరి: ఏం?

లక్ష్మి: ఏమంటారా.. (చటాలున లేచి డాన్సుచేస్తూ పాడుతుంది):

"మా పాప నవ్వితే
కెంపులొలికే నోట
ముత్యాల వెన్నెలలు
కురిసేను, మెరిసేను!
మాతాత నవిత్వే
బోసినోటిలోనుంచి
తుప్పర్లుకురిసేను
పొగకంపు కొట్టేను!
మా పాప ఊయెలలో
హాయిగా నిదురించి
గొలుసు పాడేపాట
'కూ' గొట్టుచూతూగు!
మా తాత పెరటిలో
కుక్కిమంచముపైన
మనుషు లదరేటట్టు
గుర్రుతో నిదురించు!!
మా పాప మెల్లగా
అడుగులో అడుగేసి
మువ్వలూ గజ్జలూ
మోయించి నడచేను!
మా తాత వణుకుతో
అడుగేయనే లేక
'టక్కు' 'టక్కు'న చేతి
కర్రతో నడిచేను!!
మా పాప వాకిటిలో
ఆటాడగా రాగ,
పొరుగింటి పడుచులూ
కౌగిటిలో అదిమేరు!
మా తాత నడివీధి
నడయాడగా రాగ,
దరినుండు పడుచులూ
దూరాని కేగేరు!!"

(పాటా, డాన్సు ఆపి, తాతగడ్డం పీకుతూ) "నువ్వూ పాపా ఒకటేనా తాతా?" (అంటూ లోపలికి పరుగెత్తుకుపోతుంది; దాన్ని తరుముతూ తాతకూడ లోపలికి వెళ్లిపోతాడు. రాజ్యం ఒక్క ఊపున పాపని నెత్తి కెక్కించుకుని.)

రాజ్యం: చిలిపి పిల్ల! నిజమే మరి ఈ వయసులో ముసలాళ్లున్నారే, నరకమే బాబూ! (పాపాయి సంకలో కిదిగి "ఊఁ" అని రెట్టిస్తాడు. రాజ్యం చకితిలపడి పాపాయి చేతులతో తాళం వేయిస్తూ పాడుతుంది):—

"మా పాప గజ్జెలతో
గంతువేసిందంటే;
మా యింట నటరాజు
నాట్యమే చేస్తాడు!
మా పాప కిలకిలా నవ్వు
నవ్విందంటే,
మా వీధి చెందురుడు
వెలవెలా బోతాడు!

ఎవరి పండుగ?

మా పాపముద్దుగా పలుకు
పలికిందంటే;
మా లక్ష్మివీణనే
మీటినట్టుంటాది!
మా పాప చేయెత్తి పిలుపు
పిలిచిందంటే;
మా లేగదూడలే
గంతేసి వస్తాయి!
మా పాప నోరిప్పి గుటక
వేసిందంటే;
మాయావు పాలతో
కడవనింపేస్తాది!
మా పాప మాయింట
మసలుతూ వుందంటే;
మా కెల్ల మనసులో
స్వర్గమనిపిస్తాది!"

[వెనకనుంచి సూరమ్మ, "మాపాప మాయింట మసలుతూ వుందంటే, మాకెల్ల మనసులో స్వర్గమనిపిస్తాది" అన్న చరణం రెట్టిస్తూ వస్తుంది)

రా: సూరమ్మత్తా, కూర్చో.

సూరమ్మ: సంజె పడిందమ్మా; ఏం కూర్చుంటాలే. (పాపాయినితీసుకుంటుంది)

రాజ్యం: ఏమిటి విశేషాలు?

సూ: ఏంగున్నాయి, విశేషాలు ..... అయితే కాని, రేపు పార్వతమ్మ కూతురు పుట్టినరోజుగా.

రా: అవునత్తయ్యా. మరీయేడాది ఏంకొత్తలూ వింతలూ జరిపిస్తుందో.

సూ: ముందే తెలిసిపోతే కొత్తా వింతా ఏముంటుందీ!

రాజ్యం: ఎంత సంబరంతో జరుపుతుందో ఆవిడ!

సూ: కాదుమరీ! పుట్టి భూమినపడ్డప్పటినుంచీ, ఏక్షణాన మళ్ళీ భూమిలో కలిసిపోతుందో అన్నట్టే రోగాన పడింది కదా, ఏడాది పాటు - భగవంతుడు ఆ గండం కాస్తా దాటించాడాయిరి; మరి సంబరమా, పెళ్ళి సంబరమా! అందుకనే మరీ, క్రితం ఏడాది దాని పుట్టినరోజు పండుగ పెళ్ళిలా ఫెళఫెళలాడించేసింది.

రాజ్యం: పదిమందికి భోజనం పెట్టడం అంటే అలా వుండాలి; భోజనం పెట్టడం కూడా. చేతనవాలంటాను పిన్నీ! మనిళ్ళలో ఎప్పుడయినా పెళ్ళిళ్ళూ సంతర్పణలూ జరిగితే - ఆవేళ నాలుగు కూరలూ, నాలుగు పచ్చళ్ళూ), పప్పూ ధప్పళమూను - రోజూ మనం మింగేవే! - ఆపైన అరడజను పిండివంటలు! ఆ పిండివంటలయినా, తీరా మజ్జిగ పోసుకునే సమయానికి వచ్చి - 'వద్దు' 'వద్ద'నిపిస్తూ విస్తర్లలో దొర్లిస్తూండడమూను...

సూ: యిత్యాలాలకపోసేవే రాజ్యం. నన్నడిగితే పార్వతమ్మ చేయించినట్లు ఒక కూర, పచ్చడి, పులుసూ - అంతే. ఆపైన పట్టించు పిండివంటలు - పొట్టనిండేట్టూ ?? పొడుగునా తేస్పేటట్టూను!

రాజ్యం: ఆ పిండివంటలయినా, వగవ లడ్డూలూ జిలేబీలూ చేయించిందా. అంచకొక్క - డూ? పేడాలట, చీనీ బర్ఫీలట; అదేనమ్మ బంగాళా మసాళాబోండాలట - కొత్తకొత్తవీ, వింత వింతవీనూ!

సూరమ్మ: ఒక్క పిండివంటల్లో నేనా ఆ వింత! వచ్చిన పేరంటాళ్ళందరికీ కొబ్బరి బొండాలు, రవికల గుడ్డలూ యిచ్చిందా మరి......

రాజ్యం: ఆ! పెట్టెలో మూలుగుతున్నాయి, పేరంటం రవికల గుడ్డలు— బాడీకే చాలవూ, జేబు రుమాళ్ళకూ పనికిరావు!

సూ: హుఁ! పౌడరుడబ్బా, దువ్వెన్న అద్దం, కుంకుంబరిణ కలిపి, ముచ్చటగా నగిషీ పెట్టెలో పెట్టి పంచిపెట్టింది అందరికీను.

రాజ్యం: వాటన్నింటినీ మించి నాకు నచ్చిన విషయం, ఆ వాయినాల ఖంజాయింపు పిన్నీ! ఎంత సాఫీగా జరిపించిందనుకున్నావు. ఓ పిల్లల ఏడుపులూ, చెలగాటాలూ ఏమీ లేవుకదా! నాకు పిలలు గొడవచేస్తే మహా చికాకేసుకొస్తుంది పిన్నీ. పార్వతమ్మకూడా నాలాంటిదే అనుకుంటాను—ఆవేళ పిల్లల్నిమాత్రం చస్తే దగ్గిరికి రానిచ్చిందికాదు......

సూ: అదిగో మీ ఆయ నొస్తున్నాడు వెడతా (లేచి చకచకా వెళ్ళిపోతుంది. రాజ్యం, సూరమ్మకేసే మాస్తూ పరధ్యానంగా నిలపడిపోతుంది. చంకలోంచి పిల్లాడు జారుకుని లోపలికి వెళ్ళిపోతాడు. ఈలోపున వెంకటప్పయ్య వచ్చి వెనక నిలబడి ఆమెను పరికిస్తాడు ఓ నిమిషం. ఆ విషయం రాజ్యం గమనించదు. కొంతసేపు వేచి ఉరిమినట్టు)

వెం: ఓహోయి!

రాజ్యం: (ఉలిక్కిపడి) అబ్బ ఏమిటండీ అలా ఉరుముతారూ?

వెం: మరేమిటి! మేఘమండలంలో ఉన్నదానవు, ఉరుముకాకపోతే అరుపు వినిపిస్తుందా!

రాజ్యం: మేఘమండలం దాటి ఊహామండలంలో వున్నా; మరి మీ ఉరుము మాత్రం వినిపిస్తుందా?

వెం: ఓహోహో! ఊహామండలంలోంచి స్వర్గమండలానికి మెట్లు కడుతున్నావా ఏమిటి?

రా: అహఁ! ఆ స్వర్గమండలాన్ని పెకిలించి మీ ముంగిట్లో పెడదామనీ!

వెం: అచ్ఛా...అచ్ఛా! నోబుల్ ప్రైజు నీకు! అలా కుర్చీలో కూర్చో. నాకప్పటే అంతా ఏదో కొత్తలోకంలో వున్నట్టని

పిస్తోంది లే. (కూర్చుని) హేఁ! ఇంతకీ అసలు సంగతేమిటి?

రాజ్యం: అల్లా ఆఫీసునుంచి వచ్చే టప్పుడు చూడలేదూ, పార్వతమ్మగారింటో..."

వెం: (విసుగ్గా) అబ్బ! ఎవళ్ళింటో గొడవో ఇప్పుడెందుకూ? మనసంగతి చెప్పు.

రాజ్యం: వాళ్ల పార్వతమ్మ కూతురు పుట్టినరోజు పండుగ రేపు; అలాగే......

వెం: ప్చ్! ఎవరింటోనో ఎవరికూతురికో పుట్టినరోజైతే మనకేమే? కావాలంటే మనం చేద్దాం, మనబ్బాయి పుట్టినరోజున... అసలు సంగతేమిటే అంటూంటే...

రాజ్యం: అదే సంగతి, ఇంకేముంది (జయించిన వీరు నిలా అంటుంది)

వెం: అంటే (బుర్ర గోక్కుంటాడు)

రాజ్యం: అదే, మనబ్బాయి పుట్టినరోజు సంగతి.

వెం: మరి, వాళ్లెవరమ్మాయో పుట్టిన రోజు అన్నావు?

రాజ్యం: (కొట్టచ్చినట్టు) అబ్బ! ఎవళ్ళమ్మాయో పుటినరోజు సంగతి మన కెందుకండీ; మనబ్బాయిసంగతి మాట్లాడు తూంటేనూ.

వెం: భళిరా "నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష." సరిపెట్టేశావు. (లేవబోతాడు; రాజ్యం వంచి కూచోపెడుతూ.)

రాజ్యం: లేచిపోతారేం, అసలు సంగతడిగి?

వెం: ఇంకా వచ్చేసెలకదా, ఇప్పటినుంచీ ఏంతొందర?

రాజ్యం: ఇప్పటినుంచీ డబ్బూ దస్కం సర్దుకోవాలా మరి ఎంత సర్దుకోవాలో తెలుసుకోవాలంటే ఏవేమి చెయ్యాలో ముందు తేల్చుకోవాలికదా.

వెం: సరే అయితే తెల్చేసుకో.

రాజ్యం: తేల్చడానికేముందీ, నిరుటేడు చూశారుగా, పార్వతమ్మ ఏం చేయించిందోను......

వెం: (గేలిచేసినట్టు) ఏం చేసిందేమిటీ?

రాజ్యం: (ఎత్తిపొడిచినట్టు) మరే. ఆవిడ ఏం చేసిందో మహా తెలియనట్టు!

వెం: నీవేం చెయ్య దలచుకున్నావో నాకేం అర్థం కాలేదు.

రాజ్యం: పార్వతమ్మలాగే, ఆవేళ ఈ వీధి ఆడాళ్లందర్నీ పిలుస్తానండీ పేరంటానికి...

వెం: పార్వతమ్మగారిలాగే నువ్వు చేస్తే నీ ఘనతేం ఏడిసిందంటాను.

రాజ్యం: మరేం చెయ్యమంటారూ?

వెం: అలా అడుగు, సలహా చెప్తా (కాలుమీద కాలు వేసుకుని కూర్చుంటూ, ఒక మహాసభలో ఉపన్యసిస్తూన్నట్టుగా, చూపుడు వేలుతో చెయ్యి ఝాడిస్తూ) 'ఒకానొక ఒకడు' ఒకానొక గొప్పపని చేశాడంటే, దానికి పూర్తిగా వ్యతిరేకం చేస్తేనే, 'ఒకానొక వేరొకడు' ఆ 'ఒకానొక ఒకడు'కంటె గొప్పవాడవుతాడు! (ఉపన్యాసం ముగించి, సభికుల చప్పట్ల కోసం ఎదురు చూసినట్టుగా రాజ్యం కేసి ఓసారి చూసి) ఏం అలా చప్పబడిపోయావేం?

రాజ్యం: (కసిరినట్టు) ఏం చెయ్యమంటారు?

వెం: (నిష్కర్షగా) ఆవిడ తన కూతురు పుట్టిన పండుక్కి 'ఈ' వీధి ఆడాళ్లందర్నీ పిలిచింది; నువ్వు నీ కొడుకు పుట్టినరోజు పండుక్కి 'ఆ' వీధి మొగాళ్ళందర్నీ పిలిపించు'—ఎఁ! హాఁ!

రాజ్యం: ఏమండీ ఆ మాటల కేమైనా అర్థం పర్థం వుండాలా?

వెం: ఎందుకు లేదూ?

రాజ్యం: మరేమిటి? పిల్లాడి పుట్టినరోజు పండుక్కి ఆడాళ్ళకి కాకపోతే మొగాళ్లకేం పనంట?

వెం: 'పిల్లల' పండుక్కి ఆడాళ్లకిమాత్రం ఏంపనంట?

రాజ్యం: ఆ పిల్లలపండుగ ఆ పిల్లలతల్లులు చేసుకుంటారంటాను.

వెం: ఆ పిల్లలపండుగ ఆ పిల్లలతండ్రులు మాత్రం ఎందుకు చేసుకోకూడదంటాను?

రాజ్యం: అయితే ఆ తల్లులతోపాటు ఆ తండ్రులుకూడా వాయినాలు పుచ్చుకుంటారా?

వెం: భేషుగ్గా! నానీనానని పచ్చికేసన గలు కాకుండా, అంచక్కా వాటిని మసాలాపోపు వేసి యిచ్చారా - వాయినాల కొస్తామా, చీరలు కట్టుకొస్తామా!

రాజ్యం: (అలిసిపోయినట్టు) ఏమండీ, అంతా వేళాకోళం క్రిందకట్టడమేనా, కొత్త 'చెప్పినట్టు వినడం' ఏమైనావుందా?

వెం: నే చెప్పేదంతా నీకు వేళాకోళంగా ఎందుకు కనిపించాలేం?


రాజ్యం: (దుష్టుడికి దూరంగా వుండాలనుకున్నట్టు) బాబూ, మీకు పదివేల నమస్కారాలు! మీతో నేను వాదించలేను. 'సిసలు'గా అడుగుతున్నా - పిల్లాడి పుట్టినరోజు పండుక్కి మీ ప్లాను ఏమిటండీ?

వెం: 'అసలు' అడుగుతున్నా; నీప్లాను ఏమిటి?

రాజ్యం: అయితే వినండి - ఆవేళ మనింట అందరికంటె ముందు మన పాపాయి లేస్తాడు......

వెం: ఆ వెధవ తొమ్మిదింటికి గాని లేవడు గా!

రాజ్యం: (కొట్టొచ్చినట్టు) మాటలు



బెస్త
చిత్రకారిణి:—చామకూర సిరిశేరి (4 సం॥) మద్రాసు.

ఎవరి పండుగ?

తిన్నగా రానీయండి. 'శుభమా' అని వాడి పుట్టినరోజు పండుగేమిటి, మీరు 'వెధవ'/ అని ప్రారంభించడం ఏమిటి?

వెం: (తుదూపణ కోరుతూన్నట్టు) అది కాదే, మనందరికంటె ముందువాడు లేవడం ఎలా సంభవిస్తుందంటాను.

రాజ్యం: అయిదుగంటలకి అలారం పెట్టి వాడిదగ్గర పెడతా గడియారం.

వెం:—షెడ్యూలున తంతాడంతే!

రాజ్య: వాడికాళ్ళకి గట్టిగా కడతా తేమిటండీ గడియారాన్ని?

వెం:—దూరంగా పెడితే అలారం విని పించదు మరి.

రాజ్యం: కాకపోతే పక్కింటివాళ్ల గడియారం తెచ్చి పెడతా.

వెం: ఏడిసినట్టేవుంది. మొట్ట మొదటే ఎరువుసామ్మా?

రాజ్యం: (ఆరాతీసినట్టు) అయితే ఏ అవసరానికి ఏ సామాన్లు ఎక్కణ్ణుంచి తెచ్చుకోవాలో నాకు తెలియదూ! ఆమాత్రం తెలివితేటలు లేకుండానే కాపురం చేశానంటారూ, ఇన్నాళ్ళ మీతో?

వెం: ఏమో! నేనుమాత్రం నేనుమాత్రం ఆ విషయం తెలుసుకోకుండానే కాపురం చేశా, ఇన్నాళ్ళూ నీతో!

రాజ్యం: (ఉక్రోషంతో) ఈ ఏడాదికి వాడి పుట్టినరోజు పండుగ చెయ్యనండీ!

వెం: ఫోన్స్! నీ కెక్కేమిటి! నీ ప్లాను కంటె దివ్యంగా జరిపిస్తా ఆ సరికోసే.

రాజ్యం: (ఏడుస్తున్నట్టు) మరేమిటండీం మాటిమాటికీ అడ్డుప్రశ్నలు వేసి చంపుతూ), చేసూ!

వెం: (ఓదారుస్తున్నట్టు) బాగుంది. 'కష్టా కష్టం,' 'వీలా వీలూ' చూస్తున్నా కానీ... ఇంతకీ నీ ప్లాను ఏమిటో బైట పడెయ్యవాయిరి.

రాజ్యం: ఇంకేం పడెయ్యాలేం. పాపాయిని ప్రొద్దున్నే అయిదుగంటలకి లేపడం; లేచీ లేవడంతోటే తలంటిపొయ్యడం...

వెం: కాని ఒకటే......

రాజ్యం: కానీ లేదు...ఒకటి లేదు.

వెం: కాస వింటే ఏంపోయింది? "వినదగు నెవ్వరు చెప్పిన..." అన్నాడు...

రాజ్యం: ఆ! వాడిమూలంగానే దేశం అంతా నీతి పాడిపోయి నాచు పట్టిపోయింది...సరి, ఇంతకీ ఏమిటే మీ ఒకటీ, రెండూనూ?

వెం: నా ఉద్దేశంలో పిల్లాడి పుట్టినరోజు పండుగంటే—ఆ రోజల్లా వాణ్ణి కిలకిల నవ్విస్తూ, చకచకలాడిస్తూ-వుంచాలంటాను.

రాజ్యం: మరి నేనుమాత్రం మరోలా అన్నానా?

వెం: (మందం దులిపినటు) మరేమిటేది; తెల్లారకట్టే లేపడంతోటే ఏడిపించడం మొదలా; ఆ వెంటనే వాడికి తలనీళ్ళోటూ కొట్టుకొక, వాడి కళ్ళల్లో కుంకుడుకాయ పులుసు పోసి, వాడి కళ్లు కాయలు కాచేట్టు చేసి వాణ్ణి ఆరోజల్లా ఏడిపించడమూ? ఈ అమ్మలక్కలు మాత్రం చీరలు సింగారించుకుని, నగలు దట్టించుకుని, వాయినాల భాగోతం ఆడడమూ? ఇదేనా పిల్లలు పుట్టిన పండుగ: గొప్ప ప్లాను వేశావు, నడునడు! (దటాలున లేచి తువ్వాలు రాజ్యం మొహం మీద గిరాటేసి ....)

— దృశ్యం —

(రంగనాథరావు ఇల్లు, కూచునేగదిలో; సమయం: రాత్రి 9 గం॥ రంగనాథరావు పడకకుర్చీలో కాళ్లు ముడుచుకుని కూర్చున్నాడు; చేతిలో ఒక పద్దు పుస్తకం వుంటుంది. ఎదురుగా తివాచీమీద కూర్చుని ధర్మకి తమలపాకులందిస్తూంటుంది పార్వతి)

పార్వతి: (ధీమాగా, యాజమాన్య స్వరంలో) ఊఁ, ఇంకా?

రంగనాథరావు: రవికలగుడ్డలు, పౌడరు డబ్బాలూ, పాండ్సు క్రీములూ, జరీస్లిప్పర్లూ, ఓ వంద పేరంటాళ్ళకీ, ఆడబిడ్డ...

పా: రైట్! పెద్దనూలుబండి, జాజులు నూరుటూ కూడా వెయించండి.

రంగ: నూలుబండి ఎందుకే?

పా: ఆ నూలుబండి కొన్ని ...

వస్తుంది; ఆ బండి దారం తీసినప్పుడల్లా మనం జ్ఞాపకం రావాలి వాళ్లకి!

రంగ: సరి. అన్నట్టు మరిచా - టూత్ బ్రష్‌లూ, పేస్టులూ కూడా వేయిస్తున్నా.

పా: నేనే వాడనుకదా, వాళ్లందరికీ ఎందుకండీ?

రంగ: పేడకచికతో మొహం తోము కునే ఆడాళ్లని చూస్తే నాకు వళ్లు మండు కుపోతుంది సుమా; అందుకని.

పా: సరే మెళ్లో ముత్యాలసరాలు లేక పోయినా, మొహంలో ముత్యాల పలువర సైనా వుంటుందంటారు; అహఁ; ఊఁ

రంగ: తరువాత భార్యతో సహా వచ్చే మొగాళకి పేరు కొనుకలూ, భార్యలు 'మినహా' వచ్చే మొగాళ్లకి పేరు కొనుకలూ వేయించా.

పా: రైట్! మరి భార్యలు 'లేని' మొగాళ్లకేం వేయించారు?

రంగ: బ్రహ్మచారులకి పిల్లలపండుగతో ఏంపనిలే! ఎవడు పెళ్ళిచేసుకోవద్దన్నాడు! హోటలుభోజనంతో బాధ పడుతూంటారు; వాళ్ళకి ఫస్టు క్లాసు భోజనం చాల్లే.

పా: రైట్! మరయితే పెద్దలతో వచ్చే పిల్లలకేం తెప్పిస్తున్నారు?

రంగ: అబ్బ, పోనిద్దూ; వట్టినూ సెన్నా ఈపిల్లలు! అందులోనూ బహుమానా లిస్తున్నామంటే మరీ చిందరవందరచేసి పారేస్తారు కోతుల్లాగ. శుభ్రంగా కావలసినన్ని లడ్డూలు పెడదాం...

పా: అహఁ, లడ్డూ లొద్దండోయి! తెగ తిని మా చీరలకి తుడిచి పారేస్తారు. అయినా - మొగాళ్ళకూడా ఇస్తున్న వాఁయె; ఆడాళ్లకి ఎట్టాగా తప్పదుకదా; మరింకెంతమందికేం?

రంగ: అయితే పిల్లల ఐటం తీసేద్దాం. వాళ్ళకి ఆ తోటచివరి 'రంకు (గు) ల రాట్నం' పెట్టిద్దాం; ఇక మనజోలికి రాదు.

పా: రైట్! ఇంతకీ మన అమ్మాయికి ఏంకొంటున్నారూ? అసలుపండుగ దానిది కదా!

రంగ: రాధకి రెండు పేటల బంగారు గొలుసు కొంటున్నా.

పా: చిన్నపిల్ల గొలుసేం పెట్టుకుంటుందండీ?

రంగ: అబ్బ, అది పెట్టుకుంటుందిలే! అపూట కాస్త దాని మెళ్లోవేసి, ఆపైన నువ్వే పెట్టుకుంటూండచ్చు.

పా: రైట్! ఇంకేమిటి?

రంగ: దానికో చిన్న వెండికంచం వెండి గిన్నె కొందామనుకుంటున్నా.

పా: చిన్నవెందుకండీ, కాస్త పెద్దవే కొంటే; రామంకూడా వాడుకోవచ్చు?

రంగ: రైటో రైట్! దానికింకా, ఓ డజను పలకలూ, రెండు డజన్ల బలపాలూను...

పా: అయ్యో రాత! అన్నెందుకండీ?

రంగ: విద్య, విద్య! సరస్వతీ ప్రసన్నం!

పా: సరేకాని పిలుపు కవర్లు పోస్టు చేశారా?

రంగ: పోస్టులో వేయించడంకంటె అంచక్కా మన రామం, వాళ్ళ లక్ష్మి అందరికీ స్వయంగా ఇచ్చొస్తారు; మర్యాదగా కూడా వుంటుంది.

పా: వాళ్లకి పనెందుకండీ మళ్ళీనూ? ఆ అయినా వాళ్ళకి ఏ యిల్లు ఎవరిదో ఏం తెలుసూ?

రంగ: పిల్లలకు పనేమిటే! పేరి తాత తను కూడా వుంటానన్నాడు. అసలు ఆయనే ఈ ఉపాయం చెప్తే...

పా: రైట్! ఇహ పడుకుందాం. చీకటితోటే లేస్తే బోలుడంత పని...అన్నట్టు ఏమండోయి! ఈ సామానంతా పెరటివైపు గదిలో వేయించండి; అందరికళ్ళూ పడితే దిష్టి తగులుతుంది పిల్లకి!

రంగ: అవన్నీ నేను చూచుకుంటాలే; పిల్ల పుట్టినరోజు పండుగ నే చేయిస్తాగా మొగాణ్ణి!

పా: (లేస్తూ) రైట్.

రంగ: (లేస్తూ) రైట్.

[పక్కని 'రైట్' అని వినిపిస్తుంది.]

పా: } ఎవరూ?
రంగ: }

[పక్కనుంచి—"నేనయ్యా పేరితాతని పడుకున్నా"]

3 వ దృశ్యము

(వెంకటప్పయ్య ఇంటి వీథి అరుగు; సమయం ప్రొద్దున్న 10 గంటలు. రాజ్యం పట్టుచీర దులుపుతూంటుంది. ప్రక్కనించి శంభాయమ్మ వచ్చి.)

శంభాయమ్మ: అదిగో పట్టుచీరే పుమ్పుకున్నావ్! సమయానికి వచ్చానన్న మాట!

రాజ్యం: రా పిన్నీ, రా! ఏమిటి విశేషం, ఇంతదూరం వచ్చావు?

శంభా: 'మరేం లేదమ్మా!' అమ్మాయి నంది కేశ్వరుని నోమునోచుకుంది. కాస్తపాయిసం అప్పాలు తిందువుగాని రా; పిలుపుకే వచ్చా.

రాజ్యం: బాగుంది అల్లానే.

శంభా: వస్తా, ఇంకా మనవాళ్లందర్ని పిలవాలి. అసలే ఆలస్యంగా బయలుదేరా. (తిరిగి వెడుతూ, నాలుగడుగులు వేసి మళ్ళీ వెనక్కి తిరుగుతుంది.) మళ్ళీమళ్ళీ అన్నాననుకోకేం. నువ్వుమాత్రం తప్పకుండా రావాలి మా తోటికోడలుకూడా వచ్చింది ఊరునించి మొన్న. నిన్ను చూడాలని

★ ఎవరి పండుగ? ★

ఎంతో ఇదిగా వుందిట! మళ్ళీ ఫోంచేసి బండికి వెళ్ళిపోతుంది. మరచిపోవుకాదూ!

రాజ్యం:..................

శంభా: ఏం సందిగ్ధంలో పడ్డావు?

రాజ్యం: మీ తోటికోడలిని చూడాలని నాకూ మహా 'ఇదిగా' వుంది కాని, చెప్తే మరోలా అనుకోకేం. ఆ వీధిచివర పార్వతమ్మగారిని ఎరుగుదువు కాదూ?

శంభా: ఆ, ఏదో విన్నాలే; ఏమిటి చెప్పు.

రాజ్యం: వాళ్లమ్మాయి పుట్టినరోజు పండుగ ఇవాళ. ఎంతో గొప్పగా జరుపుతూంది. పొద్దున్నే వచ్చి "కాస్త నాకు సాయం ఉండవూ" అని బ్రతిమాలింది. "ఇంతోటి మా భాగ్యానికి బ్రతిమాలాలా అమ్మా; తప్పకుండా వస్తా"అని మాటిచ్చా. మరి తీరా...

శంభా: కాదుమరి! మాటిచ్చిన తరువాత ఎల్లాగా. పోనీలే ఇంకోసారి చూద్దువుగాని. వస్తా (గబగబా వెళ్ళిపోతుంది)

రాజ్యం: (పట్టుచీరదులుపుతూ)లక్ష్మీ... లక్ష్మీ..

లక్ష్మి: (దూరాన్నుంచి" అమ్మా అని కేకేసి, వచ్చి) అమ్మా ఎందుకే బెనారసు చీర తీశావు ఈవాళ (క్రిందిపెదిమ నొక్కుకుంటుంది)

రాజ్యం: మరి పార్వతమ్మగారింటికి భోజనానికీ పేరంటానికీ వెళ్ళద్దూ. వాళ్ల రాధ పుట్టినరోజు పండుగ, తెలుసా?

లక్ష్మి: మరేమరే పిండివంటలు మహా జోరుగా ఉడుకుతున్నయక్కడ. (గుడ్లు మిటకరిస్తుంది) మరి నన్ను పిలవలేదేమే?

రాజ్యం: నన్నుమాత్రం ఇంకా పిలిచారేమిటి? వస్తాంటారు; వీధంతా పిలుచుకు రావాలా మరి! (లక్ష్మి, రాజ్యం ఇద్దరూ చీర మడత పెడుతూంటారు)......ఏమిటి చెప్మా, పద వస్తోంది. ఇంకా పిలుపు రాలేదు. ఇంత పొద్దెక్కి పిలుచుకుంటారా ఎక్కడైనా?

లక్ష్మి: మనల్ని పిలవరేమో నే (నాలిక కరుచుకుంటుంది)

రాజ్యం: బాగుందే! వీధంతా పిలిచి మనల్ని మాత్రం మానేస్తారులే!

లక్ష్మి: అసలు ఎవర్నీ పిలవరేమో.

రాజ్యం: ఎందుకు పిలవరేవ్! అంత హడావిడి చేస్తున్నారు; వంటవాళ్లు నిన్న సాయంత్రంనుంచే పని ప్రారంభించారు మరి!

లక్ష్మి: ఏమో అవన్నీ అందరికీ పెట్టడానికి చేశారని ఎక్కడుంది? ఏటికేడాదీ వాళ్ళు తింటూనూ చుంటారేమో(నాలికతో 'న్ఞ', 'న్ఞ' అని కొడుతుంది.)

రాజ్యం: (కసరుతూ) ఒసేవు, తర్కం చెయ్యక పోయి ఆడుకో, వాళ్లు పిలిచినపుడు వద్దువు గానిలే.

(లక్ష్మి కొంచం దూరంపోసి భరత నాట్యం పోజులో కదం తొక్కుతూ, అభినయం చేస్తూ పాడుతుంది):

రైట్ లెఫ్ట్ రైటుటా;
లెఫ్ట్ రైట్ లెఫ్టటా!
పేరితాత రైటుటా;
పార్వతమ్మ లెఫ్టటా!
పిన్నలంత రైటుటా;
పెద్దలంత లెఫ్టటా!
రైటు లెఫ్ట్............"
చీమలంత దేవుళ్లకి
కొండలంత గుళ్లటా!
దేవుళ్లకి నైవేద్యం,
భక్తులకి తిండిటా!
రైటు లెఫ్ట్..........
పేరితాత.........
పెద్దలంత.........
రావిచెట్టు వేపచెట్టు
రిజిస్ట్రీ పెళ్ళిటా!
కుడిచేతి దెబ్బకీ
పురచేత బువ్వటా!!
రైటు.........
పంతులమ్మ పెళ్ళికీ
పేక బెత్తం కాన్కటా!
....

(రాజ్యం ఛట్టున లేచి మూలనున్న కర్ర తీసి:

"పంతులారి పిల్లకీ
పేకబెత్తం పెళ్లటా!"___అంటూ

లక్ష్మిని కొట్టడానికి వస్తుంది)

లక్ష్మి: (పారిపోతూ)

పేరితాత రైటటా;
పార్వతమ్మ లెఫ్టటా!
రైటులెఫ్ట్రైటటా
లెఫ్ట్ రైటు లెఫ్టటా

(భుజా లెగరేస్తూ, కదం తొక్కుతూ, బుగ్గ లుబ్బించికొడుతూ ఓ ప్రక్కగా వెళ్లిపోతుంది. రాజ్యం ఓ నిట్టూర్పు విడిచి దతికిలపడిపోతుంది. మరోక్షణానికి "రాజమ్మగోరూ,...రాజమ్మగోరూ!" అంటూ పెద్దగా అరుస్తూ, దాసీది వీరాయి లోపలనించి వస్తుంది)

వీరాయి: ఏవమ్మోయి, రాజమ్మగోరూ (ఎదుట కనిపిస్తుండగానే అరుస్తుంది)

రాజ్యం: ఎందుకే చెవికోసిన మేకలా అలా అరుస్తావు? (ఉరుముతుంది)

వీ: అదేందమ్మోయి, అంతకోపం సేత్తుండావ్?

రాజ్యం: కోపం లేదూ, నీ మొహం లేదూ; ఏంకావాలేం?

వీ: కూత్తంత మజ్జిగ సుక్కంటే రాల్చమ్మా, మరిదిగా రొచ్చాడు.

రాజ్యం: ఆ, దాచిపెట్టా మజ్జిగలూ పెరుగులూ నీకోసం!

వీ: కోపం ఎందుకొచ్చిందమ్మా? పొద్దాలే అయమ్మెవరో ఒచ్చింది; అవిడ గోరు దెబ్బలాటేసిందేం?

రాజ్యం: (ఆత్రంగా) ఎవ...రె వరే వస్త?

వీ: ఆవిడెవరోనమ్మా; సిల్కుచీర కట్టుకుంది.

రాజ్య: (తృప్తిగాలేస్తూ) ఆఁ!...ఆఁ! వచ్చిందీ. సిల్కు చీర కట్టుకుందా!

వీ: ఔనమ్మా! ఏదో పిలుపు కొచ్చినట్టుంది ఓలకం చూస్తే.

రాజ్యం: ఆఁ! అనువులే పిలుపుకే. ఉండు, ఈపూట మజ్జిగ వాడకం ఉండదుగా (లోపలికివెళ్ళి గిన్నెలో మజ్జిగతెచ్చి వీరాయి పిడతలో పోస్తూ) మేం లేవని ఏమైనా చెప్పమందేమిటే?

వీ: (మజ్జిగపిడతపై పైనతుడుస్తూ) మీరు లేపోడం ఏందమ్మా?

రాజ్యం: (విసుగ్గా) పార్వతమ్మ గోరొచ్చినప్పుడు నే నెక్కడున్నానే?

వీ: సరిగదరా! పార్వతమ్మ మొగమే తెలీదంటమ్మా నాకూ?

రాజ్యం: అబ్బ, ఏం ఏడిపిస్తున్నావే! – మరెవరూ వస్తే?

వీ: ఏందమ్మ ఇలా సివాలు తొక్కుతుండావ్ వియ్యాల?

రాజ్యం: సివం లేదూ, నీ దెయ్యం లేదూ! ఎవరొచ్చారంటున్నాను?

వీ: మరాకాడికి నీకు తెలీనట్టు!

రాజ్యం: ఓసి నీనోరు వాతపెట్ట! ఎవరొచ్చారంటే మాట్లాడవేఁమే?

వీ: ఏందమ్మ ఎకసక్కాలాడుతుండావా నాతోటి?

రాజ్యం: మరే, బుద్ధి గడ్డితిని, నీ మొద్దు మొహంతోటి నాకు పొద్దున్నే ఎకసక్కాలూ సరసాలూనూ...ఏం చెవుడా? ఎవరొచ్చింది అని అడుగుతున్నా వినిపిస్తూందా? (గొంతుకు చించుకుంటూ అడుగుతుంది)

వీ: (గొంతుక చించుకుంటూ చెయ్యి విసవిస తిప్పుతూ) ఆఁ...మరే శమ్‌కూ, చ్ఛమ్‌కూ, అంటూ అయమ్మొచ్చిందీ,... ఇక ఇక పకపకా నువ్వు కూసావ్,...మరి గంటే ఇద్దరూ ఊసులాడుకున్నారూ... పైగా తెల్దంట, తెల్దు! ఏం సంగనాచివే మా తల్లీ! (చెయ్యి ఝాడిస్తూ రుసరుసా వెళ్ళిపోతుంది.)

రాజ్యం: ఆసి నీమొహం మండెనుగదే; శంభాయమ్మ గురించా నీ గోడంతానూ (మళ్ళీ చిటికిలపడుతుంది ఓ నిమిషం తల పట్టుకుని) హారి! ఇదేం పండుగ బాబూ. అదిగో పదకొండు కొడుతున్నారు. పిలుపా పిలుపు! తీరా వంటకూడా మానేశాను. ఆఖరికి 12 గంటలకి ఆయనొచ్చి నాకు పండుగ చేసేటట్టున్నారు! (ఇంతల్లోకే సూరమ్మ ఒగర్చుకుంటూవచ్చి)

సూ: రాజ్యం, రాజ్యం! మీలక్ష్మి ఉందే, మాయమైందా?

రాజ్యం: అయ్యో అదేమిటి మాయం అవడం ఏమిటమ్మా, ఏమిటి పిన్నీ మాలక్ష్మి ఏది (ఆత్రంతో కంగారుపడుతుంది) ఇంతల్లోకి వీరాయి పరుగెత్తుకుంటూ వచ్చి)

వీరాయి: ఏవమ్మోయి, ఏవమ్మోయి! మీ పిల్లలంతా వుండారా? అయబాబోయి, పార్వతమ్మగారి పిల్లలు ఎక్కడో మాయమై పోయారంటమ్మోయి...

రాజ్యం: ఏమిటేమిటే మా లక్ష్మి ఏదే, ఎవరెత్తుకుపోయారే; లక్ష్మి ఓలక్ష్మి (బైటికి వెళ్ళబోతుంది; ఎదురునుంచి వెంకటప్పయ్య వస్తూ)

వెం: ఏమిటేమి టాకంగారు? ఏమైంది లక్ష్మికి?

రాజ్యం: తొరగా పరుగెత్తండోయి పిల్లలందర్నీ ఎవరో ఎత్తుకుపోతున్నారుట, వీధి చివరికి పరుగెత్తండి...

వెం: ఆఁ! ఆ! ఎత్తుకు పోవడమే (పరుగెత్తుతాడు) ఓప్రక్కకి; మరోపక్కనుంచి పార్వతి,రంగనాథరావులు పరుగెత్తుకుంటూ వస్తారు)

పార్వ } రంగ } : రాజ్యం, మా పిల్లలు మీ యింట్లో లేరూ? మీ లక్ష్మితోటే ఉన్నారుకదమ్మా మావాళ్ళు ఏమయారూ?

రాజ్యం: అయ్యో పిల్లలంతా మాయమై పోతున్నారట పార్వతమ్మోయి!

రంగ: ఉండం డుండండి, నే పోలీసుల్ని పిలుచుకొస్తా. (ఓపక్కకి పరుగెత్తుతాడు; మరోప్రక్కనుండి వెంకటప్పయ్య తిరిగొస్తాడు; కంగారుగా)

వెంక: పిల్ల రాలేదూ రాజ్యం; ఏం గొడవయ్యా ఇంకా పదిమంది పిల్లలు మాయమైపోయారుట; రంగనాథంగారి పెరటి గదిలో పండుగ సామానంతా ఎవరో దోచుకున్నారుట కూడాను. ఉండం డుండండి పోలీసుల్ని తీసుకొస్తాను. (పరుగెత్తబోతూంటే శంభాయమ్మగారు ఎదురుగా వస్తారు) ఏం శంభాయి పిన్నీ పిల్లలంతా మాయమైపోయారుట, ఏమిటమ్మా గొడవ? నువ్వు చూడలేదు మా పిల్లల్ని.

శంభా: మాయం అవడం ఏమిట్రా, వెర్రి బాగులాళ్లా. వఠి కంగారు.

రాజ్యం } వెంకట } : ఏరి ఏరి ఎక్కడ చూశావు.

శంభా: ఏంవింత్రా. ఇందాకా మీ పేరితాత మీ పిల్లల్ని ఇంకో పది పంది పిల్లల్ని ఆ గుడిమంటపంలో పెట్టుకుని కూర్చున్నాడు. ఏదో పాఠాలు చెపుతున్నాడనుకున్నాను......

రాజ్యం: } వెం: } పరుగెత్తండి పరుగెత్తండి గుళ్ళోకి ఈ ముసలి తాత ఎక్కడదాపరించాడోయి బాబూ (ఇద్దరూ పరుగులు తీస్తారు; ఆ వెనువెంట సూరమ్మ, శంభాయమ్మ వీరాయికూడా విసురుగా వాళ్ల వెనక నడుస్తారు.

(4 వ దృశ్యం)

[వీధి చివర తోటలో గుడి మంటపం. మంటపంలో నందికేశ్వరుడిమీద రాధ గుర్రంమీద కూర్చున్నట్టు కూచుంటుంది. చూట్టూ-రాము, లక్ష్మి, లీల, గోపీ, గౌరీ, సోము, కాంత, గోపాలం, చంద్రం, గిరి చేతులు పట్టుకొని రాధ చుట్టూ తిరుగుతూ, మధ్యమధ్యని రాధమీద పువ్వులు చిమ్ముతూ, డాన్సు చేస్తూ పాడుతూంటారు. పేరితాత రంగనాథరావు తెప్పించిన కానుకల పెట్టెలన్నీ ఓ చోట పేర్చి విప్పి ఒక్కొక్కటే పైన పెడుతూంటాడు – పిల్లల కోలాటం.]

★ ఎవరి పండుగ? ★

అందరూ : పండుగ - పండుగ
పిన్నల పండుగ;
పుట్టినరోజూ-
పిల్లలపండుగ!
పండుగ, పండుగ-
పండుగ, పండుగ!!

రామం: పిల్లలు పుట్టిన
రోజూ పండగ,
పిల్లలకోసం
పండుగా!

లక్ష్మి: పుట్టినరోజూ
పిల్లలపండగ
పిల్లలు చేసే
పండుగా!!

అందరూ: పండుగ పండుగ......

పేరి తాత: పిల్లలకోసం-
పిల్లలతోటి
పిల్లలు చేసే-
పిల్లల పండగ

అందరూ: పిల్లలకోసం-
పిల్లలతోటీ
పిల్లలు చేసే-
పిల్లలపండగ
పండుగ పండుగ.........

పేరి తాత: పిల్లలు పుట్టిన
రోజూ పండగ
పెద్దల పండగ
కాదోయి, కాదోయ్!

అందరూ: పిల్లలు పుట్టిన
రోజూ పండగ
పెద్దలపండగ కాదోయ్, కాదోయ్!!

గౌరి: చీకటుండనగానే-
చక్కటి నిదురలో
పాపనీ లేపారు!

సోము: బిగపట్టి - నలుగెట్టి
తలనీళ్లుపోసి
పాపనేడ్పించారు!!

వాణి, రంగం: పెద్దలంతా చేరి-
పండుగంటూ చేసి
పప్పు పరమాన్నాలు
బ్రేపంచు మెక్కారు.

అందరూ: పిల్లలు పుట్టిన
రోజూపండుగ
పెద్దలపండగ
కాదోయి, కాదోయి
పండుగ పండుగ.........

కాంతం: సంజవాకిటిలోన-
అమ్మలక్కలు చేరి

గోపాలం : వాయినాలందుకుని-
పాటలూ పాడారు!

లక్ష్మి: శనగలూపళ్లన్ని
చీరలో కట్టారు!

చంద్రం: పిల్లల్ని దరికైన-
రానీయమన్నారు!

గిరి: పెద్దలంతా చేరి-
పండుగా పొందారు!!

అం: పిల్లలుపుట్టిన
రోజూ పండగ
పెద్దలపండుగ
కాదోయి కాదోయి!
పిల్లలపండుగ
పిల్లలపండుగ......

(ఈలోపున పెద్దలంతా కంగారుగా పరు గెత్తుకుంటూ చేరుకుంటారు. పిల్లలందరూ వాళ్లమీద పొడరు చల్లుతారు, పూలతో కొడతారు.

అం: పిల్లలుపుట్టిన
రోజూ పండగ
పెద్దల పండుగ
కాదోయి, కాదోయి
పిల్లల పండుగ.........

(పెద్దలంతా వాళ్ళతో కలిసిపోయి కోలాటం వేస్తూ.

రాజ్యం: నల్లయావూమీద-
కృష్ణమ్మబొమ్మలా
కిలకిలా నవ్వుతూ-
పాప కూచోవాలి!

రంగనాథం: పాపనూ చుట్టాలి
పిల్లలంతా చేరి!
దబదబల, గబగబల-
ఆటలూ ఆడాలి
కిచకిచల కిలకిలల
నవ్వులూనవ్వాలి;

పార్వతి: కేకలతో కూకలతో
గంతులూ వేయాలి!
పాపచుట్టూ మూగి-
పాటలూ పాడాలి;

వెంకటప్పయ్య: పాపాయితలపైన-
పువ్వులూ చిమ్మాలి;
పాపాయి ఒడినిండ-
పళ్లన్ని పోయాలి!

పేరి తాత: పిల్లలకోసం-
పిల్లలతోటి
పిల్లలు చేసే-
పిల్లల పండగ!

అందరూ: పిల్లలకోసం-
పిల్లలతోటి
పిల్లలు చేసే-
పిల్లల పండుగ!
పిల్లలుపుట్టిన
రోజూ పండుగ
పెద్దల పండగ
కాదోయి, కాదోయి!
పండుగ పండుగ-
పిన్నల పండగ!
పుట్టినరోజూ-
పిల్లల పండగ!
పిల్లల పండుగ-
పిల్లల పండుగ!

(పిల్లల పండుగ, పిల్లల పండుగ అని అరుస్తూ ఒకరితరువాత ఒకరు వరుసగా ప్రక్కకి వెళ్లిపోతారు.) ★

ఓపెన్ బ్లాంకెట్

గడియారం ఏడుగంటలు కొట్టింది. రీడింగురూమ్‌లో రౌండు టేబుల్ చుట్టూ మూడుకుర్చీలమీద ముగ్గురూ కూర్చున్నారు. ముగ్గురూ చదువుకొంటున్నారు. వాళ్ల తలల పైన ఎలక్ట్రిక్ బల్బు కాంతివంతంగా వెలుగుతోంది. దాని చుట్టూ పసరుదోమలు గుంపులు గుంపులుగా మూగి గంతులు వేస్తున్నాయి.

టేబుల్ మీద చెల్లా చెదురుగా పుస్తకాలు పడవేసివున్నాయి.

చదువుతున్న రాము టక్కన చదువుఆపి "ఒరేయ్అన్నాయి! గడియారం ఏడుగంటలా, ఎనిమిది గంటలా, కొట్టింది?" నిమ్మదిగా అడిగాడు "ఏడుగంటలేరా" తలెత్తకుండానే సమాధానం చెప్పాడు గోపాల్. "ఎనిమిది... నేను లెక్కపెడ్తే ఏడంటావేం? అయితే అర్ధగంటేనా అయింది మనంచదువుకు కూర్చొని గంటన్నరపై అయివుంటుంది. ఎంత సేపటినుండి చదువుతున్నా మంటావు? ఏమిటీ?"

"చలికాలం ఆలాగేవుటుంది లేరా. మనంచదవాల్సిన సబ్జక్టుసు అన్నీ చదివినా, అర్ధగంటకూడా గడవలేదు.

"చూచివస్తాను, టైము ఎంత అయిందో" రాము లేచివెళ్ళబోయాడు. "వెళ్ళొద్దు— ఏడుగంటలే కొట్టింది. నేను లెఖ్ఖపెట్టాను." అన్నది పత్రికచదువుకొంటున్న శాంత అక్కయ్య. మరోచేత్తో వెళ్తున్న రామును పట్టుకుంది.

రాము మళ్లాతనసీటుకివచ్చి కూర్చున్నాడు. పుస్తకంలోకి చూడకుండానే యింగ్లీషుపోయమ్ చదువుతున్నాడు.

ఎదురుగావున్న కిటికీలోనుంచి చలిగాలివీస్తోంది. రాములేచివెళ్ళి కిటికీతలుపులు వేసి తిరిగివచ్చికూర్చున్నాడు. కొద్దినిముషాలు గడిచాయి. "అరేయ్! అన్నాయి చూడ్రా" అంటుంటే" గోపాల్‌ని తట్టాడు.

పేటేటి
నారాయణ లోకమాన్య

అక్కయ్య కోప్పడుతుందేమోనని గోపాల్ తలన్నాత్రిప్పి చూళ్ళేదు. రాముకు కోపంవచ్చి గోపాల్ గడ్డంపుచ్చుకొని తనవైపుకు త్రిప్పాడు.

"ఏమిట్రా రామూ నువ్వుమరీ మితిమీరి పోతున్నావు. నీవు చదవమంటే చదవవు. చదువుతున్న వాణ్ణి చెడగొడ్తావు." కాస్త కోపంగా అంది శాంత.

"అదికాదక్కా— నా పెన్ తీశాడేమోనని.... స్కూలు నుండి వచ్చి పెట్టెలోపెట్టాను. మళ్ళీ చూస్తేకనపడలేదు. ఏమైనాతీశాడేమో అడుగుదామని."

"అయినా రాత్రిపూటకలంతో నీకేంపనిరా?"

"రేపుకావాలిగా. రేపుజ్ఞాపకముంటుందోవుండదోఅని! మొన్న అలాగేఅయింది. కలంతీసుకున్నాను కదా అనుకున్నాను. తీరా పాఠం రాసుకుందామని చూస్తేలేదు. అందుకని అడిగాను. అసలు అది 'చీఫ' కలం కూడాకాదు చాలా ఖరీదైయింది"

"చీఫ' ఏంటి? నీ మొఖం.'చీప్' అనాలి." సరిదిద్దింది అక్కయ్య.

"ఎప్పుడూ నీవింతేనక్కా. ప్రతిదానికీ వంకలు పెడ్తుంటావు?"

"చెప్పందే తప్పులు ఎలాతెలుస్తాయి. ఒకసారిచెప్తే మరోసారి అయినా మాట్లాడేటప్పుడు సరిగా మాట్లాడవచ్చు— లేకుంటే అంతా నవ్విపోతారు."

"శాంతా...శాంతా... ఒక్కసారి యిలావచ్చి వెళ్ళమ్మా— లోపలినుండి అమ్మకేక.

"ఆ...వస్తున్నా" శాంతలోపలికి వెళ్ళింది.

గోపాల్ పుస్తకంమూసి, "నీ కలంసంగతి నాకేం తెలుసురా?"

"అదికాదురా నీవలా చదువుతూంటే, నేను నిన్ను పలకరిస్తుంటే అక్కకు కోపం వస్తుందేమోనని ఆలాచెప్పేశాను."


"నాకు నిద్రవొస్తోందిరా"— రాముఅన్నాడుఆవలిస్తూనిద్రపోతూ కొంటూ.

"నాకేం? వెళ్ళిపడుకో! అక్కయ్య వస్తుంది; లేవగొట్టి తీసుకవచ్చి చదివిస్తుంది

"చలివేస్తోంది. రేపు చదువుకుంటాను అనిచెప్పేస్తాను".

"అదిగో గడియారం గంటలు కొట్టుంది... అమ్మయ్య!...ఎనిమిది అన్నాడు గోపాల్.

"ఇప్పుడు ఎనిమిదే గా అయింది? పదిగంటలైనట్లుంది. నాకు నిద్ర



సువ్వీ! సువ్వాలి!!
ఉప్పలూరి వెంకట శ్రీనివాసరావు (విజయవాడ.)

★ ఉలెన్ బ్లాంకెట్ ★

తూలుతోంది... నేను వెళ్ళి పండుకుంటాను".

"అక్కయ్యతో చెప్పనా" శాస్త్ర పెద్దగా కేక వెయ్య బోయ్యాడు గోపాల్.

"ఉస్... వద్దు — చదువుకుంటా లే". అంటూ పుస్తకం తెరచాడు. ఒక్కలైను చదివేలోపుగా రెండు సార్లు ముందుకి తూలాడు. ఇక లాభం లేదని పుస్తకం మీద తల పెట్టి నిద్ర పోయాడు.

గోపాల్‌కి నిద్రవస్తున్నా అక్క ఏమంటుదోనన్న భయంకొద్దీ, చదువుతున్నది తెలియకపోయినా, ఏదో గొంతువిప్పి గొణుగుతు నేవున్నాడు.

గొణుగుడు కొంత కొంత ఆగి, చదివినది తిరిగి చదవటం, ఒక్కొక్కసారి నిద్రతూలునుంచి తెప్పరిల్లి యింకా స్త బిగ్గరగా చదువుతుండటం జరుగుతోంది.

శాంత వీళ్ళగదిలోకి ప్రవేశించింది. "ఆహా, ఏం చదువురా?" వాడేమో పూర్తిగా నిద్రపొయ్యాడు. నీవేమో నిద్రతో తూలుతున్నావు. ఇక చాల్లే చదువు, లే— పక్కలు వేశాను వెళ్ళి పడుకోండి".

"ఒరేయ్! రాము లేవరా, లే! పక్కమీద పడుకో" అంటూ రాముని మంచంమీద పడుకో బెట్టింది.

ఇద్దర్నీ ఒకే మంచంమీద పడుకోబెట్టి ఒకే వులెన్ బ్లాంకెట్ కప్పి బెడ్ లాంపు వేసి, పెద్దలైటు తీసివేసి మరో గదిలోకి వెళ్ళిందశాంత.

గోపాల్‌కు మెళుకువ వచ్చింది. బ్లాంకెట్ అంతా రాముగాడే కప్పుకున్నాడు. చలివాణికే త్తింస్తోంది. రాము కప్పుకున్న బ్లాంకెట్ నెమ్మదిగా చప్పుడు చెయ్యకుండా లాక్కొని తనొక్కడే కప్పుకొని, మరో ప్రక్కకు జరిగి పడుకున్నాడు. "వాడికి ప్రాయశ్చిత్తం అంతే కావాల" అని మనస్సులో అనుకున్నాడు.

లేకుంటే వాడు ఎన్నిసార్లు తన నిద్రలో తలక్రింద దిండులాగి తన తలక్రింద వేసుకోలేదు? వాడీ చలిలో వాణికె త్తిపోవాలి నాకెంత చలివేసిందో అప్పుడు తెలిసివస్తుంది అనుకొన్నాడు,

గోపాల్‌కి నిద్రపట్టింది. రాముకు మెలుకువ వచ్చింది. వంటిమీద బ్లాంకెట్ లేదు. తిరిగి అదేపనిగా

తీసి ఒక్కడే కప్పుకొని మరో ప్రక్కగా జరిగి పడుకున్నాడు. మళ్ళీ తీస్తాడేమోనని అనుమానం తగిలి నెమ్మదిగా మంచం దిగి, పెద్దమంచము మీదికిపోయి పడుకున్నాడు.

గోపాల్‌కు మెలుకువ వొచ్చింది. కప్పుకున్న బ్లాంకెటూ లేదు; పక్కమీద రామూ లేడు! పెద్దమంచం మీద పడుకున్నాడు. గోపాల్ లేచి వెళ్లి రాము కప్పుకున్న బ్లాంకెట్ తెచ్చి తను కప్పుకొని నిద్రపోయ్యాడు.

గోపాల్ కళ్ళు తెరిచి చూచాడు తెల్లగా తెల్లవారింది. సూర్యోదయం కూడ అయింది. బ్లాంకెట్ మాత్రం పక్కమీద లేదు.

“ఓరి వెధవాయి ఎన్నిసార్లురా. మళ్ళీ తెచ్చి కప్పుకున్నావా” అనుకొంటూ పెద్దమంచం దగ్గరకు వెళ్ళాడు.

పెద్ద మంచంమీద వులెన్ బ్లాంకెట్ కప్పుకొని కాళ్లు ముడుచుకొని పడుకున్నాడు.

“బుద్ధివుండక్కర్లా — నా బ్లాంకెట్ ఎందుకు మళ్లీ లాకొచ్చావు?” అంటూ నెత్తిన రెండు మొట్టాడు.

ఇంతలో శాంత ఆగదిలోకి వచ్చింది.

“ఒరేయ్ గోపాల్. ఏమిట్రా నీ అఘాయిత్యమూ, నువ్వు నూ! ఎందుకలా కొట్తావు?”

“చూడక్కా! లేకుంటేను- ఈ రామ్‌గాడు ఎన్నిసార్లంటావు; నేను కప్పుకున్న బ్లాంకెట్ లాకొచ్చేదని”.

దుప్పట్లో మనిషి వొళ్ళు విర్చుకొంటూ మరో ప్రక్కకు తిరిగి ఒత్తిగిలి పండుకున్నాడు.

“రాము కాదురా. మీ బావగారు. రాత్రి మెయిల్లో వచ్చారు. నేనే నీ బ్లాంకెట్ తీశాను. చూడకుండా అలా కొట్టొచ్చా? తప్పు కదూ?”

“అదికాదక్కా......”

బావగారు లేచి “ప్రొద్దున్నే ఎవర్ని శాంతా కొట్టటం అంటున్నావు?”

“ఆఁ ఎవరోనండి. మనకు దేనికి? అయినా అడిగారు కాబట్టి చెప్తున్నా—ఓ బావగారు నిద్రపోతుంటే మరిది తెలియక కొట్టబోయ్యాడు- లేదు లేదు కొట్టేశాడు!

“ఎవరా బావ; “ఏమాకథ?” బావగారి ప్రశ్న.

“తమరే! యింకెవరు?” శాంత సమాధానం.

“అంటే? నాకు అర్థంకాలేదు నీవు చెప్పేది!”


“మిమల్నే — జరిగిందేమిటంటే–గోపాల్ కప్పుకున్న బ్లాంకెట్ రాము తీసి కప్పుకున్నాడట. బ్లాంకెట్‌లో వున్నది రాము అనుకొని గోపాల్ మిమ్మల్ని కొట్టాడు. “మా యింట్లో వున్న వులెన్ బ్లాంకెట్ ఒక్కటే”.

“నన్ను కొట్టాడా?”

“లేదు మొట్టాడు. రాత్రి ప్రయాణం బడలికలో బాగా నిద్రపట్టి మీకేం తెలిసిందిగాదు”.

రాము పరుగున వచ్చి “కాదండీ బావగారు, బావగారు కదా అని పరాచికానికి అలా చేసి వుంటాడు. అంతేనంటారా? “అంటూ భంగుభంగున ఎగురుతూ లోనికి పారిపోయాడు.

అక్కా, బావా ఒకరి మొఖాలు ఒకరు చూచుకొని ఎందుకో పెదిమలు విప్పకుండా యిద్దరూ నవ్వుకున్నారు. ★




జెమినీవారి "రాజీ, నా ప్రాణం"లో శ్రీరంజని



సారథీవారి "అంతా మనవాళ్లే"లో జమున.

★

కందే రెండు పుష్పగాలలతో నూతన వివాహవిధానంతో దంపతులైపోయిన కొమయ్యానాయుడు, సుబ్బులు.
అశోక్ రాజ్ వారి "అన్నదాత"లో ఛాయాదేవి, రంగారావు



★ మరాటీ చిత్రాల పోకడలు ★

భారతదేశంలోని ముఖ్యమైన ప్రాంతీయ భాషల్లో మరాటీ ఒకటి. (దీని లిపి దేవనాగరం. ముప్పాతిక మూడుపాళ్ళు మాటలన్నీ సంస్కృతంలోనుండి వచ్చినవే. మరాఠీలో నవ్యసాహిత్యం, పత్రికా రచన చాలా అభివృద్ధిపొందినవి.) మరాటీప్రజలు మన తెలుగు ప్రజానీకంవలెనే చీలివున్నారు. మెజారిటీబొంబాయిరాష్ట్రంలో వున్నారు. మిగిలిన జనాభా యిటు మన తెలంగాణాను అనుకొనివున్న మరాత్వాడా (హైద్రాబాదు) జిల్లాల్లోను, మరికొందరు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ వేర్వేరు పరిపాలనా యంత్రాంగాల మధ్య నివసిస్తున్నారు. బృహన్మహారాష్ట్రంకోసం యీ ప్రజ నేడు ఆందోళన చేస్తున్నారు. బొంబాయివంటి నగరాలున్నా మొత్తం మీద మహారాష్ట్రం మనవలెనే వెనకబడ్డ ప్రాంతం. కరువులో, నిత్యదారిద్ర్యంలో, నిరక్షరాస్యతలో యీనాడు వెలుగుకోసం చూస్తున్నది. మహారాష్ట్రులు మన పొరుగువారు. ఉత్తమ సంస్కృతిగల ప్రజలు. దేశభక్తియుతులు.

మరాటీ ఫిలింపరిశ్రమనుగురించి మనం తెలుసుకొనటానికి పైదొక్కటే కారణం గాదు. భారత చలన చిత్ర పితామహుడైన దాదాఫాల్కే మహారాష్ట్రుడు. ఆతర్వాత శాంతారాంవంటి వుత్తమదర్శకుల్ని, అసంఖ్యాకులైన ప్రఖ్యాత తారల్ని, నటకుల్ని, సాంకేతిక నిపుణుల్ని మహారాష్ట్రం భారత ఫిలింపరిశ్రమ కిచ్చింది. ఈనాడు హిందీ ఫిలిం పరిశ్రమలో ఏదైనా గొప్పదనం, వున్నతీ వుంటే దానికి మహారాష్ట్రుల దోహదం చాలా వున్నది. ప్రస్తుతంలో గూడా, ఆదర్శప్రాయమైన చిత్రాలతో సంక్షోభంలో మునిగిన భారత ఫిలింపరిశ్రమకు యావత్తూ కొత్తబాటను చూపిస్తున్నవిగూడా మరాటీ చిత్రాలే. ఈనాడు హిందీరంగంలో వుత్తమస్థాయికి చెందిన తారలు దుర్గాఖోటే, ఉషాకిరణ్, నళినీ జయవంత్, లీలాచిట్నిస్, నూతన్, శోభనా సమర్థ్, బేబీ శకుంతల, (గజానన్ జాగీర్దార్ వంటి మంచి క్యారక్టర్ యాక్టర్లూ) - వీరంతా మరాటీ ఫిలిం రంగంనుండే భారత ప్రఖ్యాతిని పొందారు.

మరాటీచిత్రనిర్మాణానికి మూడుకేంద్రాలున్నాయి. బొంబాయి, పూనా, కొల్హాపూర్ ఒకనాడు యావద్భారతానికీ తలమానికమైన ప్రభాత్ స్టుడియో పూనాలోనే వున్నది. (ప్రస్తుతాని కది మూయబడి వున్నది.) మన మొదటి తెలుగు పౌరాణిక చిత్రాలు నిర్మించబడ్డ స్టుడియో కొల్హాపూర్‌లో భాల్జీ ఫెండార్కర్ గారిది. ఈ స్టుడియోనుండి ఒకప్పుడు మంచి పౌరాణికాలు, చరిత్రాత్మక చిత్రాలు, సాంఘికాలు వచ్చినవి. దివంగతులైన మాష్టర్ వినాయక్ యిక్కడ తరిఫీదు పొందినవాడే. నిజానికి శాంతారాంగారు ప్రాథమిక ఫిలిం శిక్షణ అంతా కొల్హాపూర్‌లోనే పొందారు. (ఈ స్టుడియో మహాత్మగాంధి హత్య తర్వాత జరిగిన అల్లర్లలో పూర్తిగా తగులబెట్టబడ్డది. మొన్న మొన్ననే తిరిగి నిర్మించారు పాత శిథిలాలమీద నే.)

మునిపల్లెరాజు (పూనా)

మరాటీ ఫిల్ములను గురించి తెలుసుకొనేందుకు, ముందుగా అవి ఏయే దశల నుండీ యీనాటి పరిస్థితికి రాగలిగినవో పరిశీలించటం మంచిది. అన్ని ప్రాంతాల వలెనే మరాటీలోనూ మొదట పౌరాణిక, భక్తిరస చిత్రాలే వెలువడ్డాయ్. బహుశా భారతదేశంలో ఏ ప్రాంతంలోనూ యింతటి మంచి పౌరాణిక, భక్తిరస చిత్రాలు తీసి వుండలేదన్నా అందులో అతిశయోక్తిలేదు. జాతీయత వెల్లివిరుస్తున్న ఆ రోజుల్లో కొల్హాపూర్‌నుండి, పూనానుండి వచ్చిన చిత్రాలు జాతీయత కొక పవిత్రస్వరూపాన్నిచ్చి, ప్రజా జాగృతికి ఎంతైనా దోహదం చేశాయ్. తుకారాం, జ్ఞానదేవ్‌ల వంటి మహాభక్తుల జీవితచరిత్రలు భారతదేశంలో భక్తివాద వేదాంతాన్ని వెదజల్లినాయ్. అప్పటిదాకా కొల్హాపూర్ ప్రధానకేంద్రంగా వుంది.

ప్రభాత్ స్టుడియో నిర్మించబడ్డ రోజుల్లోనూ (ఆ తర్వాత) గాంధీమహాత్ముడి నాయకత్వం కింద కనీ వినీ ఎరగని బ్రహ్మాండమైన ప్రజోద్యమాలు. భారతదేశాన్ని కదిల్చి వేస్తున్నాయ్. ఆరోజుల్లో, శాంతారాం పౌరాణికాలనుండి సంఘం వేపు దృష్టి మరల్చాడు. "దునియానమానే," "ఆద్మీ," "పడోసీ" మొదలైన చిత్రాలు ఆ కాలంలో ప్రేక్షకుల్ని ఉర్రూతలూపి, సినిమా అభిలాష ప్రజల్లో త్వరితంగా వ్యాపించటానికి అత్యంతమైన ప్రచారం చేశాయ్. ఈ కాలంలోనే కొల్హాపూర్ నుంచి పౌరాణిక, చారిత్రాత్మక చిత్రాలు నిర్మించింది.

ఈ దశతర్వాత ప్రభాత్ నుండి శాంతారాం చీలిపోయాడు. శాంతారాం పెద్ద విద్య నేర్వకపోయినా, అతని వేదాంతంలో పెద్ద లోపాలున్నా - ప్రజలను మేల్కొలుపగల కొన్ని వున్నతధ్యేయాలతో ఆయన చిత్రాలు దేశానికి ఎంతో మేలుచేకూర్చినవి. (చీలిపోయి బొంబాయిలో రాజకమల్ కళామందిర్ స్టుడియో బావుటా క్రింద వీరు ప్రస్తుతం చిత్రాలు తీస్తున్నారు.) ఇంతటితో ప్రభాత్ కీర్తి అటుగంటింది. ఆతర్వాత చెప్పుకోదగ్గ ఒక్క చిత్రంగూడా రాలేదు ప్రభాత్ నుండి. స్టుడియో యీనాడు లిక్విడేషన్‌లో వున్నది.

అప్పటి నుండి యుద్ధానంతరంవరకు మరాటీ పరిశ్రమ బొంబాయి పోటీకి తట్టుకోలేక నిద్రాణమై వున్నది. అడపాదడపా చిత్రాలు వస్తున్నా అవి కొత్త చరిత్ర పుటలను వ్రాయలేదు.

యుద్ధానంతరం మూడవ దశ ప్రారంభించింది. గొప్ప హ్యూమనిష్టు వేదాంతంతో, బహు సున్నితమైన మానవ ప్రయోజనకర నాగరికతాశయాలతో, ఏమాత్రమూ అసహ్యకరం గాని హాస్యరసంతో, ప్రాచీన జౌన్నత్యాన్ని నిండు జాతీయతతో దర్శింపజేసే చరిత్రాత్మకాలతో - మరాటీ చిత్రాలు విజృంభించాయ్. ఆనాటి కానాడు పేరు తెచ్చుకొంటునేవున్నాయి. ఈ కొత్త కాగడాను వెలిగించినవాళ్లిద్దరు. ఒకరు ఆచార్య అత్రే. మరొకరు దత్తా ధర్మాధికారి.

ఆచార్య అత్రే చాలా కాలంనుండి చిత్ర పరిశ్రమతో సంబంధం వున్నవాడు. పేరుగల పత్రికా రచయిత. సంపాదకుడు. సోషలిష్టు. బెర్నార్డ్ షా రచనలవలె నిశితమైన వ్యంగ్యంతో సమాజంలోని హెచ్చుతగ్గుల్నీ, దొంగనాయకుల్నీ తూర్పార బడుతుంటై. ఈయన చిత్రాల్లో పేర్కొనదగ్గవి— "హీమాజీ లక్ష్మీ", (ఇది నా లక్ష్మి), "పాయాచీ దాసీ", "శ్యాంచా ఆయీ" (శ్యాముడి తల్లి) "మోరూచీ మావ్‌షీ" (మోరూ పినతల్లి) "బైల్‌వడా" మొదలైనవి. హాస్యరసం ఎక్కువ మిళాయించినా అత్రేగారి చిత్రాలు సంఘ సంస్కరణాభిలాషతో తొట్టిసలాడుతుంటవి. "శ్యాంచా ఆయీ" అన్న చిత్రం - ఏదేశపు ఫిలిం రంగానికైనా కీర్తి తెచ్చిపెట్టగలది. ఈయన సంభాషణలు బహు చిత్రంగానూ,


పారమౌంట్ వారి తార
జేన్ స్టెర్లింగ్



విశితంగానూ, సూటిగానూ, హాస్యపూరితంగానూ, జాతీయాలతో అందంగానూ, నావంటి తెలుగువానికి గూడా కదలిక పుట్టించే శైలిలో వుంటాయి.

ఆతర్వాత మహారాష్ట్రపు—విక్టోరియా డీసికా అనదగిన - దత్తా ధర్మాధికారి. ఈయన ప్రతిభవల్ల నేడు మహారాష్ట్ర ఫిలిం పరిశ్రమకే కొత్తబలం, తాహతూ, ఉద్వేగం గౌరవం వచ్చినవి. మొదట్లో ప్రభాత్ స్టుడియోలో టైంకీపర్ వంటి చిన్న వుద్యోగం చేస్తూ శ్రమపడి చివరకు ప్రొడ్యూసర్ డైరెక్టరు అయినాడు. ఈయన చిత్రాలు శాంతారాం మరచిపోయిన హ్యూమనిస్టు వేదాంతాన్ని తిరిగి నవ్యరీతులతో ప్రచారంచేసి భారతదేశం నలుమూలలా పేరు సంపాదించినవి. చిత్రమేమిటంటే యీయన మొట్టమొదటనే బాక్సాఫీసు సిద్ధాంతకారుల వెర్రి మొర్రి సిద్ధాంతాలనన్నింటినీ కాలదన్ని తన హ్యూమనిస్టు వేదాంతంతోనే ఫిలిం పరిశ్రమకు ఒక సవాలును అందజేశాడు. ఆ సవాలేమిటంటే - "నాకు కథ కావాలి, తారలు

సాహు ఫిల్మ్స్ వారి గేవా కలర్ చిత్రం 'మయూర్ పంఖ్'లో తాజ్ మహల్ వద్ద ఒక సన్నివేశం.



మరాఠీ చిత్రాల పోకడలు

కాదు. వాళ్ళనుండి తారల్ని తయారు చేస్తుంది ఉత్తమమైన కథ" - అన్నాడే. ఈయనచిత్రాలన్నీ విషాదాంతాలే. "బాలా జోజోరే" అన్న చిత్రం మహారాష్ట్రంలో అద్భుతమైన విజయం సంపాదించింది. (ఈ చిత్రాన్ని కర్దార్ కాని హిందీలో "జీవన జ్యోతి"గా తీశాడు). ఆతర్వాత "స్త్రీజన్మ హీ తుజీకహానీ" (శశికపూర్ రంజిత్ మూవీ టోన్ వారు కాని హిందీలో తీస్తున్నారు) "నన్హే మున్నే" చిత్రం కిందటి సంవత్సరపు హిందీ చిత్రాల్లో అగ్రస్థానం వహించింది. "మహాత్మ" - యీ సంవత్సరపు పది మంచిత్రాల్లో ఒకటి. ఈయన దర్శకత్వం చేయకపోయినా, నిర్మాతగా అజమాయిషీ చేసిన "ఆబోలీ" (మరాఠీ) మంచి విషాదాంత గాథ. ఇప్పుడు విడుదల్లో దిగ్విజయంగా నడుస్తూన్న "సౌభాగ్య, విభాగ్యవాన్" చిత్రాలు - దత్త ధర్మాధికారియొక్క నమ్మకాలు ఏమాత్రమూ తప్పుగావని ఋజువు చేస్తున్నవి. ప్రతి చిత్రానికి కొత్తరకపు కథను ఎన్నుకోవటంలోనూ, సిద్ధాంతాలు యిమిడ్చి అసలు చిత్రీకరణాన్ని నాశనం చేయకుండా వుండటంలోనూ యీయన ప్రతిభరహస్యం వున్నది. ఉత్తమమైన నవలలకోసం, కథలకోసం వెదికి కొత్తవాళ్ళను గుర్తించటంలో యీయన ఎప్పుడూ వెనుకాడలేదు. ఒక అబ్బాయి - అమ్మాయికోసం కాదు కథలో యీయన వెతికేది. నిజమైన సామాన్యమానవులకోసం. తద్వారా నిజమైన కథ అదే వస్తుంది. అబద్ధపు స్టూడియో ప్రేమకు ఈయన చిత్రాల్లో తావులేదు. నిజమైన మానవప్రేమకు మాత్రమే అంగుళంలో విలువనిచ్చాడీయన. మొదటిసారిగా బాలతారల విలువను కనుగొని వాళ్ళద్వారా అల్లిన మంచి వాస్తవిక కథలతో యీయన ప్రతి చిత్రమూ "పాటలు - డాన్సు - ప్రేమ కథ - ఫిలిం సిద్ధాంత కారులకు" ఒక ఛాలెంజిగా వుంటున్నది.

ధర్మాధికారి తీయనున్న ఆరవ చిత్రానికి ఒక సుశిక్షిత ప్రధాన పాత్రధారిణి. మొన్న నిమన్యసే మనప్రాంతంలో గూడా ప్రజాదరణపొందిన "నన్హే మున్నే" (చిట్టిపిల్లలు) అన్న హిందీ విషాదాంత చిత్రంయొక్క మరాఠీ ప్రతి "చిమ్నా పాఖరే" గూడా అద్భుత విజయం సంపాదించింది. దనిలోని టాక్సీ డ్రైవరు కుటుంబ గాథ - పూనాలో జరిగిన ఒక సంఘటనమీద రూపొందుపరచబడింది. ఈయన "మహాత్మ" చిత్రం ఇంగ్లీషు భాషలో గూడా నిర్మించారు. ఇది విదేశాల్లో ప్రదర్శింపబడనున్నది.

దత్తా ధర్మాధికారి - భారత చలనచిత్ర పరిశ్రమయొక్క వర్తమానదశలో ఇంకొక చెప్పుకోదగ్గ సేవ కూడా చేశారు. అది - కొత్త తారలను అనేకమందిని సినిమారంగానికి పరిచయంచేసి వృద్ధిలోకి తెచ్చి ప్రొడక్షను వ్యయాన్ని తగ్గించుకొనే నిర్మాణాత్మకమైన సూచన. ఇది యీయన అక్షరాలా అమల్లో పెట్టారు. బేబీ శకుంతల (బేబీ నిమాత్రం కాదులెండి)లోని నటనాసామర్థ్యాన్ని మొదటగా గుర్తించిన ఘనత యీయనకే దక్కింది. ఈయన పరిచయంచేసిన బాలతారల్లో ఆయన అయిదేళ్ళ కుమారుడు అల్హాద్ ముఖ్యుడు. ప్రపంచంలోని మంచి బాలతారల్లో అల్హాద్‌ను పోల్చి చూచి మనం గర్వపడవచ్చు.

దత్తాధర్మాధికారిలో లోపాలు లేవని చెప్పను. ఉన్నాయి. నేను ఫిలిం పరిశ్రమ చేస్తున్న యితర పెద్ద లోపాలతో పోల్చి చూస్తే, అవి దోషాలుగా లెక్కింపబడవు. ముఖ్యంగా నేను పేర్కొనగల లోపం - యీయనతొందర. చిత్రాన్ని అతిత్వరలో పూర్తి చేయాలన్నదే యీయన ప్రధాన లక్ష్యంగా ఒక్కొక్కసారి స్థూలదృష్టికి గూడా తట్టుతుంది. ఈ తొందర్లో కళాత్మకమైన మాంటేజ్ ని గురించిన శ్రద్ధ మృగ్యమైపోతున్నది. కథ సౌలభ్యమే చూచుకొంటూ, ప్రతి ఫ్రేముకూ గొప్ప కళానిర్మాత యివ్వవలసిన జాగ్రత్త, ఆలోచన - యివ్వటం లేదు. దర్శకుడి కథావస్తువు వాస్తవికతకు ఎంత చేరువగా వున్నా - ఈ వాస్తవికతను వున్నత కళాపథానికి తరలించే అంతర్గత కవితాగానం, భావుకత లేనిదే - ఆ కథావస్తువుకు తాత్కాలికస్థానమే గాని కళాభవనంలో శాశ్వత పీఠం వుండబోదు.

* * *

ఇక తదితర దర్శకులనుగురించీ, వారి చిత్రాలనుగురించీ ముచ్చటించబోయేముందు మరాఠీ చిత్రాలు ఏ ముఖ్యమైన పోకడలవల్ల ప్రాంతీయ భాషా చిత్రాల్లో, వుత్తమమైన గర్వకారణమైన స్థానాన్ని ఆక్రమించ గలిగినవో స్థూలంగా వ్రాస్తాను.

మొదటిది: కథావస్తు సేకరణలో పలువురు నిర్మాతలు నిర్మాణాత్మకమైన వాస్తవిక ధోరణి నవలంబిస్తున్నారు. దాదాపు మరాఠీ భాషలోని మంచి నవలలూ, కథలూ సినిమారంగానికెక్కుతున్నవన్నా అతిశయోక్తి కాలేదు. ఖాండేకర్, ఎ. జి. జోషి, దాదా మిరాసీ వీరి వుత్తమ నవలలన్నీ చిత్రాలుగా వచ్చేశాయి. సానే గురూజీగారి ప్రఖ్యాత సామాజిక సంస్కరణలను వాస్తవికంగా చిత్రించిన నవలలన్నీ వుత్తమ చిత్రాలుగానే నిర్మించబడినాయ్. ("ఆగే బఢో" చాలా సంవత్సరాల క్రితమే ప్రభాత్ వారు తీశారు. కిందటి సంవత్సరమే ఆచార్య అత్రే వీరి "శ్యాంచీ ఆయీ" అన్న నవలను అదేపేరుతో వుత్తమ చిత్రంగా తయారుచేశారు.) స్క్రిప్టు రచయితల్లో మడ్గూల్కర్, కామత్ అందరికన్నా ఎక్కువ కంట్రాక్టులు సంపాదిస్తున్నా కొత్త కథకులకు ద్వారాలు బంధించబడలేదు. కొత్త కథకులు వస్తున్నారు, కొత్త కథావస్తువులూ సమర్పిస్తున్నారు. ప్రజానీకం కోరుతున్న నిత్యనూతనత్వం - యీవిధంగా పోషించబడుతోన్నది. ఈ పరిస్థితులతో పోల్చిచూస్తే ఆంధ్ర ఫిలింరంగం ఎంత సిగ్గుచేటైన పరిస్థితులలో మునిగితేలుతున్నదో స్పష్టంగా తెలియగలదు. మన వుత్తమ నవలలకు పాఠకుల ఆదరణే లేదు, యిక సాహిత్యంలో నాల్గవతరగతి పిల్లవాడి పాటి అభినివేశంగూడా లేని నిర్మాతల సంగతి ముచ్చటించటమెందుకు?

రెండవది: తక్కువ బడ్జెటుతో వుత్తమ చిత్రానికి తహతహ. మరాఠీ చిత్రం లక్షన్నర, రెండులక్షల మధ్య బడ్జెటుతోనే తయారుచేయబడాలి. రెండులక్షల రూపాయలు ఖర్చుపెట్టిన నిర్మాత భగవంతుడిమీద, తన పూర్వీకులమీద భారం వేసిగాని ఆ పని చెయ్యడు. సాధారణంగా లక్ష ఇరవైఐదు వేలకు చిత్రం తయారవుతుంది. దీనికి కారణాలు వెతుక్కొనక్కర్లేదు. అవశ్యకతనుబట్టి కొద్ది బడ్జెట్లు ఒక ప్రధాన నిబంధనగా తయారైనది. తెలుగు చిత్రాలకువలె మరాఠీ చిత్రాలకు పెద్ద సర్క్యూట్ లేదు. ముఖ్యమైన కేంద్రాలు నాలుగైదు కన్నా మించిలేవు. ముప్పాతిక పెట్టుబడి యీ నాలుగు కేంద్రాలనుండి వస్తే వచ్చినట్లు, లేదా నష్టాన్ని భరించాలి. ఈ కారణంవల్ల కొద్ది బడ్జెట్ ఒక రూల్ కింద మారింది. దీనివల్ల ఏ విషయంలోనూ మరాఠీ నిర్మాత పెద్ద ఆర్భాటాలు ధీమాగా చెయ్యలేడు. తారలకు తక్కువ జీతాలిస్తాడు. అర్థం, అందం లేని పెద్దసైజు డాంబికపు బొంబాయి సెట్లను ఆదరించడు. చౌక స్టుడియో అద్దెలకోసమే గట్టిగా వెదుకుతాడు. తక్కువ వ్యవధిలోనే చిత్రాన్ని పూర్తిచేయటానికి శాయశక్తులా ప్రయత్నించి, తన రెండవచిత్రపు భవిష్యత్తును మొదటిచిత్రంతో ముడివేసి దూరదృష్టితో చూస్తాడు. వచ్చే లాభాలుగూడా తక్కువే గనక పరిశ్రమలో చిరకాలం వుండదలుచు

కొన్ని నిర్మాతే ఇందులో జొరబడుతున్నాడు.

మూడవది: మంచి చిత్రానికి ఒక్క ప్రేమ కథ తప్పితే శరణ్యం లేదని అనుకొనే మన నిపుణ నిర్మాతలందరూ, మరాటీ చిత్రాలను తప్పక చూచి తమ చిరకాల మూఢాభిప్రాయాన్ని మార్చుకొనగలిగితే, నేడు తామున్న నిరాశాకర పరిస్థితుల నుండి కొంతవరకైనా బయటబడతారు.

మంచి వయసులోవున్న యువతీ, యువకుల ప్రేమగాధతో అల్లని ఏ చిత్రమైనా దెబ్బతింటుందని యీనాడుగూడా బొంబాయిలోని మిడిమిడి చిత్రవిజ్ఞాను లందరూ చాటుతున్నారు. కాని యీ మిడిమిడి విజ్ఞానుల ముక్కు కిందనే మరాటీ చిత్రాలు నడివయస్సు మానవులతోనో, బాల తారలతోనో, లేక కేవలం వృద్ధులతోనో సహజ వాస్తవికతతో తయారై విజయం పొందుతున్నాయి. క్యారెక్టరు నటీ నటకులకు గౌరవం, ఆదరం, మంచిజీతం యివ్వ నిరాకరించే నిర్మాతలకు ప్రధాన తార, ప్రధాన నాయకుడు - యిద్దరే దైవ సమానులు. తక్కినవారంతా ఒక మూకకింద లెక్క. వీరి కందరకూ మంచిరకం మరాటీచిత్రాలు ఒక సవాలు.

రాజాపరంజిపే యీయనకు (నడి వయస్సు దాటింది. బట్ట తల వచ్చింది) తనే ముఖ్యపాత్రగా నిర్మించిన హాస్య, హాస్య - కరుణారస చిత్రం-"పెడగాంచా సాహాణే" (పెడగాం గ్రామంనించి వచ్చిన బుద్ధిమంతుడు) - అద్భుతమైన విజయం పొందింది. ఇందులో ఈ క్యారెక్టరు నటకుడు తన పాత్రను ప్రధాన పాత్రస్థాయికి పెంపొందించాడు. మామూలు నిర్మాతల వుక్కు చట్రపు కొలతల రొమాన్సుకు చాలా తక్కువస్థానం వుంది యీ చిత్రంలో. ఈ చిత్రాన్ని తిరిగి రాజా పరంజిపే దర్శకత్వం కిందనే "చాచా చౌదరీ" అన్న పేరుతో హిందీలో కర్దార్ నిర్మించాడు. ఇదికూడా విడుదలై విమర్శకుల, ప్రేక్షకుల మన్ననలను సరిసమానంగా పొందింది.

రాజా పరంజిపే ఒక్కడే యిలా విజయం పొందలేదు. ప్రస్తుతం రోహిణివారు తెలుగులో నిర్మిస్తున్న "వద్దంటే పెళ్ళి" చిత్రంయొక్క మాతృక "లఖాచీ గోష్ట" (లక్షరూపాయల గాథ) అనే మరాటీ హాస్యచిత్రం గూడా ప్రధానంగా క్యారెక్టర్ నటీనటకుల చిత్రమే. ఆ త్రే చిత్రాల హాస్యమంతా ప్రధాన క్యారెక్టర్ యాక్టరు చుట్టూ అల్లబడి, అదే హీరో పాత్రగా రాణిస్తుంది. ఆయన "బ్రహ్మఘోటాలా", "ఘర్ జామాయ్" (ఇల్లటపు అల్లుడు) చిత్రాలు యీ విషయంలో చెప్పుకోదగ్గవి.

మింటెనిమూసేతారల్ని, తారకల్ని, ఒక్క హాస్యచిత్రాలే తగ్గించలేదు. అనేక దుఃఖరస, కరుణారస చిత్రాలుగూడా ఇట్లా నిర్మించబడ్డవే.

రాంగబాలే దర్శకత్వంకింద తయారైన రెండుచిత్రాలు - "దూధ్ భాత్" (పాల బువ్వ అని అర్థం. దీని నిప్పుడు హిందీ వారుకొని బొంబాయిలో "తన్‌హాయ్"అనే పేరుతో నిర్మిస్తున్నారు), "దేవ్ బప్పా" - రెంటిలోనూ బాల తారల ప్రాధాన్యమే హెచ్చు. ఈ శీర్షికకింద యివేగాక యింకా అనేకచిత్రాలను పేర్కొనవచ్చు.

ఈ నిర్మాణాత్మక పద్ధతుల నే అనుసరిస్తే మరాటీచిత్రాలకు మున్ముందుగూడా మంచి భవిష్యత్తు వుంటుం దనటంలో సందేహం లేదు.

* * *

పోతే యీ వ్యాసంలో చివరిభాగంలో యితర మరాటీ దర్శకుల్ని గురించిన కొన్ని మాటలు.

ఆత్రే, ధర్మాధికార్లను మొదట్లో పేర్కొన్నా వీండ్లకంటె సీనియర్లు, అనుభవశాలురూ లేరనిగాదు. వున్నారు. వీరిలో చెప్పుకోదగ్గవారు వీరు.

విశ్రాం బేడేకర్ :—ప్రస్తుతం హిందీ ఫీల్డులో వున్నా మరాటీ చిత్రాలుగూడా అప్పుడప్పుడు తీస్తున్నారు. "వాసుదేవ్ బల్వంత్" అనే బ్రిటిష్ వ్యతిరేక ప్రజోద్యమాన్ని నడిపిన వుత్తమ దేశభక్తుడి గాథ యీయన మంచిచిత్రాల్లో ఒకటి. "పహిలా పాల్నా" (మొదటి బిడ్డ) అన్న చిత్రంగూడా వెనక మంచిపేరు సంపాదించింది.

శాంతారాం :—జగమెరిగిన బ్రాహ్మణే గాని బాంబే సాంగత్యంవల్ల, పాశ్చాత్య వాసనవల్ల యీయన వేదాంతానికి తుప్పు పట్టింది.

భాల్జీ పెంఢార్కర్ :—ఈయన అనేక దేశభక్తి ప్రపూరిత చారిత్రాత్మకాలను నిర్మించాడు. ఛత్రపతి శివాజీ వీరోచిత ఘనకార్యాలను మొదటిసారిగా తెరకెక్కించారు. అనేకతారలను, దర్శకుల్ని మరాటీ రంగానికిచ్చిన ప్రముఖవ్యక్తి. వీరి జాతీయత సంకుచితమైనదని అనేక విమర్శకులు యీయనమీద దండెత్తినా, ఆయన ప్రాముఖ్యతను చూపెట్టకుండా వాద భూయిష్ఠమైన దోషాలనే ఎత్తిచూపటం పాడిగాదని నా వుద్దేశం.

కీర్తిశేషుడైన మాష్టర్ వినాయక్ "అర్థాంగి" చిత్రంతో భారత విఖ్యాతులైనారు.


తరువాత ఆయనగారి "లగ్నా పాహావే కరూన్" (పెళ్ళిచేసిచూడు) చిత్రం తెలుగులో పునర్నిర్మితమై ఇటీవలనే ప్రఖ్యాతికెక్కినది.

వీరుగాక దిన్‌కర్ పాటిల్ చాలా హాస్యచిత్రాల్ని తీశారు. "రాంరాం పాహ్వనా", "పాతాళాచా చోర్" (పాతాళలోకపు పిల్లవాడు), "జే మల్హార్", "వసల్", "మాయిబహిని" మొదలైనవి ఆయన చిత్రాలు. ఇంకా కొందరు పేరులో వున్నా, నాకు రాంగబాలే, అతవాళేగార్ల భవిష్యత్తుపై కొంత ఆశ వున్నది. రాంగబాలే అప్పుడే రెండు, మూడు హ్యూమనిస్టు వేదాంత ధోరణిలో మంచి చిత్రాలు తీశాడు.

ఇన్నాళ్ళూ పాటలు వ్రాసి పొట్టబోసుకొంటున్నా శాంతారాం అతవాళే- "వహినాంచ్యా బాంగ్డ్యా" (వదినెగారి గాజులు) చిత్రం దర్శకత్వం వహించి, ఆ కథను వుత్తమమైన సెంటిమెంటల్ చిత్రంగా మార్చి కొద్ది నెలల్లో మంచి దర్శకుడై కూర్చున్నాడు. ఈయన విజయానికి ప్రొడ్యూసర్ సదాశివరావుకవి కొంతకారణమైనా దర్శకత్వంలో యీయన అద్భుతమైన ప్రజ్ఞ చూపించాడు. ఈ చిత్రం ప్రస్తుతం రజతోత్సవాలమీద రజతోత్సవాలు చేసుకొంటున్నది.

ఆంధ్రవలె వెనుకబడివున్న మరాటీ చిత్రసీమ యీనాడు తన కథల్లో దాదాపు డజనుదాకా యితరభాషలకు అమ్మగలిగింది. ఈ గర్వకారణం మన పరిశ్రమకు లేదు. దానికి ప్రధానమైన కారణం- నూత్న కథావస్తువులతో మన నిర్మాతలకు, దర్శకులకూ బొత్తుగా సంపర్కము లేకపోవటమే. మన నిర్మాతలూ - డిస్ట్రిబ్యూటర్లు - ఇంకా రెండు నిలువుల ధనరాసుల్ని పరిశ్రమలో కుమ్మరించినా, ఈ కొరత తీరబోయేది గాదు.

ఆంధ్రచిత్ర పరిశ్రమోన్నతికి దోహదం చెయ్యగలిగిన దొక్క కొత్త రచయితలు మాత్రమే. కొత్తజీవిత దృక్పథానికి, కొత్త తెలుగుగడ్డ నిర్మాణానికి- ప్రాచీనౌన్నత్యం నుండి ఉజ్వల భవిష్యత్తుకు మార్గం చూపగలిగినది ఒక్క యువరచయితలే. కొత్త రచయితలకు - ఏనాడు ఆంధ్రరంగంలో ఆహ్వానం దొరికిందో ఆనాటినుంచే దానికి కొత్తరూపు. ★



పశ్చిమతానాసనం

యోగాసనములు - దేహారోగ్యము

(11వ పేజీ తరువాయి)

7. అగ్నిదీపనం - అజీర్ణవ్యాధి నివారణము.

నాడీ విశుద్ధిః - రక్తనాడుల శోధన

హఠయోగ లక్షణం అని హ. యో. ప్ర ఉ. 2 శ్లో 78 లో స్పష్టముగా చెప్పియున్నారు.

(మరియును పా. యో. ద. 2 పా. 45, 46, 47, 48 వ సూత్రములను భాష్యముతోడ చూచిన వ్యక్తమగును.)

యోగాంగ సాధకులకు రోగభయ, మృత్యుభయములు లేవు అని శ్వేతాశ్వతరోపనిషత్తులో ---(2 అధ్యా)

1. న తస్య రోగాః—వానికి రోగములు రావు

2 న జరా - ముసలితనము రాదు.

3. న మృత్యుః - చావురాదు.

ప్రాప్తస్య యోగాగ్నిమయం శరీరం॥ ఎవరు యోగాంగ సాధనతో తేజశ్శరీరమును బొందియున్నారో!

4. లఘుత్వమ్ - ఎల్లప్పుడూ తేమరితనము లేకుండుట.

5. ఆరోగ్యం - యావజ్జీవమానమూ ఆరోగ్యము

6 అలోలుపత్వం - దురాశలు లేకుండుట

7 వర్ణప్రసాదం—శరీరము కాంతితో నుండుట

8 స్వరసౌష్ఠవంచ - వాక్స్ఫుటత్వ ముండును

9 గంధః శుభః - శరీరము దుర్వాసనతో నుండదు.

10 మూత్రపురీష మల్పం-బహుమూత్ర అతిసార రోగములు రావు

యోగప్రవృత్తిం ప్రథమాం వదంతి"— చక్కగా యోగాంగసాధన చేసినవారికి ఈ దృష్ట ఫలములు గలుగును.

* * *

యోగాసనముల నభ్యసించువారు కేవల చిత్రపటములను చూచి అభ్యసించుట ప్రబల ప్రమాదకరమని చెప్పకతీరదు.

యోగ్యులైన గురువుల ఉపదేశమును అనుసరించి అభ్యసించువారికి ఇష్టార్థసిద్ధియగును.

"ఏవం విక్తే మఠే స్థిత్వా సర్వచింతా వివర్జితః
గురూపదిష్ట మార్గేణ యోగమేవ సమభ్యసేత్ ॥"


(హ యో ప్ర. 1 ఉ శ్లో 14)

నేడు నాడు యోగాంగాసన ప్రచారకులు ఎక్కువగా నుండుట సంతోషకరమే గాని వారిలో యోగదర్శన శాస్త్రాభిజ్ఞులు ఎవరో, వారిని బాగుగా పరీక్షించి ఆశ్రయించవలెను.

(యోగదర్శన శాస్త్రాధ్యయన వేదాధ్యయన వేదాంతాధ్యయనములు లేనివారు యోగాంగసాధకు అనర్హులు "శౌచ, సంతోష తపః స్వాధ్యాయ ఈశ్వరప్రణిధానాని నియమాః" అను (పా. ద 2 పా 72)

శారీరకరోగచికిత్సాక్రమము వైద్యశాలలో గురుముఖమున నే ప్రచారములో నున్నదనియూ, అటుగాకున్న మిక్కిలి ప్రమాదకరమగుననియూ మనకు తెలియని సంగతి గాదు.

యోగాంగాసనములను అభ్యసించు సమయములో ఏ ఆసన మెవరికి, ఎన్నివాళ్ళు, ఏ రోగమును బోగొట్టుటకు? ఎన్ని శ్వాసోచ్ఛ్వాసములు, ఏ ఆసనములో నెంతకాలము



పశ్చిమతానాసనం



పూర్వతానాసనం

★ యోగాసనములు - దేహారోగ్యము ★

ఉంచవలెను? ఎపుడు శ్వాసము? ఎపుడు ఉచ్ఛ్వాసము? వాటి గతికాల మెంత? ఈ మొదలైనవి కనిపెట్టి సాధించిన ప్రచారకులే మనకు గావలెను.

ప్రదర్శనకొరకులూ కావలెనుగాని, వారూ ఈ రహస్యములను బాగుగా తెలుసుకొనకుండిన లోకోపకారమూ లేదు, శాస్త్రోద్ధారమూ గాదు. ఇంక రోగనివారణ మా టెక్కడ?

యోగరహస్య, రాగరహస్య, రాజరహస్య, దాంపత్య రహస్యములు గ్రహింప సాధ్యము గాదు.

శ్వాసోచ్ఛ్వాస గతిని ముక్కు రెండురంధ్రములు, కంఠనాళము, నాలుకకొన, రెండు పెదవులు, మరియు పండ్లనడుమ వీటిద్వారా అభ్యసించుచూ యోగాసనములను చేయవలెను. ఏ ఆసనమునకు ఏలాటి శ్వాసోచ్ఛ్వాసగతి అను నీసంగతిని ప్రాణాయామ విమర్శనలో తెలియగలము.

సామాన్యముగా యోగాసనములను జేయునపుడు కంఠనాళపు దారిలోనే దీర్ఘతమమైన పరమసూక్ష్మమైన సశబ్దమైన శ్వాసోచ్ఛ్వాసములనే ఉపయోగించుట సంప్రదాయము.

ఇలాంటి శ్వాసోచ్ఛ్వాసగతికి "అనులోమ ఉజ్జాయీ" అని పేరు. ఆధారము——

"ముఖం సంయమ్య నాడీభ్యా మాకృష్య
పవనం శనైః।
యథా లగతి కంఠాత్తు హృదయావధి
సస్వనమ్॥
పూర్వవత్ కుంభయేత్ ప్రాణం రేచయే
దిడయా తతః॥
శ్లేష్మదోషహరం కంఠే దేహానల వివర్ధనమ్॥
గచ్ఛతా తిష్ఠతా కార్యం ఉజ్జాయ్యాఖ్యంతు కుంభకమ్"

(హ. యో. ప్ర. ఉ-2-శ్లో. 51, 52, 57.)

ముఖమును (తలను) క్రిందికి వంచి గడ్డమును రొమ్మునకు అదిమి (గట్టిగా బిగబట్టి,) ముక్కు రెండు రంధ్రములతో కంఠనాళము మొదలుకొని హృదయమువరకూ శబ్దము కలుగురీతి మెల్లగా దీర్ఘముగా ఊపిరిని పీల్చి (ప్రథమాభ్యాసులు) శక్తికి అనుగుణముగా కుంభకమును చేసి (ఊపిరిని బిగబట్టి) తొందరపడక సావధానముతో ఊపిరిని విడిచేది. దీనిని గురువులద్వారా తెలుసుకొని అభ్యసించవలెను.

దీని ఫలము - కంఠనాళములో అణిగియుండు కఫదోషము పోవును. ఆకలి చక్కగా గలుగును. నాడుల నడుమ, కడుపులో, శ్వాసకోశ, మలకోశ, మూత్రకోశ, పిత్తకోశములలోనూ, ఎముకులసందులలోనూ చేరియుండుదోషములు నివారణ కాగలవు. మరియు జలోదర మహోదరాది జాడ్యములను అడ్డగించును. ఈ శ్వాసోచ్ఛ్వాసములను కూర్చుని, నిలబడి, పండుకొనికూడ చేయవచ్చును.

ప్రతి యోగాసనమునకూ ప్రతిక్రియాసనము ఉన్నది.

దేనిని అభ్యసించు సమయములో, లేదా అటుతరువాత ఏశరీరావయవములయందు నొప్పి గలుగునో, ఆ నొప్పి రాకుండుటకై, అథవా పోగొట్టుటకై ఈ ప్రతిక్రియాసనము ఆవశ్యకముగా అభ్యసించవలెను.

ఉదాహరణము:——మూలాసనము పశ్చిమతానము. ప్రతిక్రియ—— పూర్వతానము.

పశ్చిమతాన లక్షణము, దాని ఫలము:

"ప్రసార్య పాదౌ భువి దండరూపౌ
దోర్భ్యాం ధృతం పదాగ్ర ద్వితయం గృహీత్వా,
జానూపరి న్యస్తలలాటదేశః
వసే దిదం పశ్చిమతాన మాహుః"

ఫలము:——

"ఇతి పశ్చిమతాన మాసనాగ్ర్యం
పవనం పశ్చిమ వాహినం కరోతి,
ఉదయం జఠరానలస్య కుర్యాత్
ఉదరే కార్శ్య మరోగతాంచ నిత్యం"
(ఘేరండసంహిత)

అర్థము: సమమైన భూమిమీద రెండుకాళ్ళు జోడించి చక్కని కర్రవలె చాచి (మోకాళ్ళు ఒంగకూడదు) రెండు చేతులతో అరికాళ్ళ కొనలను పట్టుకొని ముఖము వీపుతోకూడ ముందరికి వంచి లాగి మోకాళ్ళమీద బెట్టి రేచకపూరకములను చేయుచూ 1, 2, 3, 4, 5, నిమిషముల కంటె ఎక్కువకాలము కాకుండ ఉండవలెను.

ఈ పశ్చిమతానాసనాభ్యాసమును జేయువారికి ప్రాణవాయువు సుషుమ్నానాడిలో చేరుటకు సహాయకరమై ఉత్కృష్టమైన ఆకలిని పుట్టించును. కడుపును పెంచదు. నడుమును సన్నదిగా జేయును. ఆరోగ్యమును దృఢపరుచును. ఇది యొక శ్రేష్ఠమైన ఆసనము.

ప్రతియొక యోగాసనాభ్యాసమును చేయు సమయమునందు, తన శరీరమును ముందరికి వంచినపుడు, రేచకమును పైకి ఎత్తినపుడు పూరకమునూ చేయవలసేకాని దానికి విపరీతముగా జేయరాదు.

పూర్వతానాసనము పశ్చిమతాన ప్రతిక్రియ. దీనిని చేయు క్రమము——పశ్చిమతానాసనమువలె కాళ్ళు చాచి రెండు అరిచేతులనూ పిర్రలకంటు ఒక అడుగు దూరములో సరియైన కొలతతో బెట్టి అదిమి (చేతుల వేళ్ళు వెనకకు తిప్పరాదు) పూరకమును జేసి నడుమును పిర్రలను పస్నముకొను రొమ్మును తొడలను మోకాళ్ళను చక్కని దండాకారముగా లేవనెత్తి, మడమలను మాత్రము భూమిమీద బెట్టి, కాళ్ళ బొటనవ్రేళ్లు రెంటినీ సమముగా చేర్చి, ముందరికి లాగి, మెడను తలతోపాటు వెనకకు సాధ్యమయినంతవరకూ లాగి వంచి (కండ్లు మాత్రము మూసుకొనేది) అరనిమిషము కాలము ఆస్థితిలో ఉంచేది. ఇదే పూర్వతానము పిదప రేచకమును చేస్తూ శరీరమును క్రిందికి దించవలెను. దీనివల్ల నడుములనొప్పి రెక్కల నొప్పి మోకాళ్ళ క్రింద నొప్పులు పోవును.

"పశ్చిమోత్తానవత్ పాదౌ హస్తౌ
సంప్రసార్య నయేత్ భువి,
దూరతః పృష్ఠభాగాత్తు (కటిభాగాత్తు)
ద్వాదశాంగుల మానతః,
అవష్టభ్య దృఢం భూమిం హస్తాభ్యా
మున్నమో వసన్।
ఊరుద్వయం జానుజంఘ శ్రోణీహృదయ
కంధరమ్।
ఉద్గ్య మున్నమయేత్ స్థైర్యాత్ దండ
వత్ దేహ ముచ్ఛ్వసన్॥
పార్ష్ణిద్వయం పదాంగుష్ఠద్వయం సం
యోజ్య చాగ్రతః।
ఆకృష్య తిష్ఠేత్ నేత్రేచ నిమీల్య నిమి
షార్ధకమ్॥
రేచనంచ తతః కుర్యాత్ వసుమత్యా
ముపావిశేత్।
పూర్వతాన మిదం ప్రోక్తం సంధివ్యాధి
నివారకమ్।
షడ్వార మభ్యసేత్ నిత్యం వన్యా
నాధిక మాదరాత్॥"

(యోగరహస్యము, 1 వ అధ్యాయము.)

రేచకమంటే ఊపిరిని బయటికి వదలేది.
పూరకమంటే ,, లోపలికి పీల్చేది.
కుంభకమంటే ,, బిగబట్టేది.

కొందరు 84 ఆసనములని తలచియున్నవారు——

"వసిష్ఠాద్యైశ్చ మునిభిః మత్స్యేంద్రా
ద్యైశ్చ యోగిభిః॥
అంగీకృతా న్యాసనాని కథ్యంతే కానిచి
న్మయా॥"

(హ. యో. ప్ర. ఉ-1-శ్లో. 18)

అనగా వసిష్ఠులు మొదలైన మునులచేతను మత్స్యేంద్ర, గోరక్షకులు మొదలైన యోగులచేతనూ అంగీకరింపబడిన, లెక్కలేని ఆసనములలో కొన్నిమాత్రము నాచేత చెప్పబడియున్నవి అని తాత్పర్యము.

ఈ శ్లోకమునూ,

"ఆసనానిచ తావంతి యావంతో జీవ
రాశయః"

అని ధ్యానస్థబింబూప నిమిత్తములో సుందర హేమాణవచనములను చూచి సంకోచమును వదలగలరని నమ్ముతాను.

(ఇంకా ఉన్నది)

ఆక్షరరామాయణంలో అహల్య

(9-వ పేజీ తరువాయి)

[కన్నులలో కాగడాలు వెలిగించుకుని గౌతముడు నాలుగు జాములూ జాగరణం - ప్రాణం విసిగింది. ఆశ్రమమార్గంపటి తన కుటీరం చేరేడు. తెలతెలవారుతోంది. పాతధారలు ప్రదర్శనాయాసంతో యథాతథంగా ఒకే శయ్యమీద నిద్రించేరు. ముని వారి స్థితి కిటికీగుండా పరిశీలించి నిలువునా నీరు - దొంగనిద్రపోతున్న జనతి తన కన్నాగం ఫలించినందుకు మురిసిపోతూ దిగ్గున లేచి పెరటివైపు దాటుతుంది - వసారాలో కూలబడిపోయేడు అమాంతంగా గౌతముడు - ఏదో బాధ - ఏదో వేదన - గుండెలపై వేయి సమ్మెట పెట్లు.]

[గౌతముడు - అహల్య]

"అన్నన్నా? ఎంత మోసం? ఎంత సాహసం? "కాతే కాంతా?" పైకి బ్రహ్మాండమైన నటన - లోలోపలి యీ ప్రవృత్తి - ఇహ నా ఆశ్రమం వ్యర్థం - సర్వథా...పతితం (తెలివితెచ్చుగొని) ఆశ్రమానికేమి? అది దాని కర్మ - ఇది నాకర్మ ......(అజ్ఞానావృతుడై) ఏమైనా స్త్రీ ప్రవృత్తి సందేహాగ్రస్తం. (బాధతో అదే పనిగా మూలుగు.)

"(మేలుకొంచి) ఏమిటా మూలుగు? జనతీ—జనతీ! ఏదీ? వసారాలో ఎవరో? పురుషుల కంఠధ్వని-కాదు వక్కి వెక్కి... (ఆవైపు పరుగెత్తి) అయ్యో! పతిదేవులు - గౌతములు. ఎప్పుడు దయచేసేరు? అలా వున్నారేమి? మన చిరంజీవి కుశలమేనా? పలకరూ? అయ్యో! ఏదో ఓహూయిత్వం (గొల్లున ఏడ్చును.)

"ఓసీ - జారిణీ! ఎంత జాతిగుండెలే నీవి? ఎంత దుర్నయం? - ఎంత నటన? - మొగుణ్ని కొట్టి మొసాలెత్తుతున్నావు"

"ఆ...ఆ...జారిణి - జారిణి - నన్నేనా స్వామీ! మీరు మీరై అంటున్న మాట లేనా యివి? పలవరింతలా?...నాయన కుశలమా? మీ విచారం నన్ను వేయిఅంపాలతో తరిగివేస్తోంది - అబ్బాయి - చిరంజీవి...కుశలం...త్వరగా చెప్పరూ?"

"ఎంత వగలాడివే! జారవనితలు పాషాణ హృదయలు - చూస్తూ ఉండగా నేనా కళ్లల్లో కారంకొడుతున్నావు - నీ ప్రకృతి జాతి ప్రకృతి - నీ హృదయం శిలామయం - తథాస్తు - తథాస్తు - పో - పో. నా దృష్టికి దూరము...జారిణీ"

"అమ్మో! శపించకండి — జారత్వమా - జారిణినా - మానీ! పతీ! మహర్షి - ఏమి భ్రాంతి? అగ్గికి చెదలా? ఏమా తొందరపాటు? (కాళ్లు తడవుకొని) అయ్యో, అయ్యో! జారూపు. శిలా ప్రకృతి-హంత! ఈ అహల్య నిర్దోషిపతీ! వట్టి భ్రాంతిలో పడ్డారు - అన్నన్నా! మొలవఱకూ శిలాకారం - తత్వం తెలిసి దయచూపండి - మీ దివ్యదృష్టి - తమ యోగదృష్టి - అంతా కరతలామలకంతమకు - [సొమ్మసిల్లి అహల్య శిలా ప్రకృతిగా మారిపోతోంది]

"ఆ - దివ్యదృష్టి · యోగదృష్టి - (అరగడియలో అర్థంచేసుకుని అతి దుడుకుతో) అన్నన్నా! ఎంత ప్రమాదం? అహల్యా! అల్యా! పత్నీ - పత్నీ (సమీపించి చేతితో నిమురుతూ) అయ్యో! మెడవఱకూ శిల - నల్లశిల - ఎంత తొందరపాటు? అహల్య నిర్దోషి - నాది భ్రమ— (అహల్య చెవిలో) అవతారమూర్తి పాదధూళితో నీకు మోక్షం. ధర్మపత్నీ నా పొరపాటు మన్నించు (అహల్య ఒక్క కన్నీటిధార జార్చి శిలాప్రకృతి అయిపోతుంది. స్పృహ తప్పిపోయి ముని ఆమె చెంత ఒరిగేడు)

"(జనతి లోలో) ఇక్కడికి నారదుని సలహా - నాన్నగారి యత్నమూ - నా కృషీ ఫలించినాయి."

[పైకి జనతి చాలాకంగారు నటించింది. చెంతనున్న మునులు పరిస్థితి గమనించి తక్షణం శతానందుని రప్పిస్తారు - అతని ప్రవేశం.]

"(అతి ఆతురతతో అమ్మ శిలాప్రతిమను చేరి) అమ్మా! అమ్మా! పలకవూ? అమ్మ యేదీ? తండ్రీ! ఏది అమ్మ? ఏమిటీ పరిణామం? ఎవరిదీ అవినీతి? అమ్మని శిలగా మార్చిన దెవరు?"

[నోట మాటరాక సంజ్ఞా మాత్రంగా సూచిస్తాడు గౌతముడు.]

"సరే! మీకీ శ్రమయెందుకు? (దివ్య

★ ఆర్షరామాయణంలో అహల్య ★

ప్రసారించి) ఆ - అవగతమైంది -
య్య మంత్రాంగమూ - నారదుని
లోచనా - జనతి వైకృతీ - వీని ఫలితా
షరే - జనతీ! జనతీ! ఎక్కడ? -
ాచివి - పుట్టింటి పక్షపాతం
ంచుగుని అమ్మని నీపొట్ట పెట్టు
వు. ఎంత చిత్రనాటకం ప్రదర్శిం
అమ్మని తాతిగా చేయించిన
సీ! పిశాచీ! నీది రాక్షస ప్రకృతి -
- తథాస్తు. పో - పో నా దృష్టికి
ము - యక్షీ - పో"

యొ్యా స్వామీ! అవతల
లముదల - రాజ్యభ్రష్టులై -
పాలైనవారికోసం - గడ్డికరిచేనుపతీ -
కార్యం ప్రథమ తప్పిదం [అంటూ
గానే వికృతాకారం] అయ్యో!
య్యో! శాపమా! ఇంత దావాగ్ని చల్లు
నామీద? అమ్మో! అమ్మో! ఏమిటీ
కరరూపం? నాలో నాకే భీభత్సం -
చలేను - మీ శాపాక్షరాలని తిప్పి
ండిపతీ!

అవి శిలాక్షరాలు - తిరుగవు - చెర
- పో - రక్కసీ - క్రవ్యాదీ - పోపో -
ా - "

ఎరగను స్వామీ! చిన్నతనంచేష్ట -
తత్వం అర్థంకాక చేసిన అకృత్యం -
ంచుపతీ! శమించుమానీ - శాపాంతం -
కృతప్రకృతి దుర్భరం - శాపాంతం"

"ఘాతుకురాలా! వ్యర్థంగా నామాతృ త్రిని నీ పొట్ట పెట్టుగున్నావు - నీకు శాపాంతమా - లేదు - లేదు - దయకే తావులేదు - ఊహు"

"(పాదాలపైపడి) మానీ - తెలియక చేసిన దీపని - అనుభవమూ - దూరదృష్టి - నావంటి.........ఏమైనా విడువను - అమృతం - శాపాంతం"

"తాకకు - తాటకా - అంటకు - బంధకీ"

"పశ్చాత్తాపం పడుతున్నా - తామ బ్రహ్మర్షుల సంతతి - దయ - వాత్సల్యం - అనుగ్రహం—"

"కాబట్టే నీకీ గతి - (కాళ్ళతో తన్ను తు జనతి దీనాతిదీనంగా గడగడలాడుతూ - కొంతవడికి శతానందునికి జాలి) అర్ధాంగీ - కాదు రక్కసీ - నాతల్లిని యథాస్థితికి తేగల వాడే నీకూ గతి - ఆర్షతత్వం అర్థం చేసుగో - ఏపాత్ర నీవు నిర్వహించేవో - వాని బ్రహ్మ హత్యతో నిండిన మలదకరూశాలే నీ నివాసం - ఆకరూశమే నీ భుక్తి - పో - బంధకీ."

[మహోగ్రతపతో తన ప్రకృతిమాతే తాటక పశుప్రవృత్తికి దిగుతుంది. శతానందుడు - తల్లి జయించిన రాజ్యం తిరిగి మామగారి కిచ్చివేస్తాడు.] ★

★ కాలక్షేపం ★

(4-వ పేజీ తరువాయి)

బండరాయి మెల్లిగా నీళ్ళలోకిజారి మాయమైంది. అరవై ఏళ్ళ భద్రయ్య అకస్మాత్తుగా వెనుకకు విరుచుకొనిపడ్డాడు. నడుము విరిగినంత పనిఅయింది. ఆ కంగారులో ఆయనకెక్కడ దెబ్బ యిబ్బడిగా తగిలిందో అప్పుడు చెప్పలేకపోయినాడు. ప్రక్కనే సాదాయిసుక నేలమీద రేవులో నిలువబడిన వియ్యంకుడు రుద్రయ్య తనరెండుపాదాలు దగ్గరచేర్చి తన పాదాలనే నమ్ముకొని ఆ పాదాలమీదనే ధోవతీ ఉతికి నీటిలో జాడించి నీళ్ళు పిండి నిశ్చలంగా నిల్చున్నాడు. భద్రయ్యగారు వెనుకకు పడిపోవడంచూచి పరుగెత్తుకొనివచ్చి లేవదీశాడు. "ఏమిటిది? బావా! భద్రంగా బట్టలు ఉతుక్కుంటున్న బండరాయి. పాదాల క్రిందనుంచి ప్రవాహ జలంలోకి పరువెత్తడం ఏమిటి?" అని ప్రశ్నించాడు. ఇంతలో ప్రక్కనున్న ఒక పండారీ(అనగా క్షేత్రయాత్రామార్గదర్శకుడొకడు) "అయ్యా! అది నల్లబండ రాయికాదు. అది తాబేలు" అని చెప్పాడు.

ఏమైతేనేం? భద్రయ్య అది ఎంత భద్రమైన రాయి అనుకొన్నాడో అంత ఉపద్రవం కల్పించింది. యాత్రముగించి స్వగ్రామం చేరినతర్వాత ఆ దెబ్బవల్ల ఏర్పడిన నొప్పివల్ల కాలు స్వాధీనంలోకి రాలేదు. మంచం ఎక్కి కొన్నాళ్లకు పరలోకగతుడైనాడు. కాలిక్రిందనుంచి నడచిపోయింది తాబేలు అన్నట్లుగా ఆయన జీవితకాలం అంతా అదేవిధంగా గతించిపోయింది. ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు ఎన్నో ఆశలు విఫలమైనాయి. కొత్తగా నాటిన అంటుమామిడితోట యింకా ఫలితానికి రాకపూర్వమే ఆ తోటలోని పళ్లు యింకా ఆయన ఆరగించకపూర్వమే ఆయన పండి రాలిపోయినాడు. కోర్టులో దాఖలుచేసిన దావాలో తనపక్షం కోర్టువారు తీర్పు చెప్పబోయే ముందు, సదరు తీర్పు ప్రకారంగా సుక్షేత్రమైన పాతిక యకరాల ఆస్తి తనకు భుక్తం కాబోయే ముందు, కాలధర్మం అయినాడు. ఇవన్నీ భద్రయ్య తలుచుకుంటూ ఉండేవాడు. అంటుమామిడితోట పళ్లు తింటానో తిననో? అని పరితపించేవాడు. పాతిక యకరాల భూమి స్వాధీనం చేసుకొని స్వయంగా సాగు చేస్తానో చేయనో అని చివరి రోజులలో కలువరించాడు. వియ్యంకుడు రుద్రయ్య అనేక విధాలుగా చెప్పాడు. "బావా! ఈ కోరికలకు అంతు లేదు" అన్నాడు "నీమనస్సు నీవు నిబ్బరంగా ఉంచుకుంటే, ఇంకా ఎన్నేళ్లయినా బ్రతుకవచ్చు. మనస్సును నిశ్చలంగా ఉంచుకోంటేచాలు. వెధవ మామిడితోట స్మరణకంటె, రామనామస్మరణ చేసుకో" అన్నాడు. భద్రయ్యకంటె రుద్రయ్య తక్కువ ఆస్తిపరుడైనా, అసలైన ఆస్తికుడు. భద్రయ్యకంటె రుద్రయ్య నిశ్చింతగా నిద్దురపోయి, సుఖంగా జీవించి, కాలం గతించి పోతున్నదనే వ్యాకులం లేకుండా కాలక్షేపం చేస్తున్నాడు. మొన్న సంక్రాంతి పండుగనాడుకూడా సతీసమేతంగా స్నానంచేసి, సహస్రనామపూజ చేసికొని, షడ్రసోపేతంగా ఆరగించాడు. హరి నామస్మరణ చేసుకుంటూ హాయిగా ఉన్నాడు - తాబేలు నమ్మి తాబేలైన (బేలఅయిన - మోసపోయిన) వియ్యంకుడగు భద్రయ్యవంటివాడు కాడురుద్రయ్య. ★

★ అంగుడు పొద్దు ★

(25-వ పేజీ తరువాయి)

చిగినోడు మల్ల ఎక్కడు. ఇట్ల తెల్లారగట్ల దాక జదివినోడు మల్ల జదువకుండ జది వింది పాటలు. నాత్తిరాయె ఏం పనిలేక పాయెనని పోయికూకున్న. తపుల, తాలం, ఆర్మొని, మద్దెల, ఏది లేకుండనె జదువు తాంరు. ఒగలో రాగంల జదివితె ఇంకో లింకో రాగంల జదివిరి. అయ్యన్ని అల్లు గట్టిన కయిత్తాలట. అయితే రాగంలేకుండ జదువాన్నా? మనూరు పొట్టిలింగడు కయిత్తం గడితె ఏం కమ్మగ జదువుతడు. తాలం లేకపోతే మానాయె చేతులున్నయి గదా? చప్పట్లు గొడితె అరిగిపోతాయి? పాటంత అయిపోయినాంక అందరు గొడ్డ లేమె చప్పట్లు? తాలం గలిసెటట్లు అల్లకు గొట్టరాదా?" ఎరుకలేని మల్లయ్య పటే లయ్య కేమన్న ఎరుకనేమొ అని అడిగిండు.

"కాదోయి పిచ్చిమల్లయ్య, అంతయి పోయిన మోలిగ చప్పట్లు గొడితె, అల్లు చదివింది మంచిగున్నదన్నట్లు" పట్నం పోయిన మల్లయ్యకు తెలువ జెప్పిండు పల్లె టూరు పటేలు. "గట్లనా? మరె అన్నిటికి గట్లనె కొట్టింరు, అన్ని మంచిగున్నయ నేనా? ఏమొ అల్లుగొట్టిన కొద్ది నేను గొట్టిన. దొమ్మరాట జూడంగ గొట్టినట్లు. తెల్లారగట్లదాక అట్లనె పాటలినుకుంట గూకున్న. ఇగ తెల్లారినమోలె అందరు ఎల్లపోతాంరు అందరికి విస్తర్లు గట్టాలె. అల్లవిస్తర్లన్ని లారీలల్లనింపి అల్లందరిని శేస నకు సాగదోలెదాంక, నిద్దురవోలె. అల్లంద రెల్లిపోంగనె ఆనాడు నాత్తిరిదాక పందిల్లి చుట్ల బెట్టింరు. ఒక్క పూటల అంతఇచ్చి పెట్టినం. నాలుగురోజులు కట్టపడి తయారు జేసిన పందిరి ఇచ్చుడుకు దప్ప మాకేంద కక్కరికచ్చినట్లు?" మల్లయ్యడిగిన ఈ పెద్ద ప్రశ్న. "— వేడుక బొమ్మరిండ్లు డిసుకలో బాగొప్ప నిర్మించి" పటేలయ్యనీ పద్దెం జదివేటట్లు జేసింది. ఏకో మనకోసం రజా కార్లోల్లను ఎదుర్కొని రాజ్జం సంపా యించిపెటె సబలు జేసుకుంటున్న పెద్ద పెద్దగ సదువుకున్నోల్లకు మేం జేయగలిగినంత లెక్కలకట్టం జేత్తనె ఉన్నం. పనంత అయిపోయినమోలె నాటిగు జొన్న రొట్టెలు సద్దిగట్టిచ్చి సాగదో లింరు?" మల్లయ్య జెప్పిన సబసంగతి పటేలయ్య బాగానే ఇన్నడు కాని పటే లయ్య యినాలనుకున్నది, సబల జెప్పిన మాటల సంగతి, అది మల్లయ్య కేమెరుక? ఇంతలకె "ఏం పంతులుగారూ? అంతా బాగేనా?" అనుకుంటచ్చిండు ఆ వూరి అయ్యోరెంకయ్య. అయ్యోరెంకయ్యగూడ సబజూడ వోయిండు పట్నం. మల్లయ్యంత ముందుగ పోలేదుగని, మల్లయ్యకంటె ముందుగనె వచ్చిండు. "ఎంకయ్య పంతు లోటి ఇయ్యాల్రేపు మాటే బంగారమయి పోయింది మల్లయ్యా, పట్నాలకుపోతాండు సబలల్ల దిరుగుతాండు. మన సంగతే మరచి పోతాండు." పటేలయ్య. తాను ఎంకయ్య పంతులుకిచ్చిన దానాలన్ని యాదికిచ్చె టట్టన్నడు "మీరుగూడా అలాగే అంటెట్ల పటేలుగారూ? మీ నీడన్నే మేం బతు కులు వెళ్ళబోసుకుంటు ఉంటి మల్లయ్య ఏంది? మీరందరి బతుకు. మిమ్ముల్లను మరచి నక్క విసయం జూపిచ్చు అయ్యోరు. "ఏదో అట్లన్న సబలకువోతివి సంగతులు జెప్ప సడుగుతె ఇంతసేపు(ఏమే. ఆలు జెప్పిన మాటలు ఒక్కటి కోరికదీరని పటేలు ఎంక డీమాటు.

"ఐతె అయ్యగారూ వి నారుం(ని పట్నం సబలకు? వచ్చి కలువకుండ పోతి మల్లయ్య అడిగిండు. "ఆ జూచిన. నువ్వు నాకు మా కన నన్ను జూల్లేగు" అయ్యగా మీద నె తప్పంత మోపాల్న "నేను కూసుకుంటె సూడకి నోల్లు మీరిన్న పిలుత్తె మాట్లాడ మల్లయ్యడిగిన సవాలుకు అయ్ దగ్గర జవాబు లేదు. అయ పాపం పట్నంల మల్లయ్య య్యాళ్లని మా అనుకున్నడ చుట్టున్న సోపతిగాన్లు నల్ల మల్లయ్యతోని మాట్లాడుతాం తరేమొనని పిచ్చి ఊరుకున్నడ మల్లయ్యకు జెప్పటానికి ఎం లెట్లుస్తది? ఎంకయ్య జవాబి టాల్లకు మల్లయ్యకు గొంత అయింది. తనను తనూరి ఎంక మాపు జూసిండను కనెటాల్ల కొనుండ బుద్ధిగాలె. పొద్దంగ య్యకు ఇంట్లనాగండ్లు గట్ట జ ఈడుంటె ఇగ ఎంకయ్య సంగతి ఇనాలె. పట్న బోయిండో ఆ సబల సంగ బోయినా అందని సబలసంగ డెందుకు?

మల్లయ్య అన్నం చెల్లిపోం అంగుతుంది తల్లి కడుపులకు ...

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty